శుక్రవారం
14•2•2020
కరీంనగర్
•వెల. రూ. 6.50
•సంపుటి 9 •సంచిక 230
•పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE




PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD






**'ఉరి'కి ఇంకెన్నాళ్లు?**

నిర్భయ దోషులను త్వరగా ఉరితీయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు బయట నిర్భయ తల్లి ఆశాదేవి తదితరుల నిరసన

## నా మానసిక స్థితి బాగాలేదు

### జైలు అధికారులు వేధించారు.. నిర్భయ దోషి వినయ్ కొత్త నాటకం



**న్యూఢిల్లీ:** నిర్భయ కేసులో ఉరిశిక్ష నుంచి తప్పించుకోవడానికి దోషుల్లో ఒకడైన వినయ్ శర్మ మరో కొత్త నాటకానికి తెరతీశాడు. తన క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి కోవింద్ తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్ మీద విచారణ సందర్భంగా వినయ్ శర్మ తరపు న్యాయవాది ఏకే సింగ్ మాట్లాడుతూ.. వినయ్ శర్మ మానసిక పరిస్థితి సరిగా లేదని, జైల్లో అతడిని మానసికంగా వేధించడంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడని కోర్టుకు తెలిపారు. అయితే, కేంద్రం తరుపున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ వాదనల్ని ఖండించారు. దోషి వినయ్ శర్మ మానసికంగా ఆరోగ్యంగానే ఉన్నాడని పేర్కొంటూ.. వినయ్ శర్మ మానసిక పరిస్థితిపై వైద్యులు ఇచ్చిన నివేదికను కోర్టుకు సమర్పించారు. దీంతో దోషి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం తీర్పునిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. మరోవైపు, నిర్భయ కేసు దోషుల్లో మరొకడైన పవన్ గుప్తా తరుపున వాదనలు వినిపించేందుకు ఢిల్లీ కోర్టు ఓ న్యాయవాదిని నియమించింది. దోషులకు తాజా డెత్ వారంట్ జారీ చేయాలన్న ఢిల్లీ ప్రభుత్వం పిటిషన్‌పై సోమవారం వాదనలు వింటామని పేర్కొన్నది.

## నాడు 15 లక్షల మందిని చంపారు!

### ఆర్మేనియన్ జన హననాన్ని గుర్తించిన సిరియా.. వందేండ్ల క్రితం జరిగిన ఘటనకు ఖండన

**డమస్కస్:** శతాబ్దం క్రితం జరిగిన ఆర్మేనియన్ల జాతి సంహారాన్ని సిరియా పార్లమెంట్ గురువారం నాడు గుర్తించింది. మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో 1915-1917 మధ్య దాదాపు 15 లక్షల మంది ఆర్మేనియన్లను ఓట్టొమన్ (ప్రస్తుత టర్కీ) రాజులు సామూహికంగా సంహరించారని సిరియా పార్లమెంట్ పేర్కొంది. నాటి మారణకాండను ఖండిస్తున్నామని తెలిపింది. టర్కీతో ప్రస్తుతం తీవ్రస్థాయిలో సాయుధ ఘర్షణలు జరుగుతున్న సమయంలో సిరియా శతాబ్దం క్రితం జరిగిన ఘటనను వెలుగులోకి తేవడం గమనార్హం. ఓట్టొమన్ రాజ్యంలో దాదాపు 15 లక్షల మందిని సామూహికంగా సంహరించారని, ఈ హత్యాకాండను అంతర్జాతీయ సమాజం గుర్తించాలని ఆర్మేనియన్లు నాటి నుంచి కోరుకుంటున్నారని సిరియా పార్లమెంట్ తెలిపింది. అయితే ఈ ఆరోపణలను టర్కీ ఖండించింది. మొదటి ప్రపంచయుద్ధంలో ఆర్మేనియన్లతోపాటు తుర్కులు కూడా మరణించారని.. అయితే వేల సంఖ్యలోనే మరణాలు సంభవించాయని, లక్షల్లో కాదని వివరించింది. వాయవ్య సిరియాలో బుధవారం జరిగిన ఘర్షణల్లో సిరియా తమ 14 మంది సైనికులను హతమార్చిందని టర్కీ ఆరోపించింది.



# ఢిల్లీ ప్రకంపనలు



- పార్టీ నేతల విద్వేషపూరిత వ్యాఖ్యలు నష్టం కలిగించాయి
- ఢిల్లీ ఫలితాల విషయంలో నా అంచనా తప్పింది
- ప్రజలు బీజేపీని తిరస్కరించలేదు
- నన్ను చాణక్యునితో పోల్చవద్దు
- అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపై అమిత్‌షా

# 'గోలీ మారో' కొంపముంచింది

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తన అంచనా తప్పిందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎదురైన భారీ పరాభవంపై ఆయన గురువారం స్పందించారు. 'గోలీ మారో (కాల్చి పారేయండి)', 'ఇది ఇండో-పాకిస్థాన్ మ్యాచ్' వంటి విద్వేష వ్యాఖ్యలు తమ పార్టీ నేతలు చేసి ఉండాల్సింది కాదని.. ఆ ప్రసంగాలే తమకు నష్టం చేసి ఉంటాయని అమిత్‌షా అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో గెలుపోటముల కోసం బీజేపీ పోటీ చేయదని, తమ భావజాలాన్ని విస్తరించాలన్న లక్ష్యంతోనే తాము ఎన్నికల బరిలోకి దిగుతామని చెప్పారు. 'టైమ్స్ నౌ' మీడియా సంస్థ గురువారం ఢిల్లీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అమిత్‌షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ నేతలు కొందరు చేసిన విద్వేషపూరితమైన వ్యాఖ్యల వల్లే బీజేపీ ఓడిపోయిందని అంగీకరించారు. ఢిల్లీ ఎన్నికల విషయంలో తన అంచనా తప్పిందని, అయితే ప్రజలిచ్చిన తీర్పును పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)కి వ్యతిరేకమైనదిగా భావించలేమని చెప్పారు. 'ఢిల్లీలో 45 సీట్లు గెలుస్తామన్న నా ట్వీట్‌కు ఎన్నికల ఫలితాలకు పొంతన లేదు. అది కేవలం నా అంచనా మాత్రమే.. అంచనాలు కొన్నిసార్లు తప్పుతుంటాయి. మేము ఓడిపోయినంత మాత్రాన ఢిల్లీ ప్రజలు బీజేపీని తిరస్కరించినట్టు కాదు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మూడోస్థానంలో నిలిచింది. అంటే అప్పుడు ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్‌ను తిరస్కరించినట్టు కాదు కదా? ఎన్నికల ఫలితాలు సిద్ధాంతాలకు ప్రతిబింబం కాదు. ఢిల్లీ ఎన్నికల్లో మేము కేవలం ఒక్క అంశంపై పోరాడలేదు. ప్రచారం సందర్భంగా షాహీన్ బాగ్ నిరసనలను ఒక అంశంగా ప్రస్తావించాం.. ఆ సమస్య ఇంకా కొనసాగుతున్నది. ఈవీఎంలో కమలం గుర్తుపై గట్టిగా నొక్కండి.. ఆ కరంటు షాక్ షాహీన్‌బాగ్‌లోని వారికి తగలాలి అన్న నా వ్యాఖ్య కేవలం ప్రజలు ఆ సమస్యను అర్థం చేసుకోవాలన్న ఉద్దేశంతో చేసినదే' అని అమిత్‌షా చెప్పారు.

**సీఏఏతో నాకు వ్యక్తిగత ప్రయోజనం లేదు**

'ఇక సీఏఏతో నాకు వ్యక్తిగతంగా ఎటువంటి ప్రయోజనం లేదు. దేశానికి ఏది మంచిదైతే నేను అది చేస్తాను. సీఏఏ గురించి ఎవరైనా వచ్చి నాతో చర్చించవచ్చు. నా కార్యాలయానికి వచ్చి సమయం కోరితే మూడు రోజుల్లోనే వారిని కలుస్తాను. జర్నలిస్టులు కేవలం సీఏఏ వ్యతిరేక నిరసనల గురించి మాత్రమే మాట్లాడకూడదు..అసలు ప్రజలెందుకు ఆందోళన చేస్తున్నారో రాయాలి. బీజేపీ ముస్లింల వ్యతిరేక పార్టీ కాదు. మాకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదు. మతం ఆధారంగా మేము ఎవరి విషయంలోనూ వివక్ష చూపలేదు. దేశ ప్రజలకు మరోసారి స్పష్టం చేస్తున్నాను.. సీఏఏలో ముస్లింల వ్యతిరేక నిబంధనలేవీ లేవు. ఎన్నార్సీపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఇటీవలే పార్లమెంట్‌లో స్పష్టం చేశాను. నా వ్యాఖ్యలను వక్రీకరించకండి. (ఎన్నార్సీపై) నిర్ణయం తీసుకుంటే మీకు (మీడియా) తప్పకుండా చెప్తాం. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ విషయంలో ప్రతిపక్షాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పౌరసత్వాన్ని రుజువు చేసుకొనేందుకు మీరు ఎటువంటి పత్రాలు చూపించనవసరం లేదు. మీకు తెలిసిన వివరాలు చెప్పండి చాలు' అని అమిత్‌షా పేర్కొన్నారు.

**చాణక్యుడి ముందు నేనెంత?**

'భారత రాజకీయాలలో చాణక్యునిగా నన్ను నేను పరిగణించుకోలేదు. నేను చాణక్యుడినని ఎప్పుడూ చెప్పలేదు. చాణక్యుడి గురించి పుస్తకాల్లో చదువుకున్నాను. ఆయనముందు నేను ఎందుకూ పనికిరాని వాడిని. చాణక్యుడితో నన్ను పోల్చవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. భారత్‌ను ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తానని మోదీజీ చెప్పారు. ఆ కలను మోదీజీ నెరవేర్చగలరన్న నమ్మకం నాకుంది. నా చివరి శ్వాస వరకు నేను బీజేపీలోనే ఉంటాను' అని అమిత్‌షా చెప్పారు.

### కేంద్రాన్ని నొప్పించకుండా..

# కేజ్రీవాల్ ప్రమాణం

### ఇతర రాష్ట్రాల సీఎంలను, పార్టీల నేతలను ప్రమాణస్వీకారానికి ఆహ్వానించడం లేదన్న ఆప్

### 'బుల్లి కేజ్రీవాల్'కు ప్రత్యేక ఆహ్వానం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించినప్పటికీ కేంద్రంతో వైరం పెట్టుకునే ఉద్దేశం తమకు లేదన్న సంకేతాలను ప్రమాణస్వీకారం సందర్భంగా కేజ్రీవాల్ పంపనున్నారు. ఈ మేరకు ఈ నెల 16న జరుగనున్న ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఇతర రాష్ట్రాల సీఎంలను, బీజేపీయేతర నాయకులను ఆహ్వానించడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ శాఖ కన్వీనర్ గోపాల్ రాయ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ ఈ నెల 16న ప్రమాణం చేయనున్నారు. అయితే సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలకు ఇతర రాష్ట్రాల సీఎంలను, ప్రముఖ రాజకీయ నాయకులను ఆహ్వానించడం ఆనవాయితీ. కానీ కేజ్రీవాల్ మాత్రం ఎవరినీ ఆహ్వానించడం లేదు. ఎందుకంటే ఇతర రాష్ట్రాల సీఎంలను, నాయకులను పిలువడం ద్వారా తాము కేంద్రంతో వైరంగా ఉంటామనే సంకేతాలు వెలువడే ప్రమాదముంది. అందుకే పిలువడం లేదు. ఇదే సమయంలో ఎవరిపట్ల తమకు దురుద్దేశం కూడా లేదు' అని పేర్కొన్నారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం ఢిల్లీకి చెందిన ఏడుగురు బీజేపీ ఎంపీలను, ఇటీవల ఆ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను పిలిచే అవకాశముందని వివరించారు. మరోవైపు ఢిల్లీ ఎన్నికల ఫలితాల రోజు ఆప్ కార్యాలయం వద్ద అందరి దృష్టిని ఆకర్షించిన బాలుడు ఆవ్యాన్ తోమర్‌ను ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆప్ ఆహ్వానించింది. కేజ్రీవాల్ ఎలాగైతే స్వెటర్ ధరించి, మఫ్లర్‌ను మెడకు చుట్టుకొని, ఆప్ టోపీతో కనిపిస్తారో.. తోమర్ కూడా ఎన్నికల ఫలితాల రోజు అలాంటి వస్త్రధారణతో కనిపించి అందరి హృదయాలను దోచుకున్నాడు. చివరికి కేజ్రీవాల్‌లాగానే కండ్లద్దాలు, మీసాలను (మేకప్) కూడా కలిగి ఉన్న ఆ బాలుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఆ బాలుడిని కేజ్రీవాల్ ప్రమాణానికి ఆహ్వానించామని ఆప్ వర్గాలు తెలిపాయి.

## విదేశాంగ సంస్థలకు 'సుష్మ' పేరు



### దివంగతనేత జయంతి సందర్భంగా కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** విదేశీ వ్యవహారాలకు సంబంధించిన రెండు ప్రముఖ సంస్థల పేర్లను మారుస్తున్నట్టు విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. శుక్రవారం మాజీ విదేశాంగ మంత్రి, దివంగతనేత సుష్మా స్వరాజ్ పుట్టినరోజు. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలోని 'ప్రవాసి భారతీయ కేంద్ర'ను 'సుష్మాస్వరాజ్ భవన్'గానూ, 'ఫారెన్ సర్వీస్ ఇనిస్టిట్యూట్'ను 'సుష్మాస్వరాజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ సర్వీస్'గా మారుస్తున్నట్టు వెల్లడించింది. విదేశాల్లోని భారతీయులకు సుష్మ అందించిన సేవలు, విదేశాంగ మంత్రిగా పనిచేస్తున్నప్పుడు విదేశీ దౌత్యంలో ఆమె అందించిన సహకారానికి గుర్తుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.

## రూ.30వేల కోసం ఐదుగురి హత్య!

### 'భజనపుర' కేసులో నిందితుడి అరెస్ట్

**న్యూఢిల్లీ:** ఈశాన్య ఢిల్లీలోని భజనపురలో ఐదుగురు కుటుంబ సభ్యులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన కేసును పోలీసులు ఛేదించారు. వారి సమీప బంధువే వారిని హత్యచేసినట్లు గుర్తించారు. ఆ కుటుంబం నుంచి తీసుకున్న రూ.30,000 అప్పును తీర్చడం ఇష్టంలేకే నిందితుడు ప్రభునాథ్ వారిని హత్యచేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ-రిక్షా డ్రైవర్ శంభు చౌదరి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు వారి ఇంటి తలుపు పగులగొట్టి చూడగా.. చౌదరితోపాటు ఆయన భార్య, ముగ్గురు పిల్లల మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీటీవీ ఫుటేజితో నిందితుడిని గుర్తించారు. ఈనెల 3న హత్యలు చేసినట్టు నిందితుడు అంగీకరించాడు.

## లక్నో కోర్టులో బాంబు పేలుడు

### ముగ్గురు లాయర్లకు గాయాలు

### న్యాయవాదుల వర్గాల మధ్య ఘర్షణే ఘటనకు కారణం



కోర్టులో స్వాధీనం చేసుకున్న పేలని బాంబులు




మాట్లాడుతున్న సంజీవ్ కుమార్

**లక్నో, ఫిబ్రవరి 13:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో కోర్టులో గురువారం బాంబు పేలుడు కలకలం రేపింది. ఈ ఘటనలో ముగ్గురు న్యాయవాదులు గాయపడ్డారు. రెండు న్యాయవాద వర్గాల మధ్య ఘర్షణే ఘటనకు కారణమని పోలీసులు తెలిపారు. కోర్టు పరిసరాల్లో రెండు పేలని నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తన చాంబర్ బయట పేలుడు సంభవించిందని ఒక న్యాయవాది పేర్కొనగా, పేలుడును ఎవరూ వినలేదని పోలీసులు చెప్పడం గమనార్హం. కొంతమంది న్యాయాధికారులపై తాను ఫిర్యాదు చేయడంతో తనను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగిందని లక్నో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సంజీవ్ కుమార్ తెలిపారు. ఉదయం 11.30 గంటల సమయంలో సుమారు 10 మంది తన చాంబర్ వెలుపల బాంబులు విసిరారని చెప్పారు. తనతోపాటు మరో ఇద్దరు గాయపడ్డారని పేర్కొన్నారు. ఒక బాంబు పేలిందని, మరో రెండు పేలలేదని తెలిపారు. జిల్లా కోర్టులు ఉన్న కలెక్టరేట్‌లో భద్రతపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. తనకు భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. జాయింట్ పోలీస్ కమిషనర్ నవీన్ అరోరా మాట్లాడుతూ.. నాటుబాంబులతో తనపై దాడిచేశారని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీతూ యాదవ్, మరో ముగ్గురిపై సంజీవ్‌కుమార్ ఫిర్యాదుచేశారని చెప్పారు. ఘటనా స్థలం నుంచి రెండు నాటుబాంబులు స్వాధీనం చేసుకున్నారని, ఘటనపై దర్యాప్తును ప్రారంభించామని తెలిపారు. బాంబు శబ్దాన్ని ఎవరూ వినలేదని, సంజీవ్‌కుమార్‌కు ఎలాంటి గాయాలు కాలేదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. కలెక్టరేట్, జిల్లా కోర్టుల వద్ద భద్రతను సమీక్షించి బలోపేతం చేస్తామని చెప్పారు. పేలుడు ఘటన వార్త తెలియగానే, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు కోర్టుకు చేరుకుని, తమకు భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. తమపై దాడులు జరుగడాన్ని నిరసిస్తూ గత నెలలో ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళన చేపట్టారు.

## బెంగాల్ బీజేపీలో డైలమా

### సీఏఏ, ఎన్నార్సీ మీద దూకుడు వైఖరిపై భిన్నాభిప్రాయాలు

**కోల్‌కతా:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం నేపథ్యంలో సీఏఏ, ఎన్నార్సీపై దూకుడు వైఖరిని కొనసాగించాలా వద్దా అన్నదానిపై పశ్చిమబెంగాల్ బీజేపీ నేతల్లో భేదాభిప్రాయాలు నెలకొన్నాయి. రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాది జరుగనున్న ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నేతలు రెండు శిబిరాలుగా విడిపోయారు. లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లోని 42 లోక్‌సభ స్థానాలకుగానూ బీజేపీ 18 స్థానాలను కైవసం చేసుకుంది. ఢిల్లీలోని ఏడు స్థానాల్లోనూ విజయం సాధించింది. '..అయితే కొన్ని నెలలకే, ఢిల్లీలో ఫలితాలు పూర్తిగా తారుమారయ్యాయి. బెంగాల్‌లో 18 స్థానాల్లో గెలుపొందాం కాబట్టి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని అనుకోకూడదు. అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాన్ని మార్చాల్సి ఉన్నది. జాతీయ ఎన్నికలకు కలిసొచ్చిన అంశాలు రాష్ట్ర ఎన్నికలకు పనిచేస్తాయనేం లేదు. సీఏఏ అమలు, ఎన్నార్సీ అవసరాన్ని ప్రధానంగా ప్రచారం చేయడంతోపాటు ప్రత్యామ్నాయ, మెరుగైన పాలనా విధానాలపైనా దృష్టిసారించాల్సిన అవసరం ఉన్నది' అని సీనియర్ బీజేపీ నేత ఒకరు తెలిపారు. మరోవైపు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ సన్నిహిత వర్గం మాత్రం సీఏఏ, ఎన్నార్సీపై దూకుడుగా వెళ్లాలని అభిప్రాయపడుతున్నది. పార్టీ వ్యూహాన్ని మార్చాల్సిన అవసరం లేదని.. సీఏఏ, ఎన్నార్సీపై పార్టీ చేపట్టిన ప్రచారం లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి మంచి ఫలితాలు అందించిందని చెబుతున్నది. ఇప్పుడు వ్యూహాన్ని మార్చితే బీజేపీ వెనుకంజ వేసిందని ప్రజలు భావించే అవకాశం ఉందని, ఇది పార్టీ క్యాడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతుందని పేర్కొంటున్నది.

## కాంగ్రెస్‌కు కరోనా



- పార్టీలో తిరిగి జవసత్వాలు నింపాలి
- ఢిల్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపై జైరాం రమేశ్

**కొచ్చి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా పరాజయం పాలవడంపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. దీనిపై ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్‌కు ఢిల్లీ ఫలితాలు కరోనా వైరస్ లాంటి పెద్ద విపత్తు అని అభివర్ణించారు. పార్టీలో తిరిగి జవసత్వాలు నింపాలని.. లేకపోతే, రాబోయే పరిణామాల్ని అందరం కలిసి ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కేరళలోని కొచ్చిలో నిర్వహించిన ఓ అంతర్జాతీయ పుస్తక వేడుకలో గురువారం పాల్గొన్న ఆయన 'పీటీఐ' వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్ నాయకులు తమను తాము పునరుద్ధరించుకోవాలి. ప్రజలతో మమేకమవ్వాలంటే పార్టీ కూడా పునరుజ్జీవింపజేయాలి' అని తెలిపారు. అలా జరుగకపోతే, ప్రజలకు దూరమవుతామని రమేశ్ హెచ్చరించారు. అధికారానికి దూరమై ఆరేండ్లు గడిచినప్పటికీ, పార్టీలోని కొందరు నేతలకు అహంకారం తగ్గలేదని, తామింకా మంత్రులమేనన్నట్టు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. పార్టీ బలోపేతం కోసం.. స్థానిక నేతలకు నిర్ణయాలు తీసుకోవడంలో స్వేచ్ఛ నివ్వాలని సూచించారు. కాగా పార్టీ పునరుద్ధరణకు 'సర్జికల్ యాక్షన్' అవసరమని మరో కాంగ్రెస్ నేత వీరప్ప మొయిలీ ఇటీవల వ్యాఖ్యానించడం తెలిసిందే.

## ద్విముఖ పోరే దెబ్బతీసింది

### ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై బీజేపీ వర్గాల అభిప్రాయం



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గతంతో పోలిస్తే ఓట్ల శాతం పెరిగినప్పటికీ, పార్టీ అత్యంత తక్కువ స్థానాల్లో గెలుపొందడంపై బీజేపీ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించింది. రెండు పార్టీల (ఆమ్‌ఆద్మీ పార్టీ-బీజేపీ) మధ్య ద్విముఖ పోటీ నెలకొనడమే బీజేపీ ఓటమికి ప్రధాన కారణమని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. అయితే, ఢిల్లీ ఎన్నికల కోసం పార్టీ నేతలు పూర్తి స్థాయిలో శ్రమించి ఓటర్లకు చేరువయ్యారని ఆ వర్గాలు తెలిపాయి. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఢిల్లీ విభాగం అధ్యక్షుడు మనోజ్ తివారీ, పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## కుప్పకూలిన ఫుట్ ఓవర్ వంతెన

### 8 మందికి గాయాలు.. మధ్యప్రదేశ్‌లో ఘటన

**భోపాల్, ఫిబ్రవరి 13:** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ రైల్వేస్టేషన్‌లోని ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూలిపోవడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నదని, అతడికి దవాఖానలో చికిత్స అందిస్తున్నట్లు పశ్చిమ మధ్య రైల్వే సీపీఆర్వో ప్రియాంక దీక్షిత్ తెలిపారు. మిగతా ఏడుగురు క్షతగాత్రుల్లో ఇద్దరికి చికిత్స చేసి డిశ్చార్జి చేశారు. మరో ఐదుగురు స్థానిక ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది.

## పర్యావరణవేత్త ఆర్కే పచౌరీ కన్నుమూత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** ప్రముఖ పర్యావరణవేత్త ఆర్కే పచౌరీ గురువారం సాయంత్రం ఢిల్లీలో కన్నుమూశారు. ఆయన వయస్సు 79 ఏండ్లు. పచౌరీ దీర్ఘకాలంగా గుండెజబ్బుతో బాధపడుతున్నారని, ఇటీవలే ఆయనకు శస్త్రచికిత్స జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్యం మరింత విషమించడంతో మంగళవారం ఢిల్లీలోని ఎస్కార్ట్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంధన, వనరుల సంస్థ (టెరీ)కి పచౌరీ వ్యవస్థాపక చైర్మన్‌గా పనిచేశారు. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వాల ప్రతినిధుల సంస్థకు పచౌరీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే నోబెల్ బహుమతి లభించింది. ఆయన సాహసోపేతమైన నాయకత్వం కారణంగానే ప్రపంచ దేశాలు వాతావరణ మార్పుల అంశాన్ని ఒక కీలకమైన సమస్యగా గుర్తించాయని పచౌరీ కుటుంబం తెలిపింది. పచౌరీ మృతి పట్ల టెరీ సంస్థ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. 2015లో పచౌరీపై టెరీలో పనిచేసే ఒక మహిళా ఉద్యోగి.. లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆ సంస్థ నుంచి వెళ్లిపోయారు. పచౌరీని కేంద్ర ప్రభుత్వం 2001లో పద్మభూషణ్‌తో, 2008లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం



ఫిరోజాబాద్‌లో లారీని ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన బస్సు

- 14 మంది మృతి, 25 మందికి గాయాలు
- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన డబుల్ డెక్కర్ బస్సు

**ఫిరోజాబాద్:** ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లాలో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 14 మంది చనిపోగా 25 మందికి గాయాలయ్యాయి. 50 మంది ప్రయాణికులతో ఢిల్లీ నుంచి ఉత్తర బీహార్‌లోని మోతిహారికి బయల్దేరిన ఓ డబుల్ డెక్కర్ బస్సు ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్ హైవేపై నిలిచి ఉన్న ఓ లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన 25 మందిని స్థానిక దవాఖానల్లోకి తరలించి చికిత్స అందిస్తున్నట్టు సీనియర్ ఎస్పీ సచీంద్ర పటేల్ తెలిపారు. నాగ్లా ఖానాగర్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్టు రూరల్ ఎస్పీ రాజేశ్ కుమార్ చెప్పారు. ప్రమాదంలో గాయపడిన లారీ క్లీనర్ మాట్లాడుతూ.. 'టైరు పంక్చరైందని, మరో టైరును మార్చేందుకు లారీని రోడ్డు పక్కన నిలిపాం. ఇంతలో ఓ బస్సు వచ్చి లారీని ఢీకొట్టింది. దీంతో నా సహచరులతో పాటు లారీ డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు' అని చెప్పాడు.

## మోదీపై అనుచిత వ్యాఖ్యలు!

### రాజ్యసభ భద్రతా అధికారి హోదా తగ్గింపు

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియాలో ప్రధాని మోదీపై అభ్యంతరకర పోస్టులు చేసినందుకుగాను రాజ్యసభ భద్రతా అధికారిపై రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు చర్యలు చేపట్టారు. ఆయన హోదాను ఐదేండ్లపాటు తగ్గించారు. ఈ ఐదేండ్ల కాలంలో ఎలాంటి ఇంక్రిమెంట్లు కూడా ఇవ్వకూడదని ఆదేశాలు జారీ చేశారు. రాజ్యసభ భద్రతా విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న ఉర్జుల్ హసన్ ఇటీవల సోషల్ మీడియాలో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా కించపరిచేట్టు పలు పోస్టులు చేశారు. దీంతో ఈ విషయం రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు దృష్టికి వెళ్లడంతో ఆయన హోదాను ఐదేండ్లపాటు లోయర్ గ్రేడ్ సెక్యూరిటీ అధికారి స్థాయికి తగ్గించారు.

## హఫీజ్‌కు శిక్ష అమలవుతుందా?

**న్యూఢిల్లీ:** ముంబై ఉగ్రదాడి కుట్రదారు, లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు పాకిస్థాన్ న్యాయస్థానం విధించిన జైలుశిక్ష ఏ మేరకు అమలవుతుందో వేచి చూడాలని భారత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. హఫీజ్ సయీద్ ఉగ్రవాదులకు నిధుల సమకూరుస్తున్నాడన్న ఆరోపణలపై రెండు వేర్వేరు కేసుల్లో ఐదున్నరేండ్ల జైలుశిక్ష విధిస్తూ పాక్‌లోని న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. మరో నాలుగు రోజుల్లో పారిస్‌లో అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక సంస్థ 'ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) సమావేశం కానున్న నేపథ్యంలో హఫీజ్‌కు పాక్ కోర్టు జైలుశిక్ష విధించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ గతేడాది ఆదేశించింది. ఈ క్రమంలో పాక్ దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలుస్తున్నది.

## స్థానికులకు రిజర్వేషన్ల కోసం కర్ణాటక బంద్

### ఏపీ బస్సుపై రాళ్లు రువ్విన ఆందోళనకారులు

**బెంగళూరు:** స్థానికులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని సూచించిన సరోజిని మహిషి నివేదిక అమలు కోసం కన్నడ సంఘాలు గురువారం చేపట్టిన రాష్ట్ర బంద్‌లో చెదురుమదురు ఘటనలు జరిగాయి. తిరుపతి నుంచి మంగళూరు వెళ్తున్న ఓ బస్సుపై దక్షిణ కన్నడ జిల్లాలోని ఫిరంగిపేట వద్ద ఆందోళనకారులు రాళ్లురువ్వారు. దీంతో బస్సు ధ్వంసమైంది. బంద్ ప్రభావం పాక్షికంగా ఉన్నా బస్సులు, ఆటోలు యథావిధిగా నడిచాయి. రాష్ట్ర రాజధాని బెంగళూరులోనూ బంద్ ప్రభావం అంతగా లేదు. కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని అనేకల్ ప్రాంతంలో నిరసనకారులు బలవంతంగా దుకాణాలను మూయించారు. బంద్ నేపథ్యంలో హింసాత్మక ఘటనలు జరుగకుండా పోలీసులు భారీగా మోహరించారు. ఆందోళనలపై సీఎం యెడియూరప్ప స్పందిస్తూ సరోజిని మహిషి నివేదిక అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర ఉద్యోగాల్లో, కర్ణాటకలోని ప్రైవేట్ ఉద్యోగాల్లో రాష్ట్ర ప్రజలకు ప్రాధాన్యం ఇవ్వాలని (రిజర్వేషన్లు కల్పించాలని) గతంలో సరోజిని మహిషి నివేదిక సూచించింది.

శుక్రవారం
14•2•2020

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

కరీంనగర్

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE











గురువారం పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉన్న లక్ష్మీసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, సీఎస్ సోమేశ్‌కుమార్ కూడా ఉన్నారు.

# సాగునీటిరంగానికి కొత్తదశ

- 11 సర్కిల్స్‌గా సాగునీటి ఇంజినీరింగ్ వ్యవస్థ
- సర్కిల్ అధిపతిగా చీఫ్ ఇంజినీర్
- రాష్ట్రంలోని అన్ని చెరువులను నింపేలా కార్యాచరణ
- బరాజ్‌ల ఆపరేషన్ రూల్స్ సిద్ధంచేయాలి
- కరీంనగర్ సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్

## అన్ని సాగునీటి ఇంజినీరింగ్ విభాగాలు ఒకే గొడుకు కిందకు

- నిండుగోదావరిని చూసి పులకించిన అపర భగీరథుడు
- తెలంగాణ భూములను మాగాణం చేయాలని గంగమ్మకు పూజలు
- గోదావరి నదిపై ఏరియల్ సర్వే
- కాళేశ్వర ముక్తీశ్వరుడికి అభిషేకం
- ఆలయాభివృద్ధికి రూ.వందకోట్లిస్తామని వెల్లడి

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

స్వతంత్ర భారతదేశంలో తెలంగాణ పీఠభూమిపై మునుపెన్నడూ కనీవినీ ఎరుగని జలనిధిని చూసి అపరభగీరథుడు, సీఎం కేసీఆర్ ఉప్పొంగిపోయారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకాలంలో రేయింబవళ్లు ఏ కలనైతే కన్నారో.. ఆ కల సాకారమైన దృశ్యాన్ని చూసి పులకించిపోయారు. తెలంగాణ బీడుభూములను అణువణువూ తన స్పర్శతో సస్యశ్యామలంచేస్తున్న గోదావరి గంగమ్మకు జోతలు పట్టి పూజలుచేశారు. నాణేలు విసిరి తెలంగాణను ఆకుపచ్చగా మార్చాలని వేడుకొన్నారు. కేవలం మూడున్నరేండ్ల వ్యవధిలో రికార్డుస్థాయిలో నిర్మించిన ఆసియాలోనే అతిపెద్ద బహుళ ఎత్తిపోతల పథకం 'కాళేశ్వరం'లో ప్రధానమైన లక్ష్మీ బరాజ్‌లో 16 టీఎంసీల నీటిని చూసి తన్మయంచెందారు. రాష్ట్ర సాగునీటిరంగానికి సరికొత్త దశదిశను సీఎం నిర్దేశించారు. ప్రజల ఆకాంక్షలను

మిగతా 4వ పేజీలో

**వచ్చే జూన్ నుంచి 530 టీఎంసీలు ఎత్తిపోయాలి**

వచ్చే జూన్ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఏటా 530 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు అన్ని విధాలుగా సంసిద్ధులై ఉండాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. లక్ష్మీ బరాజ్ (మేడిగడ్డ), సరస్వతి బరాజ్ (అన్నారం), పార్వతి బరాజ్ (సుందిల్ల), ఎల్లంపల్లి రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటిని ఏప్రిల్ 10వ తేదీలోగా ఖాళీచేయాలని సూచించారు. తద్వారా వానకాలంలో మరింతగా గోదావరి జలాలను ఒడిసిపట్టే ఆస్కారం ఉంటుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీసాగర్ రిజర్వాయర్ నుంచి మల్లన్నసాగర్ రిజర్వాయర్ దాకా పనిచేస్తున్న ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సమాచారాన్ని వేగంగా అందిపుచ్చుకొనేందుకు వీలుగా వైర్‌లెస్ సెట్లను కొనుగోలుచేయాలని అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం బరాజ్‌ల ఆపరేషన్ రూల్స్ కార్యాచరణను సిద్ధంచేయాలన్నారు.

# నేర చరిత్ర చెప్పాల్సిందే

- ఎన్నికల వేళ అభ్యర్థుల క్రిమినల్ కేసుల వివరాలను పార్టీ వెబ్‌సైట్లలో పెట్టండి
- వారిని ఎందుకు ఎంపిక చేశారో వివరించండి
- ఈ విషయాలను సోషల్ మీడియాలో, పత్రికల్లో ప్రచురించండి
- రాజకీయ పార్టీలను ఆదేశించిన సుప్రీంకోర్టు
- రాజకీయాల్లో నేరచరితులు పెరిగిపోవడంపై ఆందోళన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:**

రాజకీయాల్లో నేరచరితుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్న సమయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. నేరస్థులకు, వారిని ప్రోత్సహిస్తున్న రాజకీయ పార్టీలకు ఝలక్ ఇచ్చింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు తమ అధికారిక వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల్లో అభ్యర్థుల పేర్లతోపాటు వారిపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను కూడా నమోదు చేయాలని వెల్లడించింది. క్రిమినల్ కేసులు ఉన్నా.. ఆ అభ్యర్థినే ఎందుకు ఎంపిక చేశామో కారణం కూడా వివరించాలని స్పష్టం చేసింది. నేరపూరిత రాజకీయాల కట్టడికి 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాజకీయ పార్టీలు పాటించడంలేదంటూ బీజేపీ నేత అశ్విని ఉపాధ్యాయ్ దాఖలుచేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్ నేతృత్వంలోని జస్టిస్ రవీంద్రభట్‌తో కూడిన

మిగతా 5వ పేజీలో

# జాతీయపార్టీలు విఫలం

అన్నిఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలదే హవా ■ బీజేపీ, కాంగ్రెస్ కూడా పెద్దసైజు ప్రాంతీయ పార్టీలే




గురువారం ఢిల్లీలో టైమ్స్‌నౌ టీవీ చానల్ నిర్వహించిన యాక్షన్ ప్లాన్-2020 సమ్మిట్‌లో రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు

**'టైమ్స్‌నౌ' యాక్షన్‌ప్లాన్-2020 సమ్మిట్‌లో మంత్రి కేటీఆర్**

- రాష్ట్రాలు బలపడితేనే దేశం బలపడుతుంది
- తెలంగాణ ఇచ్చిన దానికంటే కేంద్రం 1.57 లక్షల కోట్లు తక్కువిచ్చింది
- నిధుల విడుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి మాటలు సరికావు
- పెద్దనోట్ల రద్దుకు మద్దతిచ్చినందుకు చింతిస్తున్నాం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశంలో జాతీయ రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని, ఆ రెండు జాతీయ పార్టీలకు (బీజేపీ, కాంగ్రెస్‌కు) ప్రాంతీయ పార్టీలు బలమైన ప్రత్యామ్నాయాలుగా మారబోతున్నాయని, గత కొంతకాలంగా జరుగుతున్న అన్ని ఎన్నికల్లోనూ ప్రాంతీయ పార్టీలే బలమైన ప్రత్యామ్నాయాలుగా ఎదుగుతున్నాయని రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు అన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న పార్టీలన్నీ సాంకేతికంగా ప్రాంతీయ పార్టీలేనని, దేశవ్యాప్తంగా ఉనికి, యంత్రాంగం ఉన్న జాతీయ పార్టీలేవీ లేవని, బీజేపీ, కాంగ్రెస్ సైతం పెద్దసైజు ప్రాంతీయ పార్టీలేనని పేర్కొన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ కూటమికి అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. గత 70 ఏండ్లుగా కాంగ్రెస్, బీజేపీ దేశాన్ని నిరాశపర్చాయని, ఆర్థిక అభివృద్ధి, మౌలికవసతులు, సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన తదితర అంశాల్లో ఆ పార్టీలు ప్రజల ఆకాంక్షలను అందుకోలేకపోయాయని, ఈ విషయాన్ని దేశ ప్రజలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారని చెప్పారు. 'టైమ్స్‌నౌ' వార్తాచానల్ గురువారం ఢిల్లీలో నిర్వహించిన యాక్షన్ ప్లాన్-2020 సమ్మిట్‌లో మంత్రి కేటీఆర్

మిగతా 5వ పేజీలో



రిషీ సునక్

## బ్రిటన్ ఆర్థిక మంత్రిగా నారాయణమూర్తి అల్లుడు

జాన్సన్ కొత్త మంత్రివర్గంలో రిషీకి దక్కిన చోటు 8

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 59.00 | రిటైల్ లైవ్ | 81.00 |
| డ్రెస్డ్ | 117.00 | స్కిన్‌లెస్ | 134.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 390.00 | రంగారెడ్డి | 390.00 |
| మెదక్ | 390.00 | కరీంనగర్ | 393.00 |
| వరంగల్ | 383.00 | డజన్ ధర | 60.00 |

# రేపే సహకార ఎన్నికలు

**పోలింగ్ సమయం: ఉదయం ఏడు గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంటదాకా**

- మధ్యాహ్నం రెండునుంచి ఓట్ల లెక్కింపు.. ఫలితాలు
- అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేసిన సహకారశాఖ
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 12 లక్షల మంది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలోని 747 పీఏసీఎస్‌ల పరిధిలోని 6,248 మంది డైరెక్టర్ పోస్టులకు ఈ నెల 15న (శనివారం) ఎన్నికలు నిర్వహించేందుకు సహకారశాఖ ఎన్నికల అథారిటీ అన్నిరకాల ఏర్పాట్లుచేసింది. ఎన్నికల నిర్వహణకు 747 మంది గెజిటెడ్ అధికారులను ఎన్నికల అధికారులుగా, మరో 20 వేలకుపైగా సిబ్బందిని నియమించారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పత్రాలను ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు అందుబాటులో ఉండేలా సరఫరాచేశారు. సుమారు 12 లక్షల మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగనున్నది. మధ్యాహ్నం రెండు నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి.. సాయంత్రం ఫలితాలు ప్రకటిస్తారు. పాలకవర్గాల నియామకాలను ఎన్నికల ముగిసిన మూడురోజుల్లో చేపట్టనున్నట్టు ఎన్నికల అథారిటీ అధికారులు చెప్పారు. పాలవర్గాల ఎన్నికల సందర్భంగా ఏదైనా సమస్యలు తలెత్తితే కో ఆపరేటివ్ చట్టాల ప్రకారం తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టంచేశారు.

# కొంపముంచిన 'గోలీమారో'

- పార్టీ నేతల విద్వేషపూరిత వ్యాఖ్యలు నష్టం కలిగించాయి
- ఢిల్లీ ఫలితాల విషయంలో నా అంచనా తప్పింది
- కేంద్ర హోంమంత్రి, బీజేపీ నేత అమిత్‌షా

2



# బ్లాక్‌స్పాట్స్‌పై నజర్!

## ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు

- నల్లగొండలో సత్ఫలితాలు..
- మూడేండ్లలో సగానికి తగ్గిన ప్రమాదాలు
- రాష్ట్రవ్యాప్తంగా 3517 బ్లాక్‌స్పాట్స్!
- తమిళనాడు మోడల్‌పై తెలంగాణ పోలీసుల అధ్యయనం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలతోపాటు, మృతుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్‌శాఖ చర్యలు చేపడుతున్నది. 2020 సంవత్సరాన్ని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి ఇప్పటికే రోడ్, విమెన్‌సేఫ్టీ ఇయర్‌గా ప్రకటించారు. ఆ దిశగా పోలీసు యంత్రాంగం దృష్టిసారించింది. ఇందులోభాగంగా ప్రమాదాలు జరుగడానికి గల కారణాలను విశ్లేషిస్తూ మరోమారు ఆ ప్రమాదాలు జరుగకుండా ముందస్తుచర్యలు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ, రాష్ట్రరహదారులు, ఇతర రోడ్లలో 2015 నుంచి 2018 వరకు 3,517 బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలు చేపడుతున్నారు. ముందస్తుగా ప్రమాదప్రాంతాలను బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించి, లోపాలు సరిదిద్దుతుండటంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతున్నాయి. ఇందుకోసం పోలీసులు, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌పోర్టు, మెడికల్, ఫైర్ తదితర విభాగాలు భాగస్వామ్యంతో చర్యలు చేపడుతున్నారు. అన్ని విభాగాల్లోని అధికారులు ఒక బృందంగా ఏర్పడి ప్రమాదస్థలాలను గుర్తిస్తున్నారు. ఆ ప్రాంతంలో మూలమలుపు, సరైన వెలుతురు, సైన్‌బోర్డు లేకపోవడం, ఇరుకైన వంతెనలు ఇలా.. ఏ కారణంతో ప్రమాదం జరిగిందో ముందుగా విశ్లేషించి.. వాటిని పరిష్కరిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ఈ రకంగా తీసుకున్న తాత్కాలిక చర్యలతో మూడేండ్లలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. అతివేగంతోనే ప్రమాదాలు జరుగుతుండటాన్ని గుర్తించిన నల్లగొండ జిల్లా ఎస్పీ రంగనాథ్.. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి వేగ నియంత్రణకు బొల్లార్ట్స్ పెట్టించారు. 2017లో నల్లగొండలో 362 ప్రమాదాల్లో 393 మంది మృతిచెందగా, 2018లో 342 ప్రమాదాల్లో 367 మంది ప్రాణాలు కోల్పోయారు. 2019 నాటికి రోడ్డు ప్రమాదాలు 286కి, మృతుల సంఖ్య 314కి తగ్గాయి. హైదరాబాద్

మిగతా 5వ పేజీలో





కాళేశ్వరం పుష్కరఘాట్‌లో గోదావరికి చీరసారె సమర్పించి, నదిలో నాణేలు వేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ సంతోష్‌కుమార్, జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, గండ్ర జ్యోతి, సీఎస్ సోమేశ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు ఉన్నారు.



కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకొంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్



గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఓ చిన్నారిని ఎత్తుకొని ముద్దుచేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



# గంగమ్మ చెంత అపరభగీరథుడు



గురువారం లక్ష్మీ బరాజ్‌ను ఏరియల్‌వ్యూ ద్వారా పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



## కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్న సీఎం కేసీఆర్

వంద కోట్లతో అలయ అభివృద్ధికి హామీ ■ గోదావరి నదిపై ఏరియల్ సర్వే

లక్ష్మీ బరాజ్ పరిశీలన ■ జలనిధిని చూసి ఉప్పొంగిన సృష్టికర్త

**వరంగల్ /కరీంనగర్ ప్రధాన ప్రతినిధులు / కాళేశ్వరం /మహదేవ్‌పూర్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రైతన్నల కలలపంట కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జలనిధిని చూసి ఉప్పొంగిపోయారు. తాను అపరభగీరథుడై యుద్ధప్రాతిపదికన నిర్మించిన ప్రాజెక్టుగా ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్న లక్ష్మీ బరాజ్‌లో జలాలను చూసి పులకించిపోయారు. బుధవారం రాత్రి కరీంనగర్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నేరుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానానికి చేరుకున్నారు. అక్కడి ఘాట్‌లో గోదావరి మాతకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గోదావరి, ప్రాణహిత సంగమస్థలి, అంతర్వాహిని సరస్వతీ నదుల త్రివేణి సంగమ పుణ్యస్థలి వద్ద, కనుచూపు మేర జలనిధిగా మారిన ప్రాణహిత గోదారి గంగ పవిత్ర జలాలను తల మీద చల్లుకొని నాణేలు వదిలి, పుష్పాలు చల్లి, పూజలుచేసి జల నీరాజనాలు అర్పించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో పూజల అనంతరం పార్వతీమాతను దర్శించుకొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అర్చకులతో కాసేపు ముచ్చటించారు.

### కాళేశ్వరం ఆలయాభివృద్ధికి వంద కోట్లు

సీఎం కేసీఆర్‌కు కాళేశ్వర ముక్తీశ్వరుడి నిండు దీవెనలు ఉండటం వల్లే ఆయన తలపెట్టిన భగీరథ యజ్ఞం ఫలించిందని ఆలయ అర్చకులు నగేశ్‌శర్మ, కృష్ణమూర్తిశర్మ అభిప్రాయపడ్డారు. గతంలో ప్రకటించినట్టుగానే త్వరలోనే వంద కోట్లు కేటాయించి ప్రశస్తమైన ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందామని, రెండుమూడు రోజుల్లో ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మను ఇక్కడికి పంపించి పూర్తి నివేదిక అందాక పనులు మొదలుపెడుతామని సీఎం కేసీఆర్ పేర్కొనడం పట్ల ముక్తీశ్వరుడు సంతసిస్తారని ఆలయ అర్చకులు హర్షం వ్యక్తంచేశారు.

### గోదావరిపై సీఎం ఏరియల్ సర్వే

కాళేశ్వరంలో ప్రత్యేక పూజల అనంతరం సీఎం కేసీఆర్ అక్కడి నుంచి లక్ష్మీ బరాజ్‌కు బయలుదేరారు. 16.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బరాజ్ గురువారం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం14 టీఎంసీల నీటితో సంద్రాన్ని తలపించింది. 1,632 మీటర్ల (1.6 కిలోమీటర్లు) పొడవు, వంద మీటర్ల ఎత్తు, 85 గేట్లతో ప్రపంచంలోనే అత్యంత వేగంగా నిర్మించిన లక్ష్మీ బరాజ్ నుంచి కాళేశ్వరం వరకు (దాదాపు 16 కిలోమీటర్లు) జలసిరులతో తొణికిసలాడుతున్న గోదావరిని సీఎం కేసీఆర్ గగనతలం నుంచి పరిశీలించారు. అటు కాళేశ్వరం నుంచి అన్నారం బరాజ్‌ను, అక్కడి నుంచి లక్ష్మీ బరాజ్‌వరకు గోదావరి నదిని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. మేడిగడ్డ వద్ద హెలికాప్టర్ దిగి అక్కడి నుంచి బస్సులో నేరుగా లక్ష్మీ బరాజ్‌కు చేరుకొన్నారు. బరాజ్ పైనుంచి నదిలోకి నాణేలను వదిలి, చీరెసారె సమర్పించారు. ఆ తర్వాత బరాజ్ వ్యూ పాయింట్ (యాగశాల)కు చేరుకొన్నారు. అక్కడే దాదాపు అరగంటపాటు ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలుచేశారు. రాబోయే వర్షాకాలం వరదనీరు ఉధృతంగా చేరుతుందని, ఈ నేపథ్యంలో లక్ష్మీ బరాజ్ నుంచి ఎప్పటికప్పుడు నీటిని తోడుకోవాలని, అందుకు సంబంధించిన వ్యవస్థను సిద్ధం చేసుకోవాలని ఈఎన్సీలు మురళీధర్‌రావు, నల్ల వెంకటేశ్వర్లు, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే సహ పలువురు ఇంజినీర్లకు, ఉన్నతాధికారులకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా పనిచేసి ఇటీవలే ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన రజత్‌కుమార్‌కు సంబంధిత విషయాల పట్ల అవగాహన పెరిగేలా ప్రాజెక్టు నిర్మాణం, సాగునీటి వినియోగం ప్రభుత్వ ప్రాధాన్యాన్ని వివరించారు. ఎంతో కష్టపడి కట్టుకొన్న ప్రాజెక్టులలోని నీటిని ఎప్పటికప్పుడు తోడిపోసుకుంటూ రిజర్వాయర్లను నింపుతూ గోదావరి జలాలు వృథా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇంజినీర్లదేనని స్పష్టంచేశారు. ఎస్సారెస్పీ నుంచి మొదలుకొని మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లను, రిజర్వాయర్లను, ఎత్తిపోతలు పంపులను, కాల్వలను, చివరి ఆయకట్టు వరకు సునిశిత పర్యవేక్షణ చేసుకోవాలని ఆదేశించారు. ఎక్కడికక్కడ పని విభజన చేసుకొని పూర్తిస్థాయిలో ఇంజినీరింగ్ వ్యవస్థను పటిష్ఠపరుచుకోవాలని చెప్పారు. అవసరమైతే పోలీసుల మాదిరిగా వైర్‌లెస్ వాకీటాకీ వ్యవస్థను ఏర్పాటుచేసుకొని పనిచేయాలని తెలిపారు. సమాచారాన్ని ప్రతిక్షణం చేరవేసుకుంటూ ఎప్పుడు ఏ మోటరు నడుస్తున్నది? ఏ పంపు పోస్తున్నది? ఎన్నినీళ్లు ఎత్తాలే? ఎప్పుడు ఆపాలే? ఎప్పుడు నీటిని కిందికి వదులాలే? వంటి పలు నీటి పంపిణీ సాంకేతిక అంశాల పట్ల కాళేశ్వరం టీం మొత్తానికి అవగాహన ఉండాలని అన్నారు. అలా సమన్వయంతో పనిచేస్తే గోదావరి జలాలను నూటికి నూరు శాతం సద్వినియోగం చేసుకోగలమని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు వివరించారు. అనంతరం మేడిగడ్డ వద్ద మధ్యాహ్న భోజనంచేసిన సీఎం కేసీఆర్ కరీంనగర్‌కు బయలుదేరారు. సీఎం కేసీఆర్ వెంట మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, సీఎస్ సోమేశ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావుదేశ్‌పాండే, జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, గండ్ర జ్యోతి, జక్కు శ్రీహర్షిణి, కనుమల్ల విజయ, కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, కరీంనగర్, సిరిసిల్ల కలెక్టర్లు కే శశాంక, కృష్ణభాస్కర్ తదితరులు ఉన్నారు.



లక్ష్మీ బరాజ్ వ్యూపాయింట్ వద్ద ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ సంతోష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, సీఎస్ సోమేశ్‌కుమార్ ఉన్నారు.

## గోదావరితో సీఎం కేసీఆర్ కరచాలనం

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఎగువన మహారాష్ట్ర దిగువన తెలంగాణ. రెండు రాష్ట్రాలు, గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా సరస్వతీ.. మూడు నదుల సంగమక్షేత్రం కాళేశ్వరం. తెలంగాణ బీడుభూముల్లో పసిడికాంతులు నింపే ముక్తీశ్వరుడి అవతారం ఎత్తి అపరభగీరథుడిగా నిలిచిన ముఖ్యమంత్రి కేసీఆర్.. గురువారం తల్లి గోదావరికి తన్మయంతో కరచాలనం చేశారు. నిండు మనసుతో తెలంగాణ భూములను మాగాణం చేయాలని ప్రార్థించారు. తల్లి గోదావరిని ఉద్యమకాలంలో ఏమని తలంచి వేడుకున్నారో ఆ తలంపు నిజరూపం దాల్చింది. పడావు పడ్డ బీళ్లు పంటచేలతో ఇవ్వాళ కళకళలాడుతున్నాయి. పద్నాలుగేండ్ల స్వరాష్ట్ర ఉద్యమకాలంలో 'తల్లీ మా బీళ్లకు మళ్లు. నా రైతన్న కన్నీటి సంద్రాన్ని పారదోలి ఎండిన డొక్కలకు కడుపు నిండా పట్టెడన్నం పెట్టు. ఎడారిగా మారిన తెలంగాణను ఆకుపచ్చగా మార్చు' అని కేసీఆర్ ఎన్ని వందల వేల నాణేలు వేశారో లెక్కలేదు. అటువంటి దుస్థితి నుంచి అలల గోదావరి ఊరూరా అలుగుపారే దృశ్యం ఆవిష్కృతం కావడం మహోజ్వల ఘట్టం. సీఎం కేసీఆర్ తలచినట్టు మేడిగడ్డ తెలంగాణ జీవగడ్డగా మారింది. ఆయన ఆకుపచ్చ తెలంగాణ కల సాక్షాత్కారమవుతున్నది. లక్ష్మీ బరాజ్ నుంచి కాళేశ్వరం వరకు 16 కిలోమీటర్ల మేర గోదావరి బ్యాక్ వాటర్.. సీఎం కేసీఆర్ సారథ్యంలో కొలువుదీరిన తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్‌కు నిదర్శనం. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టుకు పునాది రాయి వేసినప్పటి నుంచి గురువారం వరకు సీఎం కేసీఆర్ తొమ్మిదిసార్లు ప్రత్యక్ష పర్యటన చేశారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.44 గంటలకు

సూర్యాస్తమయం: 6.10 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణ షష్ఠి సాయంత్రం 6.22 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: చిత్ర ఉదయం 7.28 వరకు, తదుపరి స్వాతి, అమృతఘడియలు: రాత్రి 9.45 నుంచి 11.16 వరకు, రాహుకాలం: ఉదయం 11.02 నుంచి మధ్యాహ్నం 12.27 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.01 నుంచి 9.47 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.50 నుంచి 1.35 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.44 నుంచి 2.13 వరకు.

### లోకం పోకడ




# సాగునీటిరంగానికి కొత్తదశ

మూడోపేజీ తరువాయి...

నెరవేర్చేలా సాగునీటి లక్ష్యాల సాధనకోసం నీటిపారుదల, ఇంజినీరింగ్ విభాగాలను పునర్వ్యవస్థీకరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను ఆదేశించారు. సాగునీటిరంగానికి సంబంధించిన అన్ని ఇంజినీరింగ్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకొనిరావాలని సూచించారు. కాళేశ్వరం పర్యటనలో భాగంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రందాకా రోజంతా జరిపిన పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్మీబరాజ్‌ను సందర్శించడంతోపాటు ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామికి అభిషేకాదులు నిర్వహించి.. ప్రార్థనలుచేశారు. పార్వతీదేవిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ప్రాజెక్టుల పరిశీలన అనంతరం కరీంనగర్ కలెక్టరేట్‌లో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుద్వారా ఏటా 530 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ఇంజినీరింగ్ అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని నిర్దేశించారు. మే మాసంలో రాష్ట్రంలోని అన్ని సాగునీటి కాల్వలకు అవసరమైన మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో సాగునీటి ఇంజినీరింగ్ వ్యవస్థను మొత్తం 11 సర్కిళ్లుగా విభజించనున్నట్లు చెప్పారు. సర్కిల్ అధిపతిగా చీఫ్ ఇంజినీర్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో సాగునీటికి సంబంధించి ఏ అంశమైనా.. సంబంధిత చీఫ్ ఇంజినీర్ బాధ్యత వహిస్తారని చెప్పారు. జూన్ నెలాఖరులోగా నీటిపారుదల ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీలు భర్తీచేయాలని అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ఆపరేషన్ నిర్వహణ ప్రభావవంతంగా చేపట్టడానికి వీలుగా ఇంజినీరింగ్ అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి ప్రాజెక్టుల వద్ద కనీస వసతి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం, ఇతర అవసరాలకోసం రూ.120 కోట్లు మంజూరుచేసిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా ఇరిగేషన్ అధికారులు, సిబ్బందికి క్వార్టర్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని చెరువులను నింపేలా ప్రణాళికలు సిద్ధంచేయాలని పేర్కొన్నారు. సాగునీటి కాల్వలకు మే నెలాఖరులోగా అవసరమైన అన్ని మరమ్మతు పనులను పూర్తిచేయాలని సీఎం స్పష్టంచేశారు.



లక్ష్మీ బరాజ్‌పై నుంచి గోదావరి నీటిలో సారె సమర్పిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ సంతోష్‌కుమార్, సీఎస్ సోమేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### కరీంనగర్‌లో 161 చెక్‌డ్యాంలు

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే మంజూరుచేసిన 161 చెక్ డ్యాంల నిర్మాణాన్ని మే 15లోగా పూర్తిచేయాలని ఇరిగేషన్ అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేలు మరిన్ని చెక్‌డ్యాంలు కావాలని కోరుతున్నందున ఆ మేరకు అదనంగా చెక్ డ్యాంలను నిర్మించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు తక్కువగా కోట్‌చేసి పనులను దక్కించుకొన్న ఏజెన్సీలు సకాలంలో పనులను పూర్తిచేయకపోవడం వల్ల ఉద్దేశిత లక్ష్యాలు నెరవేరడంలేదని, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇలాంటి ఏజెన్సీలను గుర్తించి సస్పెండ్‌చేయాలని తెలిపారు. సదరు ఏజెన్సీలకు భవిష్యత్‌లో తిరిగి పనులు అప్పగించకుండా చూడాలని చెప్పారు. గోదావరి ప్రధాన ఉపనది అయిన ప్రాణహితలో వాస్తవ నీటి పరిమాణాన్ని తెలుసుకునేందుకు వీలుగా కాళేశ్వరం నుంచి తుమ్మిడిహెట్టి వరకు ఐదు నుంచి ఆరు చోట్ల గేజేస్‌లను ఏర్పాటుచేయాలన్నారు. ప్రతిఇంటికి నల్లా ద్వారా సురక్షిత మంచినీరు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భగీరథ పథకాన్ని చేపట్టిందని, దీనిద్వారా 56 లక్షల కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఉద్దేశపూర్వకంగా కొందరు వ్యక్తులు నల్లాలను విరగ్గొట్టడం, పనిచేయకుండా చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయనీ, అలాంటి వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలనీ, అప్పటికీ వినకపోతే రూ.5 వేల జరిమానా విధించాలని సీఎం ఆదేశించారు. కరీంనగర్‌తోపాటు నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ల స్థానంలో కొత్త కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ సునీల్‌రావు, ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, కరీంనగర్ కలెక్టర్ శశాంక, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, నగర కమిషనర్ క్రాంతి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కరీంనగర్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సీఎస్ సోమేశ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు కూడా ఉన్నారు.



కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# చుక్కనీరు వృథాపోవద్దు

- ఉమ్మడి కరీంనగర్‌లో 161 చెక్‌డ్యాంలు..
- మే చివరినాటికి పూర్తిచేయాలి
- కాళేశ్వరం నుంచి ఎస్సారార్ వరకు టూరిజం సర్క్యూట్
- కరీంనగర్ పర్యటనలో సీఎం కేసీఆర్ ఆదేశం
- మీడియాకు వెల్లడించిన మంత్రి ఈటల రాజేందర్

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టుకొని.. ఒక్క చుక్క కూడా వృథా పోకుండా ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వడానికి వివిధ వాగులపై 161 చెక్‌డ్యాంలను నిర్మించాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లో సీఎం అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రులు ఈటల, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. సీఎంతో భేటీలో ప్రధానంగా సాగునీటిరంగంపై సమీక్ష జరిగిందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తొలిఫలాలు అందుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతి అంగుళానికి సాగునీరు అందేవిధంగా ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారని పేర్కొన్నారు. వివిధ వాగులపై 161 చెక్‌డ్యాంలను నిర్మించాలని సూచించారన్నారు. సుమారు రూ. 1,200 కోట్లతో చేపట్టే ఈ చెక్‌డ్యాంలను రానున్న మే చివరినాటికి పూర్తిచేసే దిశగా కార్యాచరణ చేపట్టాలని సీఎం తెలిపారని చెప్పారు. ఆ మేరకు కావాల్సిన ప్రతిపాదనలు, టెండర్ల కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తామని, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో రెండు, మూడు రోజుల్లోనే సమావేశం జరిపి ఇంకా కొత్తగా చెక్‌డ్యాంలు అవసరమైన చోట ప్రతిపాదనలు తీసుకొని, వాటిని కూడా మంజూరు చేసుకుకొంటామని మంత్రి ఈటల అన్నారు. ఎక్కడ చెక్‌డ్యాం అవసరమైనా చేపట్టాలని సీఎం సూచించారని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ప్రతి అంగుళానికి సాగునీరు ఇచ్చేందుకు ఎన్ని డబ్బులైనా మంజూరుచేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. చెక్‌డ్యాంల నిర్మాణంతోపాటు నీరు వృథా కాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని పనులను ఈ ఎండాకాలంలోపు పూర్తిచేసి జూన్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించిన మేరకు చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. ఇప్పటికే కరీంనగర్ వాటర్‌హబ్‌గా మారిందనీ, ఈ నేపథ్యంలో ఈ సౌకర్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామని పేర్కొన్నారు. లక్ష్మీ బరాజ్ నుంచి మొదలుకొని శ్రీరాజరాజేశ్వర ప్రాజెక్టు వరకు.. కాళేశ్వరం ప్రాజెక్టు పొడవునా టూరిజం సర్క్యూట్‌ను డెవలప్‌చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపుదిద్దుకొంటున్నాయన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారనీ, దేశం అబ్బురపడేలా టూరిజం అభివృద్ధిచేస్తామని చెప్పారు. కరీంనగర్ జిల్లా కేంద్రం, ఉత్తర తెలంగాణకు గుండెకాయలాంటిదని.. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అంతంతమాత్రంగా ఉన్న కలెక్టరేట్ స్థానంలో బ్రహ్మాండమైన కలెక్టరేట్ కట్టడానికి నిధులను మంజూరుచేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు చెప్పారు. కరీంనగర్‌ను హరితనగరంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారని మంత్రులు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, మేయర్ సునీల్‌రావు, గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు రుణపడి ఉంటాం

- ఇరాక్‌నుంచి రాష్ర్టానికి బయలుదేరిన 17 మంది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇరాక్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమను స్వరాష్ర్టానికి తీసుకొచ్చేందుకు సహాయ సహకారాలు అందించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు రుణపడి ఉంటామని ఇరాక్‌లో చిక్కుకున్న 17 మంది తెలంగాణవాసులు తెలిపారు. ఇరాక్ నుంచి తెలంగాణకు బయలుదేరే ముందువారు మాట్లాడుతూ.. ఏజెంట్ల చేతుల్లో మోసపోయి నాలుగేండ్లుగా ఇరాక్‌లోని ఎర్‌బిల్ ప్రాంతంలో ఎన్నో కష్టాలు అనుభవించామని ఆవేదన వ్యక్తంచేశారు. తమ కష్టాలను గల్ఫ్ వెల్ఫేర్‌శాఖ అధ్యక్షుడు తెలుసుకొని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు సమాచారం అందించారని పేర్కొన్నారు. వారు వెంటనే స్పందించి తమను తిరిగి ఇండియాకు తీసుకొచ్చేందుకు కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇరాక్‌లో చిక్కుకున్న బాధితుల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన దుర్గం చంద్రయ్య, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దురురి గోపాల్, అంకిటి సత్తయ్య, చిట్యాల చిన్ననర్సయ్య, నిజామాబాద్ జిల్లాకు చెందిన బట్టు గంగాధర్, కల్లా శ్రీనివాస్, కుస్తపురం ప్రేమ్‌చందర్, భూమేశ్ సాకలి, గోత్రాల అశోక్, కరీంనగర్ జిల్లాకు చెందిన అమ్రిరెడ్డి తిరుపతిరెడ్డి, రాజేశం రేగుల, ఉప్పరి అనిల్, బైరవేణి శ్రీనివాస్, జగిత్యాల జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ పల్లెరియా, మామిడిపల్లి ప్రశాంత్, సిరికొండ వెంకటేశ్, పసి దివాన్ ఉన్నారు.



ఇరాక్ నుంచి తెలంగాణకు బయలుదేరుతున్న రాష్ట్ర వాసులు

**సాయంచేయడం సంతోషంగా ఉన్నది: మంత్రి కేటీఆర్**

ఇరాక్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితులకు కొంత సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉన్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. బాధితులు మాట్లాడుతున్న వీడియోకు మంత్రి ట్విట్టర్‌లో స్పందించారు. 'వెల్‌కం బ్యాక్ హోం' అంటూ ట్వీట్ చేశారు.

# మహానేతకు మొక్కలతో శుభాకాంక్షలు

- 17న సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా లక్షల మొక్కలు నాటేందుకు సన్నాహాలు
- ఆదేశాలు జారీచేసిన పలుశాఖల మంత్రులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహానేతకు మొక్కలతో శుభాకాంక్షలు తెలిపేందుకు అన్నివర్గాలు సిద్ధమవుతున్నాయి. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న పెద్దసంఖ్యలో మొక్కలు నాటేందుకు వివిధ శాఖలు సన్నాహాలు చేస్తున్నాయి. రాష్ట్రంలోని పారిశ్రామికవాడల్లో 1.32 లక్షల మొక్కలను నాటనున్నట్టు టీఎస్ ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు తెలిపారు. హరిత తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ పరితపిస్తున్నారని, ఆయన స్వప్నాన్ని నిజంచేసేందుకు ప్రతిఒక్కరూ పునరంకితమవుదామని అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 17న అటవీశాఖ అధికారులు, ఉద్యోగులందరూ మొక్కలునాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. అలాగే, సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా గిరిజన, మహిళా శిశుసంక్షేమశాఖల పరిధిలో ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాలయాలు, ఇండ్లలో మొక్కలు నాటాలని మంత్రి సత్యవతిరాథోడ్ గురువారం ఆ రెండుశాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ నెల 17న టీఆర్‌ఎస్ ఎన్నారై కమిటీల ఆధ్వర్యంలో పెద్దఎత్తున మొక్కలు నాటాలని టీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పిలుపునిచ్చారు.



# నిధులపై బీజేపీ నేతలది దుష్ప్రచారం

## వారిది అవగాహనారాహిత్యం: విప్ కర్నె ప్రభాకర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ నుంచి కేంద్రానికి సమకూర్చిన ఆదాయం కంటే రూ.1.60 లక్షల కోట్లు తక్కువగా రాష్ర్టానికి కేటాయించిన విషయం నిజంకాదా అని ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ బీజేపీ నేతలను ప్రశ్నించారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ తెలంగాణకు కేంద్రం గత ఐదేండ్లలో ఇచ్చిన నిధులపై గణాంకాలు విడుదలచేసినా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సహా ఇతర అధికార ప్రతినిధులు అవగాహనారాహిత్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ర్టానికి కేంద్ర నిధుల మంజూరుకు సంబంధించి తెలంగాణ బీజేపీ నేతలుచేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014 నుంచి 2019 వరకు తెలంగాణ నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో వెళ్లిన ఆదాయం రూ.2.72 లక్షల కోట్లుకాగా, ఇదే కాలంలో కేంద్రంనుంచి తెలంగాణకు వచ్చిన మొత్తం రూ.1.12 లక్షల కోట్లు మాత్రమేనని గుర్తుచేశారు. నిర్మల సీతారామన్ చెప్పిన గణాంకాల ఆధారంగా రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ కేంద్రంపై విమర్శలు చేస్తే తెలంగాణ బీజేపీ నేతలకు ఉలికిపాటు ఎందుకని నిలదీశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై దుష్ప్రచారం చేస్తే సీఎం కేసీఆర్ వెంటనే కౌంటర్ ఇచ్చేసరికి తోక ముడిచారన్నారు. తెలంగాణ బీజేపీ నేతలు కేంద్రానికి గుడ్డిగా వత్తాసు పలికే బదులు రాష్ర్టానికి నిధులు కేటాయింపు పెరిగేలా ఒత్తిడి పెంచాలని హితవుపలికారు.

# జాతీయపార్టీలు విఫలం

మూడోపేజీ తరువాయి...

పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'దేశ నిర్మాణంలో రాష్ట్రాల పాత్ర' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో పారిశ్రామికరంగంతోపాటు వివిధ సమకాలీన అంశాలపై కేటీఆర్ తన అభిప్రాయాలను వెల్లడించారు. భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, రాష్ర్టాలు బలపడినప్పుడే దేశం బలంగా ఉంటుందని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని విధానాలను తీసుకొచ్చినా, ఎలాంటి కార్యక్రమాలను చేపట్టినా వాటి ఆచరణ, అమలు అంతా రాష్ర్టాల్లోనే ఉంటుందన్న విషయం మర్చిపోకూడదని, 'మేకిన్ ఇండియా' లాంటి కార్యక్రమాల్లోనూ రాష్ర్టాల కార్యాచరణ, అనుమతులు, రాష్ట్ర ప్రభుత్వశాఖల సహకారం కీలకంగా ఉంటుందన్నారు.

**తీసుకున్నదెంత? ఇచ్చిందెంత?**

రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం తన సొంత నిధులు ఇస్తున్నట్టు ఆలోచించడం మంచిదికాదని, కేంద్రానికి రాష్ర్టాలు నిధులు సమకూరుస్తున్న విషయాన్ని మరువకూడదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొనేందుకు, పారిశ్రామిక ప్రగతికి కేంద్రం మరింత ఉదారంగా ముందుకు రావాలని సూచించారు. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.5 వేల కోట్ల జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) బకాయిలు రావాల్సి ఉన్నదన్నారు. గత ఐదేండ్లలో కేంద్రానికి తెలంగాణ రూ.2.72 లక్షల కోట్లు ఇస్తే.. కేంద్రం నుంచి రాష్ర్టానికి రూ.1.15 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయని, దేశ నిర్మాణానికి తెలంగాణ గత ఐదేండ్లలో రూ.1.57లక్షల కోట్లు ఇచ్చిందని తెలిపారు. ఈ వాస్తవాలను పక్కనపెట్టి తెలంగాణకు ఏదో ఇచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు.

**వారు శత్రువులు కాదు..**

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను వ్యక్తిగత శత్రువులుగా భావించడంలేదని, కేవలం రాజకీయ ప్రత్యర్థులుగా పరిగణించి ఎన్నికల్లో పోరాడుతున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. కేంద్రంలోని అధికార పార్టీ భావజాలాన్ని, సిద్ధాంతాలను వ్యతిరేకించినంతమాత్రాన ఆ ప్రభుత్వం రాష్ర్టాలను లేదా ఇతర పార్టీలను శత్రువులుగా చూడాల్సిన అవసరంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలకు తాము అంశాలవారీగా మద్దతిచ్చామని, కేంద్రం చేపట్టిన ప్రజావ్యతిరేకమైన చర్యలను అదేవిధంగా వ్యతిరేకించామని చెప్పారు. సీఏఏ (పౌరసత్వ సవరణ చట్టం) బిల్లును పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకించిందని, ఇలాంటి వివాదాస్పద చట్టాల కంటే కేంద్రం దృష్టిసారించాల్సిన ప్రాధాన్య అంశాలు చాలా ఉన్నాయన్నది టీఆర్‌ఎస్ అభిప్రాయమని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ఉన్న భారతదేశంలో ఆర్టికల్ 370 రద్దును, సీఏఏని ఒకేవిధంగా చూడలేమన్నారు.

**హైదరాబాద్ రెండో రాజధానిపై..**

ప్రజల మెరుగైన జీవనానికి అత్యుత్తమ అవకాశాలున్న నగరాల్లో హైదరాబాద్ గత ఐదేండ్ల నుంచి అగ్రస్థానంలో కొనసాగుతున్నదని, దీన్ని దేశానికి రెండో రాజధానిగా ప్రకటించాల్సి వస్తే హైదరాబాద్ ప్రజలు అంగీకరిస్తారా? లేదా? అన్నదానిపై తనకు అనుమానమున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కో-ఆపరేటివ్ ఫెడరలిజం, టీమిండియా లాంటి మాటలు చెప్పే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ భావనల స్ఫూర్తితో పనిచేయాలని కోరుకుంటున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి ఆర్థికంగా సహకరించాలని నీతి ఆయోగ్ పలుమార్లు కేంద్రానికి సూచించినా ఇప్పటివరకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు.



ఢిల్లీలో 'టైమ్స్‌నౌ' నిర్వహించిన యాక్షన్ ప్లాన్-2020 సమ్మిట్‌లో కేంద్రమంత్రి పీయుష్‌గోయల్‌తో కరచాలనం చేస్తున్న తెలంగాణ ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు

**అవి పెద్దసైజు ప్రాంతీయ పార్టీలే..**

ప్రస్తుతం దేశంలో ప్రాంతీయ పార్టీలు, పెద్ద సైజు ప్రాంతీయ పార్టీలు మాత్రమే ఉన్నాయని, జాతీయ పార్టీలు లేవని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణ భారత దేశంలో బీజేపీ కర్ణాటకలో మినహా మరెక్కడా లేదని, అలాంటప్పుడు అది ఏవిధంగా జాతీయ పార్టీ అవుతుందని ప్రశ్నించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్నప్పుడు యూనియన్ ఆఫ్ స్టేట్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అని ఉన్నదే తప్ప సెంట్రల్ గవర్నమెంట్ అనే పదం లేదని తెలిపారు. రాష్ర్టాలు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందన్నారు.

**పెద్దనోట్ల రద్దుకు మద్దతుపై చింతిస్తున్నాం..**

పెద్దనోట్ల రద్దుకు మద్దతిచ్చినందుకు చింతిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. పూర్ణ క్రాంతి పథకంలో నడుస్తున్నామని, అందులో భాగంగానే పెద్దనోట్లను రద్దుచేసినట్లు అప్పట్లో ప్రధాని మోదీ చెప్పారని, కానీ అచరణలో ఆ విధంగా జరగలేదని అన్నారు. పెద్దనోట్ల రద్దుపై అసెంబ్లీలో కూడా చర్చించి మద్దతు ఇచ్చామని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని చెప్పారు. పెద్దనోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, ఆర్థిక వృద్ధి ఆటంకం కలిగిందని తెలిపారు. జీడీపీ గణనీయంగా తగ్గడానికి అది కూడా ఓ కారణమన్నారు. తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన రాహుల్ గాంధీ టీఆర్‌ఎస్‌ను బీజేపీకి బీ టీం అన్నారని, అలాగే ప్రధాని మోదీ వచ్చి టీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌కు బీ టీం అన్నారని మంత్రి కేటీఆర్ గుర్తుచేస్తూ.. తాము ఎవరికీ బీ టీం కాదని, తెలంగాణ ప్రజలకు టీఆర్‌ఎస్ ఏ టీం అని స్పష్టంచేశారు.

# రెండువేల కోట్లు దారిమళ్లింపు!

- తెలుగు రాష్ర్టాల్లో భారీగా అవకతవకలు
- ఐటీదాడుల్లో గుర్తించిన అధికారులు
- మూడు ఇన్‌ఫ్రా కంపెనీల్లో సోదాలు
- భారీగా నగదు, నగలు స్వాధీనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, పుణె సహా మరో 40 ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో భారీగా అవకతవకలు గుర్తించామని ఆదాయపన్ను (ఐటీ) శాఖ గురువారం ప్రకటించింది. తెలుగు రాష్ర్టాల్లోని హైదరాబాద్, విజయవాడ, కడప, విశాఖపట్నం తదితర నగరాల్లో ఈ దాడులు చేసినట్టు చెప్పింది. మూడు ప్రముఖ ఇన్‌ఫ్రా కంపెనీలకు సంబంధించిన కార్యాలయాల్లో తనిఖీలు చేయగా.. బోగస్ సబ్‌కాంట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న అక్రమ లావాదేవీలు వెలుగుచూశాయని తెలిపింది. రూ.2 వేల కోట్లకుపైగా అవకతవకలను ప్రాథమికంగా గుర్తించామని ఐటీశాఖ వెల్లడించింది. బోగస్ బిల్లులు, ఓవర్ ఇన్వాయిసింగ్‌తో అక్రమాలకు పాల్పడినట్టు తెలిపింది. సోదాల్లో భాగంగా ఖాళీ బిల్లులు, ఇ-మెయిల్స్, వాట్సప్ మెసేజ్‌లు, విదేశీ లావాదేవీలు, ఇతర కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పింది. ఇన్‌ఫ్రా కంపెనీలు బోగస్ సబ్‌కాంట్రాక్టులు ఇచ్చినట్టుగా పత్రాలు సృష్టించాయని, పన్ను లెక్కలకు దొరకకుండా రూ.2 కోట్లలోపు చిన్న మొత్తాల రూపంలో నిధులను దారి మళ్లించాయని పేర్కొన్నది. ప్రధాన కార్పొరేట్ సంస్థ ఐపీ అడ్రస్ నుంచి సబ్‌కాంట్రాక్టర్లు, ప్రధాన కాంట్రాక్టర్లు ఐటీ రిటర్న్స్ దాఖలుచేసినట్టు తెలిపింది. గ్రూపు కంపెనీలకు రూ.కోట్లలో అనుమానిత విదేశీ పెట్టుబడులు వచ్చినట్టు గుర్తించామని చెప్పింది. ఓ ప్రముఖుడి మాజీ వ్యక్తిగత కార్యదర్శి ఇంటిపై కూడా తనిఖీలు చేసినట్టు పేర్కొన్నది. మొత్తంగా సోదాల్లో రూ.85 లక్షల నగదు, రూ.71 లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, 25 బ్యాంకు లాకర్లను సీజ్ చేశామని ఐటీశాఖ తెలిపింది.

# కేంద్రానికే ఎక్కువిచ్చాం

- గత ఐదేండ్లలో రూ.2.72 లక్షల కోట్లు చెల్లించాం
- తెలంగాణకు కేంద్రం ఇచ్చింది రూ.1.12 లక్షల కోట్లే
- రాష్ర్టానికి ఎక్కువ నిధులిచ్చామనడం సరికాదు
- ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు ఎక్కువ నిధులిచ్చామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ వేదికగా మాట్లాడటం బాధకలిగించిందని రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. గత ఐదేండ్లలో తెలంగాణ నుంచి వివిధ పన్నుల రూపేణా కేంద్రానికి రూ.2,72,926 కోట్లు చేరాయన్నారు. రాష్ర్టాల నుంచి జమ అయిన నిధులనే కేంద్రం తిరిగి రాష్ర్టాలకు కేటాయిస్తుందనే విషయాన్ని గమనించాలని, దీనిలో తెలంగాణ వాటా ఎక్కువగా ఉన్నదన్న విషయాన్ని గుర్తుచేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి రాష్ర్టానికి రూ.1,12,854 కోట్లు మాత్రమే వచ్చాయని, తెలంగాణ నుంచి రూ.1,60,072 కోట్లు ఎక్కువగా ఇచ్చామని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో వివరించారు. తెలంగాణకు కేంద్రం ఏ మేరకు నిధులు విడుదల చేసిందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర మంత్రిపై విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి రాకూడదన్నారు. గత ఐదేండ్లలో కేంద్రానికి తెలంగాణ చెల్లించిన పన్నుల లెక్కలను మంత్రి కేటీఆర్ సమగ్రంగా వివరించారు.

| ఏడాది | పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రం ఇచ్చినది | రాష్ర్టానికి వాటా రూపంలో కేంద్రం నుంచి వచ్చినది | వ్యత్యాసం (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2014-15 | 40,727 | 15,307 | 25,420 |
| 2015-16 | 52,250 | 21,745 | 30,505 |
| 2016-17 | 57,276 | 24,628 | 32,648 |
| 2017-18 | 52,996 | 24,479 | 28,517 |
| 2018-19 | 69,677 | 26,695 | 42,982 |
| మొత్తం | 2,72,926 | 1,12,854 | 1,60,072 |

## 16, 17న వివిధ పోస్టులకు నైపుణ్య పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్‌ఆర్టీసీ, బేవరేజస్ కార్పొరేషన్ సహా ఇతర నోటిఫికేషన్లకు సంబంధించిన వివిధ పోస్టుల అభ్యర్థులకు ఈ నెల 16, 17 తేదీల్లో కంప్యూటర్, అకౌంట్స్‌లో ప్రొఫిషియెన్సీ (నైపుణ్య) పరీక్షలు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ గురువారం ప్రకటించింది. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, హాల్‌టికెట్లను ఇప్పటికే వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నది.

## ఏప్రిల్ నుంచి ఎన్టీఎస్‌ఈ హాల్ టికెట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ రెండో దశ హాల్‌టికెట్లు ఏప్రిల్ నుంచి అందుబాటులో ఉంచనున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 10న పరీక్ష ఎన్టీఎస్‌ఈ పరీక్షను నిర్వహించనున్నారు. www.ncert.nic.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సత్యనారాయణరెడ్డి చెప్పారు. ఎన్సీఈఆర్టీ నిబంధనల ప్రకారం ఓబీసీ నాన్ క్రీమీలేయర్ అభ్యర్థులు ఫిబ్రవరి 22లోపు కులధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు.

## స్పైరో మెసిఫిన్ పురుగుమందుపై నిషేధం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** స్పైరో మెసిఫిన్ 22.9 శాతం క్రిమిసంహారక మందుపై వ్యవసాయశాఖ నిషేధం విధించింది. సరస్వతి అగ్రో కెమికల్స్ ఇండియా లిమిటెడ్ ఈ పురుగుమందును తయారుచేస్తున్నది. దీన్ని నాసిరకమైనదిగా చండీగఢ్‌లోని ప్రాంతీయ పురుగుమందుల పరిశోధన కేంద్రం తేల్చడంతో నిషేధం విధించినట్టు అధికారులు తెలిపారు.

## యాసంగి శనగ కొనుగోలుకు నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగి సీజన్ 2019-20 శనగ దిగుబడులకు కేంద్రప్రభుత్వ కనీస మద్దతుధర పథకం కోసం రాష్ట్రప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఏడాది యాసంగిలో 1.40 లక్షల హెక్టార్లలో రైతులు శనగపంటను సాగుచేశారు. రైతుల వద్ద నుంచి మార్క్‌ఫెడ్ సేకరించే శనగ ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌ఫీజును మినహాయించింది.

# అత్యంత సురక్షిత నగరం హైదరాబాద్

- రూ.500 కోట్లతో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆధునీకరణ
- హైదరాబాద్ నగరవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాల ఏర్పాటు
- హెచ్‌సీఎస్సీ లోగో ఆవిష్కరణలో హోంమంత్రి మహమూద్ అలీ



హెచ్‌సీఎస్సీ లోగోను ఆవిష్కరించిన హోం మంత్రి మహమూద్ అలీ. చిత్రంలో హైదరాబాద్ సీపీ, హెచ్‌సీఎస్సీ చైర్మన్ అంజనీకుమార్ ఐపీఎస్ శిఖాగోయల్ తదితరులు

**అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ:** శాంతిభద్రతల పరిరక్షణలో ప్రపంచస్థాయి నగరాలతో పోటీ పడుతూ.. అత్యంత సురక్షిత నగరంగా హైదరాబాద్ గుర్తింపు పొందిందని హోంమంత్రి మహమూద్ అలీ చెప్పారు. రూ.700 కోట్లతో రాష్ట్ర పోలీస్ వ్యవస్థను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ సారథ్యంలోని టీఆర్‌ఎస్ సర్కార్ కృషిచేస్తున్నదన్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) లోగోను గురువారం బేగంపేట్‌లోని హోటల్ గ్రాండ్ కాకతీయలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రూ.500 కోట్లతో ఆధునీకరిస్తున్నామని, నగరవ్యాప్తంగా ఒక లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు.

**తెలంగాణ పోలీస్ అత్యుత్తమ వ్యవస్థ**

జాతీయస్థాయిలో తెలంగాణ పోలీస్ అత్యుత్తమమైన వ్యవస్థగా రూపుదిద్దుకున్నదని నగర పోలీస్ కమిషనర్, హెచ్‌సీఎస్సీ చైర్మన్ అంజనీకుమార్ చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని మరింత సురక్షితమైన ప్రదేశంగా మార్చేందుకు అన్ని రకాల విధానాలను అవలంబిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఎస్సీ కార్యదర్శి భరణిఅరోల్, ప్రతినిధులు ఏ నారాయణరాజు, సినీరంగానికి చెందిన దిల్‌రాజు, సుప్రియ, ఐపీఎస్ అధికారులు డీఎస్ చౌహాన్, శిఖాగోయల్, అనిల్‌కుమార్, తరుణ్‌జోషి, ఏఆర్ శ్రీనివాస్, రమేశ్, పీ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌సీఎస్సీకి పలువురి విరాళం**

హెచ్‌సీఎస్సీకి పలువురు విరాళాలు ప్రకటించారు. జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ బిల్డింగ్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.10 లక్షల చెక్కును హోంమంత్రి మహమూద్ అలీకి అందజేసింది. నాట్కో ఫార్మా సంస్థ రూ.5 లక్షలు, గ్రీన్ కంపెనీ రూ.5 లక్షలు, గంగవరం పోర్ట్ రూ.2 లక్షలు, నవయుగ ఇంజినీరింగ్ లిమిటెడ్ రూ.3 లక్షలు, అన్నపూర్ణ స్టూడియోస్ ఈడీ సుప్రియ రూ.3 లక్షలు, సినీ నిర్మాత దిల్‌రాజు రూ.3 లక్షలు, మైరాన్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.50 వేలు విరాళాలుగా ప్రకటించారు.

# బ్లాక్‌స్పాట్స్‌పై నజర్!

మూడోపేజీ తరువాయి...

పరిధిలో 2017లో 303, 2019లో 259 ప్రమాదాలు జరిగాయి.

**తమిళనాడు విధానంపై అధ్యయనం**

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తమిళనాడులో విజయవంతంగా అమలవుతున్న 'తమిళనాడు యాక్సిడెంట్ అండ్ ఎమర్జెన్సీ కేర్ ఇన్సియేటివ్' విధానంపైనా తెలంగాణ పోలీసులు అధ్యయనం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన నిమిషాల వ్యవధిలోనే క్షతగాత్రులను దవాఖానలకు చేర్చడం, అక్కడ వైద్యబృందాలు అందుబాటులో ఉండడం, ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్, మెడికల్, ఆర్‌అండ్‌బీ ఇలా అన్నివిభాగాలను సమన్వయంచేసే విధానాన్ని తెలంగాణ పోలీస్ బృందం పరిశీలించింది. అడిషనల్ డీజీలు, ఐజీలు, ఇతర పోలీస్ ఉన్నతాధికారుల బృందం చెన్నై ప్రభుత్వ ఆసుపత్రి ట్రామా సెంటర్‌ను సందర్శించింది. ప్రభుత్వానికి పూర్తి నివేదికను సమర్పించింది.

**ఆ నాలుగు జిల్లాల్లో ఎక్కువ ప్రమాదాలు**

కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గత మూడేండ్లలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఆ జిల్లాల్లో జాతీయ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మిగిలిన జిల్లాల్లో కొంతమేర ఫలితాలు కనిపిస్తున్నాయి.

**బ్లాక్‌స్పాట్స్ మూడు రకాలు**

తరచూ ఒకేచోట ప్రమాదం జరిగితే దాన్ని బ్లాక్ స్పాట్‌గా పరిగణిస్తారు. వీటిలోనూ పరిమితకాలంలో ప్రమాదాల సంఖ్యను బట్టి ఏ,బీ,సీలుగా వర్గీకరించి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒకే ప్రదేశంలో ఆరునెలల కాలంలో ఐదు నుంచి తొమ్మిది వరకు ప్రమాదాలు జరిగితే దాన్ని సీ క్యాటగిరీగా, 10 నుంచి 19 జరిగితే బీ క్యాటగిరీగా.. 20 అంతకుమించి జరిగితే 'ఏ' క్యాటగిరీగా విభజించారు. అదేవిధంగా ప్రమాదానికి కారణమవుతున్న అంశాలను నాలుగురకాలుగా విభజించారు. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాలు, మానవ తప్పిదాలు, మెకానికల్ డిఫెక్ట్స్, వాతావరణం ప్రతికూలంగా ఉండడం.. వీటిలో చాలావరకు ప్రమాదాల్లో మానవ తప్పిదాలే ఉంటున్నట్టు గుర్తించారు.

| గత మూడేండ్లలో జనవరిలో నమోదైన ప్రమాదాలు | |
|---|---|
| ఏడాది | ప్రమాదాల సంఖ్య |
| 2018 | 475 |
| 2019 | 523 |
| 2020 | 491 |

**వేగ నియంత్రణతో ప్రమాదాలు తగ్గుముఖం**



ప్రమాదాలకు అతివేగమే ముఖ్యకారణం. జిల్లాలో అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వేగ నియంత్రణకు బొల్లార్డ్స్, రోడ్డుకు అడ్డుగా కొద్దిపాటి మందంగా ఉండే పెయింటింగ్ వేయించాం. వెలుతురు లేనిచోట లైట్లు ఏర్పాటు, తరచూ ప్రమాదాలు జరిగే గ్రామాల ప్రజాప్రతినిధులతో అవగాహన సమావేశాలు తదితర చర్యలతో జిల్లాలో ప్రమాదాలు 25 శాతం వరకు తగ్గించాం. మరింత తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం. - రంగనాథ్, ఎస్పీ, నల్లగొండ

**అవగాహన లేమితోనే ప్రమాదాలు**



మెదక్ జిల్లా పరిధిలో బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించడంతోపాటు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కువ వరకు వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు తెలియకపోవడంతోనూ ప్రమాదాల బారినపడుతున్నారు. అవగాహన కల్పించడంతోపాటు, నిబంధనలు అతిక్రమించకుండా జరిమానాలు విధిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చు.

- చందనా దీప్తి, ఎస్పీ, మెదక్

**రాష్ట్రంలో బ్లాక్ స్పాట్స్**

| ఏ రకమైన రోడ్డు | 2015 ఏడాది | 2016 ఏడాది | 2017 ఏడాది | 2018 ఏడాది | ప్రమాదాలు సంఖ్య |
|---|---|---|---|---|---|
| జాతీయ రహదారులు | 582 | 551 | 545 | 554 | 2232 |
| రాష్ట్ర రహదారులు | 180 | 174 | 179 | 168 | 701 |
| ఇతర రోడ్లు | 145 | 140 | 151 | 148 | 584 |
| మొత్తం | 907 | 865 | 875 | 870 | 3517 |

# నేర చరిత్ర చెప్పాల్సిందే

మూడోపేజీ తరువాయి...

ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. 2004 నుంచి సాధారణ ఎన్నికలను పరిశీలిస్తే రాజకీయాల్లో నేరచరితుల సంఖ్య ప్రమాదకరస్థాయికి పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. 2004లో ఎన్నికైన ఎంపీల్లో 24 శాతం మందికి, 2009లో ఎన్నికైనవారిలో 30 శాతం, 2014లో ఎన్నికైనవారిలో 34 శాతం మందికి నేరచరిత ఉండగా, 2019నాటికి ఆ సంఖ్య 43 శాతానికి పెరిగిందని ధర్మాసనం గుర్తుచేసింది. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక సమయంలో నేరచరితులకు 'మొదటి ప్రాధాన్యం' ఎందుకు ఇచ్చామో వివరణ ఇవ్వడం లేదని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ మేరకు అభ్యర్థుల నేరచరిత్రను ఆయా పార్టీల అధికారిక వెబ్‌సైట్లలో పొందుపరుచడంతోపాటు.. వారినే ఎందుకు ఎంపిక చేశామో వివరించాలని ఆదేశించింది. అదేసమయంలో క్రిమినల్ కేసులు లేని వేరే అభ్యర్థులను ఎందుకు ఎంపిక చేయలేదో కూడా వెల్లడించాలని చెప్పింది. 'విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి' అనేది కారణంగా చూపకూడదని, వారి విద్యార్హతలతోపాటు ఇతర బలమైన కారణాలను చెప్పాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. ఈ వివరాలన్నింటినీ ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయాలని, ఒక స్థానిక, ఒక జాతీయ పత్రికలో ప్రచురించాలని రాజకీయ పార్టీలను ధర్మాసనం ఆదేశించింది. అంతేకాకుండా ఆయా పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించిన 48 గంటల్లోగా లేదా నామినేషన్ దాఖలు గడువుకు కనీసం రెండువారాల ముందుగా వారి నేరచరిత్రకు సంబంధించిన పూర్తి వివరాలను ఎన్నికల సంఘానికి (ఈసీ) సమర్పించాలని స్పష్టం చేసింది. ఒకవేళ ఏ పార్టీ అయినా వివరాలను సమర్పించకుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసీకి ధర్మాసనం సూచించింది. వాటిని కోర్టు ధిక్కరణ కింద పరిగణిస్తామని హెచ్చరించింది. అంతకుముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలు వినిపించారు. రాజకీయ పార్టీలు కచ్చితంగా తమ అభ్యర్థుల నేరచరిత్రను, వారి ఎంపికకు గల కారణాలను పార్టీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఒకవేళ విఫలమైతే పార్టీలు, అభ్యర్థులపై తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ వాదనతో ఈసీ తరఫు న్యాయవాది ఏకీభవించారు. అయితే వివరాలను వెల్లడించని పార్టీలు, అభ్యర్థులపై ఆర్టికల్ 324 ప్రకారం శిక్ష విధించడం సాధ్యం కాదన్నారు. పార్లమెంట్ సభ్యుల్లో నేరచరితుల సంఖ్య పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో 43 మంది ఎంపీలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**ఇదీ నేపథ్యం..**

రాజకీయాల్లో నేరచరితులు పెరిగిపోతున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై 2018 సెప్టెంబర్‌లో ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ జరిపి పలు కీలక ఆదేశాలు జారీచేసింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు సమయంలో తమపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలన్నింటినీ పొందుపరుచాలని ఆదేశించింది. అభ్యర్థుల నేరచరిత్ర గురించి మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎన్నికల కమిషన్‌కు సూచించింది. రాజకీయాలు నేరచరితులతో నిండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని ప్రక్షాళన చేయాల్సి ఉన్నదని, తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నవారు రాజకీయాల్లోకి అడుగుపెట్టకుండా పార్లమెంట్ ఒక చట్టాన్ని రూపొందించాలని సూచించింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ 2018 అక్టోబర్ 10న అన్ని రాజకీయ పార్టీలకు నోటీసులు జారీ చేసింది. అభ్యర్థులు ఫారం-26లో తమ నేరచరిత్రను వెల్లడించాలని సూచించింది. అయితే చట్టాల్లో ఎలాంటి మార్పులు చేయకుండానే ఎన్నికల కమిషన్ ఫారం-26ను విడుదల చేసిందని, దీనికి చట్టబద్ధత లేదని, అశ్విని ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అంతేకాకుండా సుప్రీంకోర్టు ఆదేశాలను రాజకీయ పార్టీలు పాటించడం లేదని పేర్కొన్నారు.

## మోదీ వివరణ ఇస్తారా?: కాంగ్రెస్

సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. అయితే నరేంద్రమోదీ ఇప్పటికే ఈ నిబంధనను తుంగలో తొక్కారని విమర్శించింది. కర్ణాటకలో అక్రమ మైనింగ్, అటవీ నేరాలకు పాల్పడినవారికి (ఆనంద్ సింగ్) మంత్రి పదవి ఇచ్చారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా గుర్తుచేశారు. ఎన్నికల్లో 'బళ్లారి గ్యాంగ్'కు టికెట్లు ఇచ్చారని, వారికి ఎందుకు టికెట్ ఇచ్చారో చెప్పగలరా? అని ట్విట్టర్‌లో నిలదీశారు. ప్రజాధనాన్ని లూటీ చేసినవారికి మంత్రి పదవి కూడా కట్టబెట్టారని, సుప్రీంకోర్టు ఇప్పుడు ప్రధాని, కర్ణాటక ముఖ్యమంత్రిని నోటీసులు జారీ చేస్తుందా? అని ప్రశ్నించారు. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పుపై బీజేపీ హర్షం వ్యక్తం చేసింది. ఈ తీర్పుతో ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని, ప్రజలు తమ ప్రతినిధిగా ఎవరిని ఎన్నుకోవాలో మరింత స్పష్టత వస్తుందని ఆ పార్టీ అధికర ప్రతినిధి నలిన్ కోహ్లీ పేర్కొన్నారు.



ఢిల్లీ ఎన్నికల్లో మా సీనియర్ నేతలంతా ప్రచారం చేశారు. స్థానిక నాయకత్వం సరిగా లేనప్పుడు సీనియర్లు మాత్రం ఏం చేస్తారు? మేం మా శక్తిమేరకు కృషిచేశాం. మా మ్యానిఫెస్టో ప్రకటించటంలో బాగా ఆలస్యమైంది. మా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చెప్పలేకపోయాం. అందుకే ఓటమిపాలయ్యాం.

**మనోజ్ తివారీ, ఢిల్లీ బీజేపీ నేత**

ఢిల్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలు ఓటేసేటప్పుడు బటన్‌ను గట్టిగా నొక్కాలని, దాంతో షాహీన్‌బాగ్ నిరసనకారులకు షాక్ కొట్టాలని అమిత్ షా అన్నారు. ఇప్పుడు వంటగ్యాస్ సిలిండర్ ధర పెంచి ప్రజలకు షాక్ కొట్టించారు. ఏడాది కాలంలో రూ.200లు పెంచి బీజేపీ ప్రజల జేబులు కొట్టింది.

**రణ్‌దీప్‌సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి**



**చరిత్రలో నేడు**



**1936**

అమెరికా చికాగోలో నేషనల్ నీగ్రో కాంగ్రెస్ ప్రారంభం.

**1945**

ఐక్యరాజ్యసమితిలో చేరిన పెరూ, పరాగ్వే, చిలీ, ఈక్వెడార్.





**1960**

ప్రజాభిప్రాయ సేకరణ తతంగం నడిపి పాకిస్థాన్ అధ్యక్షుడిగా కొనసాగిన అయూబ్ ఖాన్.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనలో భాగంగా ఢిల్లీతో పాటు, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ను సందర్శించనున్నారు. అహ్మదాబాద్‌లో ట్రంప్‌కు 'కెమ్ చొ-ట్రంప్' పేరిట అపూర్వ స్వాగతం పలికేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతేడాది మోదీ అమెరికా పర్యటనలో హూస్టన్‌లో హౌడీ మోదీ పేరిట జరిగిన ఘనస్వాగత ఏర్పాట్లను తలదన్నే విధంగా ట్రంప్‌కు స్వాగతం పలుకనుండటం గమనార్హం. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్లో ట్రంప్ భారత్ పర్యటనకు విశేష ప్రాధాన్యం ఉన్నది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

ఐర్లాండ్‌లో గత శనివారం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీకి అధికారాన్ని చేపట్టేందుకు అవసరమైన మెజారిటీ రాకపోవటంతో ఆ దేశ రాజకీయాల్లో సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడ్డాయి. మూడు ప్రధాన పార్టీల మధ్య జరిగిన పోటీలో 2011 నుంచి అధికారానికి దూరంగా ఉన్న 'ఫియన్నా ఫేల్' పార్టీ 38 సీట్లు, ఫిన్‌ఫేన్ పార్టీ 37 సీట్లు, లియో వరద్కార్ నేతృత్వంలోని అధికార పార్టీలు 35 సీట్లు గెలుచుకున్నాయి. అనేక మౌలిక సమస్యలతో సతమతమవుతున్న ఐర్లాండ్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొనటంతో ఆందోళన వ్యక్తమవుతున్నది.

**ది హిందూ**



# ట్రంప్ పర్యటన

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ నెల 24వ తేదీ నుంచి రెండురోజుల పాటు మన దేశంలో పర్యటించడం ద్వైపాక్షిక సంబంధాలలో ప్రాధాన్య ఘట్టమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ట్రంప్ తొలిరోజు గుజరాత్‌లో పర్యటించి మరుసటి రోజు ఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకించి యూరప్‌లో మతవాద, జాత్యహంకార వాదనలు ప్రబలుతున్న సందర్భమిది. అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ ఇదే కోవకు చెందిన నాయకులు కనుక వీరిద్దరి మధ్య గాఢానుబంధం పెనవేసుకున్నది. మన దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగడానికి ముందు 2019 సెప్టెంబర్‌లో అమెరికాలో 'హౌడీ మోదీ' సభ ఏర్పాటైంది. ఇప్పుడు అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు ప్రచారం సాగుతున్న సందర్భమిది. తనకు లక్షలాది మందితో ఘనస్వాగతం లభించబోతున్నదని ట్రంప్ గొప్పగా చెప్పుకుంటున్నారు. 'హౌడీ' (కుశల ప్రశ్న) మాదిరిగానే గుజరాత్‌లో ట్రంప్ కోసం 'కెమ్ చో ట్రంప్' పేర సభ నిర్వహణ కోసం మోదీ ఏర్పాట్లు చేస్తున్నారు. విమానాశ్రయం నుంచి సభాస్థలి వరకు భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. 1959లో నెహ్రూ హయాంలో అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్‌కు ప్రజా స్వాగతం పలికిన తర్వాత మళ్ళా ఇటువంటి ఏర్పాట్లు చేయడం ఇదే మొదటిసారి. ఇది రెండు దేశాల మధ్య పెరుగుతున్న స్నేహబంధం కన్నా ఇరువురు నాయకుల భావ సారూప్యాన్ని ఎక్కువగా సూచిస్తున్నది. మొదటిరోజు గుజరాత్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ అధ్యక్షుడు ట్రంప్‌ను గాంధీజీ సబర్మతి ఆశ్రమ సందర్శనకు తీసుకుపోతారు. ప్రజల ఉద్వేగాలను రెచ్చగొట్టి అధికారానికి వచ్చిన ట్రంప్‌ను మోదీ అహింసా ప్రవక్త అయిన గాంధీ ఆశ్రమ సందర్శనకు తీసుకుపోవడం విశేషమే.

**ట్రంప్ భారత పర్యటన ఇరువురు నాయకులకు హర్షాతిరేకాన్ని కలిగిస్తున్నప్పటికీ, ఉభయ దేశాల స్నేహసంబంధాలను దృఢపరుస్తుందా? వాణిజ్య, రాజకీయ సంబంధాల్లో విభేదాలకు పరిష్కారాలను సూచిస్తుందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అంతర్జాతీయ సంబంధాలలో అమెరికానే అత్యంత దుందుడుకుగా వ్యవహరిస్తున్నది. అందులో ట్రంప్ మిత్రదేశాల మనోభావాలను ఏ మాత్రం లక్ష్య పెట్టరు. ఈ విషయంలో యురోపియన్ దేశాలే ఇబ్బంది పడుతున్నాయి. వాణిజ్య రక్షణ రంగాలతో పాటు అంతర్జాతీయ సంబంధాల విషయంలో కొంత నిక్కచ్చిగా వ్యవహరించడమే మంచిది.**

ట్రంప్ పర్యటన నేపథ్యంలో భారత్ అమెరికా నుంచి హెలికాప్టర్ల కోసం ఇరువై ఐదు వేల కోట్ల రూపాయల మేర భారీ కొనుగోలు ఒప్పందాన్ని ఖరారు చేసినట్టు తెలుస్తున్నది. ఒకప్పుడు రక్షణ రంగంలో రష్యా ప్రధాన సరఫరాదారుగా ఉండేది. కానీ ఇటీవలికాలంలో అమెరికా నుంచి కొనుగోళ్ళు భారీగా పెరిగిపోతున్నాయి. ట్రంప్ పర్యటన ఖరారు కాగానే అమెరికాలోని రెండు పార్టీలకు చెందిన నలుగురు సెనేటర్లు కశ్మీర్, మానవహక్కుల అంశాలను లేవనెత్తడం గమనార్హం. వీరు అమెరికా విదేశాంగ మంత్రికి రాసిన లేఖలో కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితుల పట్ల ఆందోళన వెలిబుచ్చారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని కూడా ప్రస్తావించారు. ఈ లేఖ రాసినవారిలో ట్రంప్‌కు సన్నిహిత సెనేటర్ లిండ్సే గ్రాహం కూడా ఉన్నారు. అమెరికాలోని సెనేటర్లకు నిజంగా పౌరహక్కుల పట్ల అంత నిబద్ధత ఉంటే తమ దేశంలోనే అల్పసంఖ్యాకవర్గాల పరిస్థితిని చక్కదిద్దవచ్చు. అమెరికా సైన్యాలను మోహరించిన పశ్చిమాసియా దేశాలలో, ఆఫ్ఘనిస్థాన్‌లో పరిస్థితిని పట్టించుకుంటే, భారత్ వైపు చూసేంత తీరుబడికూడా దొరుకదు. కానీ తమ వాణిజ్య ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి పౌరహక్కుల సమస్యను లేవనెత్తి బెదిరించడం వీరికి అలవాటుగా మారింది. అయితే సెనేటర్ల ఆరోపణల్లో నిజాయితీ లేనప్పటికీ, మన దేశంలో పరిస్థితులను మనం చక్కదిద్దుకోకూడదని కాదు. భారత్‌కు ప్రజాస్వామ్య దేశంగా ఉన్న ప్రతిష్ఠకు ఇటీవల మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మచ్చ తెస్తున్న మాట వాస్తవం. ప్రజాస్వామిక సూత్రాలను పాటించకపోతే ఆంతరంగికంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడటమే కాదు, అంతర్జాతీయంగా కూడా ఇబ్బందులు ఎదురవుతాయని మోదీ ప్రభుత్వం గ్రహించాలె.

ట్రంప్ భారత పర్యటన ఇరువురు నాయకులకు హర్షాతిరేకాన్ని కలిగిస్తున్నప్పటికీ, ఉభయ దేశాల స్నేహసంబంధాలను దృఢపరుస్తుందా? వాణిజ్య, రాజకీయ సంబంధాల్లో విభేదాలకు పరిష్కారాలను సూచిస్తుందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అంతర్జాతీయ సంబంధాలలో అమెరికానే అత్యంత దుందుడుకుగా వ్యవహరిస్తున్నది. అందులో ట్రంప్ మిత్రదేశాల మనోభావాలను ఏ మాత్రం లక్ష్య పెట్టరు. ఈ విషయంలో యురోపియన్ దేశాలే ఇబ్బంది పడుతున్నాయి. వాణిజ్య రక్షణ రంగాలతో పాటు అంతర్జాతీయ సంబంధాల విషయంలో కొంత నిక్కచ్చిగా వ్యవహరించడమే మంచిది. చైనా విషయంలో వ్యవహరించినట్టుగానే భారత్ పట్ల వాణిజ్య ఆంక్షలు విధిస్తామనే పరోక్ష సూచనలు అందుతున్నాయి. భారత్‌కున్న వాణిజ్య ప్రాధాన్యాలను అమెరికా రద్దుచేసింది. పలురంగాల్లో సుంకాలు విధించింది. ప్రపంచ వాణిజ్య ఒప్పందం ప్రకారం వర్ధమాన దేశాలకు కొంత వెసులుబాటు ఉంటుంది. కానీ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌ను వర్ధమాన దేశాల జాబితా నుంచి తొలిగించారు. ఇరాన్, వెనిజులా దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకోకుండా ఒత్తిడి చేయడం వల్ల భారత్‌కు ఆర్థికభారం పెరిగింది. రష్యా నుంచి రక్షణ కొనుగోళ్ల ఒప్పందాన్ని రద్దుచేసుకోమని అమెరికా నుంచి ఒత్తిడి వస్తున్నది. అమెరికాతో స్నేహబంధాన్ని కొనసాగిస్తూనే భారత్ స్వీయ ప్రయోజనాలను కాపాడుకోవాలె. ట్రంప్‌తో స్నేహాన్ని మోదీ దేశ ప్రయోజనాల పరిరక్షణకు ఏ మేర ఉపయోగించుకుంటారనేది ప్రధానం.

**జనగళం**

## ప్రేమికుల రోజు..

మంచి కవిత కోసం..  
కవిత్వాన్ని ప్రేమించాలి  
మంచి శ్వాస కోసం..  
ప్రకృతిని ప్రేమించాలి  
మంచి వ్యక్తిత్వం కోసం..  
విలువలను ప్రేమించాలి  
మంచి జీవనం కోసం..  
పర్యావరణాన్ని ప్రేమించాలి  
నీలో వెలుగు నిండటం కోసం..  
నీలోని చీకటిని ప్రేమించాలి  
విజయాన్ని చేజిక్కించుకునేందుకు  
ఓటమిని ప్రేమించాలి  
శత్రుత్వాన్ని అణిచివేసేందుకు  
స్నేహాన్ని ప్రేమించాలి  
వ్యామోహాన్ని వీడటంకోసం  
ధ్యానాన్ని ప్రేమించాలి  
ఆనందంగా బతికేందుకు  
కన్నవారిని ప్రేమించాలి  
దేశ ఔన్నత్యాన్ని చాటేందుకు  
జన్మనిచ్చిన భూమిని ప్రేమించాలి  
సూర్యచంద్రుల విశ్వప్రేమల్లే  
దేశమే దేహమనుకొని ప్రేమించాలి  
భారతీయతకదే సార్థకత కాదా  
ప్రతీరోజూ ప్రేమికుల రోజే కాదా..!

**– పాల్వంచ హరికిషన్**  
**95024 52780**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

వ్యవసాయం



**డాక్టర్ పిడిగెం సైదయ్య**

# ఫలించిన భగీరథ ప్రయత్నం

**వరి ధాన్యాన్ని రాష్ట్ర అవసరాల మేరకు పండిస్తున్నాం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి బడ్జెట్‌లో సరాసరిన రూ.25 వేల కోట్లు కేటాయిస్తూ రావటం ముదావహం. కేసీఆర్ స్వయంగా ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షిస్తుండటంతో అనతికాలంలోనే బీడు భూములకు సైతం సాగునీరు అందింది. ఫలితంగా నీరు ఎక్కువగా అవసరయ్యే వరిసాగు విస్తీర్ణం పెరిగింది.**

ముఖ్యమంత్రి కేసీఆర్ భగీరథ ప్రయత్నం ఫలించింది. కరువుబారిన పడిన తెలంగాణ ప్రాంతాన్ని అనతికాలంలోనే అన్నపూర్ణగా తీర్చిదిద్దటంలో సఫలీకృతులయ్యారు. తెలంగాణ అంటే మెట్ట పంటలే తప్ప వరి పండించటానికి పనికిరాదన్న పసలేని వాదనను కేసీఆర్ తన కార్యచరణ ద్వారా తిప్పికొట్టారు. ఇటీవల ఆర్థికగణాంక శాఖ విడుదల చేసిన రెండో ముందస్తు అంచనా నివేదిక ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నది.

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి నీళ్లందేలా, మొత్తంగా కోటి ఎకరాల మాగాణిని రైతులకు బహుమతిగా కేసీఆర్ అందజేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరంతో పాటు పలు ఇతర సాగునీటి ప్రాజెక్టులు జలకళ సంతరించుకోవటంతో పంటల సాగు విస్తీర్ణం సాధారణ అంచనాలను దాటింది. కరువు జిల్లాగా పేరుబోయిన పాత ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు యాసంగిలో సైతం వరి పంటను పండించటం ఆనందదాయకం. అయితే, చివరికి ఎండకాలంలో సైతం వరి పంటను పండించేందుకు ఇప్పటికే నారు పెంచుతుండటం చూస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి సౌలత్ ఎంతగా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. అదే జిల్లాలో యాసంగి వేరుశనగ సాగు రెండింతలయ్యింది. నీళ్లు లేక సాగు చేయలేకపోతున్నాం అనే మాట జిల్లాలో ఎక్కడా వినిపించడం లేదు. ఒకప్పుడు కుటుంబం బతుకటానికి బీడువారిన భూములను అమ్ముకునే వారు. నేడు ఒక రైతు గానీ, కుటుంబం కానీ భూములు అమ్మాలన్న ఆలోచనకు రాకపోవటం ప్రభు త్వం రైతులకు రైతుబంధుతో పాటు సాగునీటి లభ్యత ఇస్తున్న భరోసాయే కారణమని చెప్పొచ్చు.

వరి ధాన్యాన్ని రాష్ట్ర అవసరాల మేరకు పండిస్తున్నాం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి బడ్జెట్‌లో సరాసరిన రూ.25 వేల కోట్లు కేటాయిస్తూ రావటం ముదావహం. కేసీఆర్ స్వయంగా ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షిస్తుండటంతో అనతికాలంలోనే బీడు భూములకు సైతం సాగునీరు అందింది. ఫలితంగా నీరు ఎక్కువగా అవసరయ్యే వరిసాగు విస్తీర్ణం పెరిగింది. గతేడాదితో పోలిస్తే 40.17 శాతం అధిక దిగుబడులు నమోదయ్యాయంటే ఉత్పత్తి ఎంత పెరిగిందో ఊహించాల్సిందే. దీనికి తోడు 2019–20లో వానకాలం, యాసంగి కలిపి ఒక కోటి 30 లక్షల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడులు నమోదు కానున్నాయని అంచనా. వరిసాగు విస్తీర్ణం 48.68 శాతం, మక్కజొన్న 22.91 శాతం పెరుగటంతో రాష్ట్రంలో ఆహార ధాన్యాల దిగుబడుల రికార్డులన్నీ పెరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో అంటే 2014–15 సంవత్సరంలో వరి కేవలం 34.96 లక్షల ఎకరాల్లో సాగవ్వగా, ఈ ఏడా ది అది 68.50 లక్షల ఎకరాలకు చేరింది. అంటే విస్తీర్ణం రెండింతల య్యింది. 100 శాతం విస్తీర్ణం పెరిగిందని అర్థం. వరి సాగు విస్తీర్ణం పెరుగటం, పెరిగిన సాగునీటి లభ్యతకు సూచిక లాంటిది. వర్షాధారంగా పండని పంట ఇది. వరిధాన్యం దిగుబడి 2016–17లో తొలిసారిగా కోటి టన్నుల మైలురాయికి చేరుకోగా, ఈ ఏడాది 48.08 శాతం అదనంగా పెరిగి 1.48 కోట్ల టన్నులకు చేరిం ది. బియ్యం 2014–15 సంవత్సరంతో పోలిస్తే 2019–20 నాటికి 98.74 లక్షల టన్నులకు చేరి రెండింతలపైనే పెరిగింది.




పెరుగుతున్న సాగునీటి సౌకర్యంతో వచ్చే బడ్జెట్‌లో రెండు ప్రధాన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరమున్నది. సాగునీటి అందుబాటుతో వరి పంటను మాత్రమే పండించకుండా చూడాలి. వరిసాగుతో ఇప్పటికే రాష్ట్రానికి కావాల్సిన బియ్యం అవసరాలు తీరి మిగులు ఉన్నది. ఇతర దేశాలు, రాష్ట్రాలకు మన వరిపంటను ఎగుమతి చేయాలి. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి తెచ్చుకున్న ప్రాజెక్టు నీళ్ళను అనుత్పాదకతకు వాడుకోవద్దు. బదులుగా రైతులు మరింత ఆదాయాన్ని ఇచ్చే పంటల సాగు పెంచాల్సిన అవసరం ఉన్నది. ఇది ఒకటైతే, రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగుకు ఉన్న అపారమైన అవకాశాలను రైతులకు ఆదాయ మార్గాలుగా మార్చాల్సి ఉన్నది. పెరిగిన గోదావరి, కృష్ణా నదుల పరీవాహక ప్రాంతంలో వరికి బదులుగా మేలైన ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ ఫాంను ప్రోత్సహించవచ్చు. ఇక బిందు, తుంపర సేద్య పద్ధతులు రైతులు అవలంబిస్తే ఇంకా నీటి అవసరం తగ్గుతుంది. అంటే ఒక ఎకరాలో వరిసా గు చేయటానికి సరిపడే సాగునీటితో ఆరు ఎకరాలలో ఆయిల్ ఫాం సాగు చేయవచ్చు. ఏటా మనం వేల కోట్ల రూపాయల విలువ చేసే నూనెలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. బదులుగా ఆయి ల్ ఫాం సాగుకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉన్నది. ఆంధ్రప్రదేశ్, మిజోరం తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనే అధిక విస్తీర్ణంలో ఆయి ల్ ఫాం సాగవుతున్నది. రాష్ట్రంలో 18 జిల్లాల్లోని 206 మండలాల్లో ఆయిల్ ఫాం సాగుకు అనుకూల వాతావరణ పరిస్థితులున్నాయని కేంద్ర నిపుణుల కమిటీ తెలిపింది. 3 లక్షల హెక్టార్లలో సాగు చేసుకునేందుకు వీలున్నది. ఇప్పుడున్న విస్తీర్ణం 18 వేల హెక్టార్లు మాత్రమే. అయితే భవిష్యత్తులో ఆయిల్ ఫాం సాగుకు తెలంగాణ చిరునామాగా ఎదుగవచ్చు.

పెరిగిన సాగునీటి లభ్యతతో తెలంగాణ రైతుల జీవన ప్రమాణాలు కచ్చితంగా పెరుగనున్నాయి. సాగునీరు పంటల దిగుబడికి ఎంతో ముఖ్యమైనది. మెట్ట ప్రాంతాలతో పోలిస్తే సాగునీటి సౌకర్యమున్న ప్రాంతాలలో పంటల దిగుబడులు 2 నుంచి 3 రెట్లు ఎక్కువ. అంటే ఉన్న విస్తీర్ణంలోనే అదే పం టతో రెండు రెట్లు రైతుల ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయ పనులు పెరిగి ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా సాగులో పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో పంటల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువయ్యేవి. అందుకు కారణం కాలువల ద్వారా ఉచితంగా రైతులకు సాగునీరు అందేది కాదు. రైతులు బోరుబావులపైనే ఆధారపడటం, తరచుగా అవి విఫలం కావటంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండేవి. కానీ నేడు తెలంగాణ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సాగునీటి లభ్యత పెరుగటంతో, మెట్ట భూములు జలకళ సంతరించుకొని పచ్చని మాగాణి భూములుగా మారి రైతుకు ధైర్యాన్నిస్తున్నాయి. ఇందుకు దశ–దిశ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆరే. ఇప్పటికీ వ్యవసాయంలో ఆదర్శ రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అతిత్వరలో దేశ ఆహారధా న్యాలకు పెద్ద వనరుగా, అన్నపూర్ణగా మారనున్నది.

పెరిగిన సాగునీటి లభ్యతతో తెలంగాణ రైతుల జీవన ప్రమాణాలు కచ్చితంగా పెరుగనున్నాయి. సాగునీరు పంటల దిగుబడికి ఎంతో ముఖ్యమైనది. మెట్ట ప్రాంతాలతో పోలిస్తే సాగునీటి సౌకర్యమున్న ప్రాంతాలలో పంటల దిగుబడులు 2 నుంచి 3 రెట్లు ఎక్కువ. అంటే ఉన్న విస్తీర్ణంలోనే అదే పంటతో రెండు రెట్లు రైతుల ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయ పనులు పెరిగి ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా సాగులో పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో పంటల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువయ్యేవి. అందుకు కారణం కాలువల ద్వారా ఉచితంగా రైతులకు సాగునీరు అందేది కాదు. రైతులు బోరుబావులపైనే ఆధారపడటం, తరచుగా అవి విఫలం కావటంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండేవి. కానీ నేడు తెలంగాణ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సాగునీటి లభ్యత పెరుగటంతో, మెట్ట భూములు జలకళ సంతరించుకొని పచ్చని మాగాణి భూములుగా మారి రైతుకు ధైర్యాన్నిస్తున్నాయి.

(వ్యాసకర్త: అసోసియేట్ ప్రొఫెసర్, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

# మతపర విభజన తగదు

జాతీయం



**ప్రొఫెసర్ పి.సాంబయ్య**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరపట్టికపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఆఫ్ఘనిస్థాన్‌ల నుంచి వచ్చిన ముస్లిం శరణార్థులకు పౌరసత్వం లభించదు. శరణార్థులంటే ఎవరైనా శరణార్థులే. వారిని అనుమతించటమా లేదా అన్నది ఒక విధానం రూపొందించడంలో తప్పులేదు. ఒక మతం వారికి ఒక సూత్రం మరొక మతంవారికి మరొక సూత్రం మన రాజ్యాంగంలో లేదు. చొరబాటుదారులను గుర్తించవద్దని ఎవరూ అనడం లేదు. కానీ ఎవరు చొరబాటుదారులో, ఎవరు కాదో మతం ప్రాతిపదికన నిర్ణయించబూనుకోవడమే తప్పు. అది అమెరికాలో చేసినా, పాకిస్థాన్‌లో చేసినా తప్పు తప్పే. ఎవరో అలా చేశారు కాబట్టి ఇక్కడ కూడా అలా చేస్తామనడం మూర్ఖత్వం. పౌరసత్వ చట్టం ప్రకారం అక్రమ వలసదారుల్లో ముస్లింలు మినహా మిగిలిన మతాల వారికి పౌరసత్వం ఇస్తున్నది. అప్పుడు ముస్లింలు మాత్రమే అక్రమ వలసదారులుగా మిగిలిపోతారు. ఒక వ్యక్తి ఇక్కడ పౌరుడని రుజువు చేసుకోవాలంటే అతను మాత్రమే కాక అతని లేక ఆమె తల్లిదండ్రులు కూడా ఇక్కడే పుట్టినట్లు రుజువు చేయాలి. ఈ చట్టంతో ఏమి నష్టం లేదంటున్న కేం ద్రం లాభాలేమున్నాయో మాత్రం చెప్పలేకపోతున్నది.

పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లలో మైనార్టీ మతస్థులు (హిందువులు, క్రైస్తవులు, పార్శీలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు) అణిచివేతకు గురవుతున్నారని, ఆ అణిచివేతను తట్టుకోలేక వారంతా భారతదేశానికి పారిపోయివచ్చి ఇక్కడ తలదాచుకుంటున్నారని వారికి పౌరసత్వం కల్పించడం మన బాధ్యత అని కేంద్రం వాదిస్తున్నది. పొరుగు దేశాల్లో అణిచివేతకు గురైతే అది పొరుగు దేశానికి సంబంధించిన అంశం. అణిచివేత ఎక్కడ జరిగినా అది తప్పే కనుక మన దేశమూ స్పందించాలి. మైనార్టీలను అణిచివేయటం మంచిది కాదు మానుకోవాలని దౌత్యపరంగా చర్చించాలి. అలా దౌత్యపరంగా ప్రయత్నించారా? ఎప్పుడైనా అంతర్జాతీయ వేదికల్లో నిర్దిష్టంగా ఆ సమస్యను ప్రస్తావించారా? అలా ఎప్పుడూ చేసిన దాఖలాల్లేవు. పైగా 370 అధికరణ రద్దు తర్వాత మన దేశ అంతర్గత వ్యవహారాల్లో ఇతరులు తలదూర్చకూడదన్నదే ప్రభుత్వ సిద్ధాంతం అయితే మనం కూడా పొరుగు దేశంలో జరిగే ఉదంతాల ఊసు ఎత్తకూడదు కదా!

మనుష్యుల మధ్య మతపరమైన విభజన చేసే రాజ్యాంగ వ్యతిరేకమైన ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార పార్టీ మిత్రపక్షాలైన అకాలీదళ్, అసోం గణ పరిషత్, జనతాదళ్ (యు) తమ వ్యతిరేకతను తెలియజేశాయి. అకాలీదళ్ ఎన్నార్సీని అంగీకరించేది లేదని తేల్చిచెప్పింది. ఏ జాతినైనా ఆ దేశ ప్రధాన స్రవంతి నుం చి వేరు చేసి చూడటం దారుణం. కాంగ్రెస్ అలా సిక్కులను వేరుచేసినప్పు డు ఆ బాధ ఎలా ఉంటుందో మేం అనుభవించాం. అది ముస్లిం సోదరులకే కాదు, ఎవ్వరికి ఎదురుకాకూడదని పేర్కొన్నది. సిక్కులకు చట్టంలో పౌరసత్వాన్ని అనుమతించినప్పటికీ అకాలీదళ్ వ్యతిరేకిస్తున్నది. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ చట్టం ద్వారా తమ ప్రత్యేక సాంస్కృతిక, ఆర్థిక జీవనానికి ముప్పు ఏర్పడుతుందని అంటున్నారు. తమ రాష్ట్రాల్లో చొరబాటుదారులకు చట్టపరమైన స్థిరనివాస హక్కును కల్పిస్తున్నారని వారంతా ఆందోళన చెందుతున్నారు.

ప్రశ్నించేవాళ్లంతా దేశద్రోహులు కాదు. నిజం వైపు నిలబడేవారంతా దేశానికి శత్రువులు కాదు. మయన్మార్‌లో రోహింగ్యాలు, పాకిస్థాన్‌లో అహ్మదీయులు, షియాలు, శ్రీలంక తమిళుల మాటేంటి? అని అందరూ అడుగుతున్నారు. మతపరంగా వేరుచేసి వేధించిన ప్రభుత్వాల్లో ప్రస్తుత మయన్మార్ ప్రభుత్వం ముందున్నది. రోహింగ్యాలపై సాగించిన దారుణాలు చాలా ఉన్నాయి. దాన్ని ప్రపంచం యావత్తూ ఖండించింది. మతాతీతమైన పౌరసత్వాన్ని హామీ ఇస్తున్న రాజ్యాంగ విధానం ఉన్న దేశంలో మొదటిసారిగా అందుకు మతాన్ని ప్రాతిపదిక చేయడం వల్ల దేశంలోని సెక్యులర్, ప్రజాస్వామికవాదులు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా సార్వత్రిక ప్రతిఘటన ఉద్యమాన్ని నడుపుతున్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనల్లో జాతీయ జెండా, మహాత్మా గాంధీ ఫొటోలున్నాయి. కానీ అనుకూల ప్రదర్శనల్లో మాత్రం జాతీయ జెండాలతో పాటు కాషాయ జెండాలున్నాయి. బాష్పవాయువుతో చుట్టుముట్టినా, లాఠీలతో విరుచుకుపడినా నిలిచి పోరాడుతున్నారు. ప్రభుత్వ తీరుతెన్నులను మౌనంగా సహించక, నిర్భీతితో నిలదీసే ప్రజాస్వామిక చైతన్యశీలురుగా నిరసన తెలుపుతున్నారు.

దేశవ్యాప్తంగా ఆదివాసీలు అడవుల్లో నివసిస్తూ ఇప్పటికీ నాగరికతకు దూరంగానే ఉన్నారు. బీసీలుగా చెప్పబడేవాళ్లలో అనేక మంది సంచార జాతులుగా చిరునామాలు కూడా లేకుండా ఉన్నారు. వీళ్లంతా భారతీయ పౌరులుగా ఎలా నిరూపించుకుంటారు? ఏ ఆధారాలు చూపుతారు? నిరూపించుకోలేని వారంతా అస్సాంలో వలె నిర్బంధ శిబిరాల్లో మగ్గిపోవల్సిందేనా?

ప్రస్తుత దేశ రాజకీయాల గురించి తెలిసిన ఎవరికైనా, పౌరసత్వ సవరణ చట్టం ద్వారా బీజేపీ సాధించాలనుకున్న ప్రయోజనాలేమిటో స్పష్టంగా అర్థమవుతున్నది. మొదటిదిగా బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోవడం, రెండవది హిందూ రాష్ట్ర దిశగా పురోగమించడం, మైనార్టీలపై ద్వేషభావం పెంచి దేశంలోని మెజారిటీ ఓట్లను సొంతం చేసుకోవాలనే పన్నాగం ఉన్నది. సమాజాన్ని మరోసారి మత విద్వేషాల్లోకి దింపుతున్నారు. హిట్లర్ జాత్యంహకారం వల్ల జర్మనీ 50 ఏండ్లు వెనక్కిపోయింది.

పౌరసత్వ సవరణ చట్టం మందబలంతో రాజ్యాంగానికి వ్యతిరేకంగా పుట్టుకొచ్చింది. వ్యతిరేకించేవారికి హింసాత్మకంగా సమాధానం చెప్తున్నది. పౌరసత్వ సవరణ చట్టాన్ని అర్థం చేసుకోవడానికి మేధావులు కానవసరం లేదు. కేవలం మనుష్యులైతే సరిపోతుంది. పౌరసత్వ సవరణ చట్టం ఏ రోగం లేని వ్యక్తికి ఆపరేషన్ చేసినట్లుగా ఉంది. మొఘలులు ఈ దేశాన్ని 300 ఏండ్లు పాలించినా మనది ముస్లిం దేశం కాలేదు. బ్రిటిష్ వారు 200 ఏండ్లు పాలించినా మనది క్రైస్తవ దేశం కాలేదు. ఈ దేశాన్ని హిందువులతోనే నింపాలని బీజేపీ కలగంటే అది కలగానే మిగిలిపోతుంది. మనుష్యుల మధ్య మతపరమైన విభజన చేస్తూ, మానవ హక్కులను హరించే రాజ్యాంగ వ్యతిరేకమైన ఈ చట్టాన్ని ఉపసంహరించుకునేంతవరకూ పోరాడాల్సిన అవసరం ఉన్నది.

ప్రశ్నించేవాళ్లంతా దేశద్రోహులు కాదు. నిజం వైపు నిలబడేవారంతా దేశానికి శత్రువులు కాదు. మయన్మార్‌లో రోహింగ్యాలు, పాకిస్థాన్‌లో అహ్మదీయులు, షియాలు, శ్రీలంక తమిళుల మాటేంటి? అని అందరూ అడుగుతున్నారు. మతపరంగా వేరుచేసి వేధించిన ప్రభుత్వాల్లో ప్రస్తుత మయన్మార్ ప్రభుత్వం ముందున్నది. రోహింగ్యాలపై సాగించిన దారుణాలు చాలా ఉన్నాయి. దాన్ని ప్రపంచం యావత్తూ ఖండించింది. మతాతీతమైన పౌరసత్వాన్ని హామీ ఇస్తున్న రాజ్యాంగ విధానం ఉన్న దేశంలో మొదటిసారిగా అందుకు మతాన్ని ప్రాతిపదిక చేయడం వల్ల దేశంలోని సెక్యులర్, ప్రజాస్వామికవాదులు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా సార్వత్రిక ప్రతిఘటన ఉద్యమాన్ని నడుపుతున్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనల్లో జాతీయ జెండా, మహాత్మా గాంధీ ఫొటోలున్నాయి. కానీ అనుకూల ప్రదర్శనల్లో మాత్రం జాతీయ జెండాలతో పాటు కాషాయ జెండాలున్నాయి. బాష్పవాయువుతో చుట్టుముట్టినా, లాఠీలతో విరుచుకుపడినా నిలిచి పోరాడుతున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 41,460 | 12,175 |
| 106 | 26 |

ముడి చమురు (బ్రెంట్) 56.34 డాలర్లు

## నెలాఖర్లో భారత్‌కు సత్య నాదెళ్ల



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** మైక్రోసాఫ్ట్ సీఈవో, భారత సంతతికి చెందిన సత్య నాదెళ్ల ఈ నెలాఖర్లో భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ మేరకు గురువారం ఆ సంస్థ తెలియజేసింది. అయినప్పటికీ ఏయే తేదీల్లో నాదెళ్ల భారత పర్యటన ఉంటుంది?.. ఏ నగరాల్లో ఆయన పర్యటిస్తారు?.. అన్న వివరాలు మాత్రం తెలియరాలేదు. అయితే ఈ నెల 24-26 మధ్య నాదెళ్ల భారత పర్యటన ఉండొచ్చని సమాచారం. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లో ఆయన పర్యటిస్తారని తెలుస్తున్నది. ఈ సందర్భంగా పరిశ్రమ పెద్దలు, ఆయా ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఆయన సమావేశం కానున్నారని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తున్నది. కస్టమర్లు, యువ ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, డెవలపర్లనుద్దేశించి మాట్లాడుతారని ఓ ఈ-మెయిల్ ప్రశ్నకు మైక్రోసాఫ్ట్ జవాబిచ్చింది. కాగా, పౌరసత్వ సవరణ బిల్లుపై నాదెళ్ల ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన భారత పర్యటన ప్రాధాన్యతను సంతరించుకున్నది.

● డిస్కవరీ స్పోర్ట్ @ 57.06 లక్షలు




## డిస్కవరీ స్పోర్ట్‌లో బీఎస్-6 వెర్షన్

**ముంబై, ఫిబ్రవరి 13:** టాటా మోటర్స్‌కు చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్..గురువారం దేశీయ మార్కెట్లోకి ఎస్‌యూవీ డిస్కవరీ స్పోర్ట్‌ను బీఎస్-6 వెర్షన్‌లో విడుదల చేసింది. పెట్రోల్, డీజిల్ ఇంజిన్ కలిగిన ఈ కారు ప్రారంభ ధరను రూ.57.06 లక్షలుగా నిర్ణయించింది. ఈ నూతన డిస్కవరీ స్పోర్ట్‌లో ప్రీమియం ఎల్‌ఈడీ హెడ్‌లైట్స్, పలు నూతన ఫీచర్స్‌తో తయారు చేసింది. 2015లో దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఈ కారు అత్యధికంగా అమ్ముడవుతున్న మోడళ్లలో ఇది కూడా ఒకటని జేఎల్ఆర్ ఇండియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి తెలిపారు. 2019లో గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్న ఆటోమొబైల్ రంగం..2020లో మాత్రం కాస్త వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయన్నారు. ఈ ఏడాది కొత్తగా 10 నుంచి 12 మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. వీటిలో విద్యుత్‌తో నడిచేకార్లు, హైబ్రిడ్ వాహనాలు కూడా ఉన్నాయని ఆయన సంకేతాలిచ్చారు.

● వార్నర్ ఎస్టేట్ @ రూ.1,200 కోట్లు



## బెజోసా.. మజాకా



**శాన్‌ఫ్రాన్సిస్కో, ఫిబ్రవరి 13**

ప్రపంచ కుబేరుడు, ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్.. చారిత్రక వార్నర్ ఎస్టేట్‌ను సొంతం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.1,200 కోట్లు (165 మిలియన్ డాలర్లు). ఒకప్పుడు ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్‌కు చెందినదీ ప్రాంతం. ఇప్పుడు మీడియా మొగల్ డేవిడ్ గెఫెన్ నుంచి బెజోస్ కొనుగోలు చేసినట్లు ది వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. కాగా, ఈ డీల్ లాస్ ఏంజిల్స్ ప్రాంతంలో రికార్డు సృష్టించిందని, గతేడాది దాదాపు 150 మిలియన్ డాలర్లతో న్యూస్ కార్ప్ అధినేత రూపర్ట్ మర్డోచ్ కుమారుడు లచ్లన్ మర్డోచ్ కొన్న బెల్-ఎయిర్ ఎస్టేట్‌ను మించిపోయిందని జర్నల్ వెల్లడించింది. బెవర్లీ హిల్స్‌లో గల వార్నర్ ఎస్టేట్ 9 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. జార్జియన్ శైలి ప్రహరీతో ఉన్న ఈ ఎస్టేట్‌లో అతిథి గృహాలు, ఓ టెన్నిస్ కోర్టు, మరో గోల్ఫ్ కోర్స్ ఉన్నాయి. 1930ల్లో వార్నర్ బ్రదర్స్ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ జాక్ వార్నర్ ఈ ఎస్టేట్‌ను నిర్మించారు. బెజోస్ సంపద విలువ 110 బిలియన్ డాలర్ల పైమాటే (సుమారు రూ.8 లక్షల కోట్లు). ది వాషింగ్టన్ పోస్ట్ న్యూస్‌పేపర్ యజమాని కూడా బెజోసేనన్న విషయం తెలిసిందే. గతేడాది భార్య మెకంజీతో విడిపోయిన బెజోస్.. ఆమెకు తన ఆస్తిలో పెద్ద మొత్తాన్నే భరణంగా చెల్లించిన సంగతీ విదితమే.

● జాన్సన్ కొత్త మంత్రివర్గంలో రిషీకి చోటు

## బ్రిటన్ ఆర్థిక మంత్రిగా ఇన్ఫీ నారాయణ మూర్తి అల్లుడు



**లండన్, ఫిబ్రవరి 13:** ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అల్లుడు, భారత సంతతి యువ రాజకీయవేత్త రిషి సునక్.. బ్రిటన్ నూతన ఆర్థిక మంత్రిగా నియమితులైయ్యారు. బ్రిటిష్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్ తన మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణలో రిషీకి దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతల్ని అప్పగించారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో జాన్సన్‌కు భారీ మెజారిటీ వచ్చిన విషయం తెలిసిందే. కాగా, పాకిస్తాన్ సంతతికి చెందిన సాజిద్ జావిద్ తన ఆర్థిక మంత్రి పదవి (ఖజానా చాన్స్‌లర్)కి అనూహ్యంగా రాజీనామా చేయడంతో రిషీ తెరపైకొచ్చారు. జావిద్ జూనియర్‌గా ఉన్న రిషీ.. నిరుడు జూలై 24 నుంచి ట్రెజరీ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తూ వచ్చారు. ఈ క్రమంలో గురువారం ఏకంగా దేశ ఖజానాకు చాన్స్‌లరైయ్యారు. యార్క్‌షైర్‌లోని రిచ్‌మండ్ కన్జర్వేటివ్ పార్టీ ఎంపీగా ఉన్న 39 ఏండ్ల రిషీ.. మూర్తి కూతురు అక్షతను 2009లో పెండ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేటైన రిషీ.. 2015లో బ్రిటన్ పార్లమెంట్‌లోకి తొలిసారి అడుగుపెట్టారు. ఆ తర్వాత కన్జర్వేటివ్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగారు. బ్రెగ్జిట్ (యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలిగే ప్రక్రియ)లో జాన్సన్ వ్యూహాలకు రిషీ విధేయుడిగా పనిచేసి ఆయనకు దగ్గరైయ్యారు. ఇప్పుడు బ్రిటన్ ఆర్థిక మంత్రి అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. రిషీ తల్లి ఫార్మసిస్టు అవగా, తండ్రి నేషనల్ హెల్త్ సర్వీస్ జనరల్ ప్రాక్టీషనర్. ఇదిలావుంటే తాజా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భారత సంతతికి చెందిన ఎంపీలు అలోక్ శర్మ, సుయెల్లా బ్రవర్మన్ మరికొందరికి మంత్రి పదవులు దక్కుతాయన్న అంచనాలు వ్యక్తమైయ్యాయి. ప్రస్తుత మంత్రుల్లో పలువురి రాజీనామాలు, తొలగింపులతో కొత్తవారు చాలానే ఆశలు పెట్టుకున్నారు.

## ఏఐ చీఫ్‌గా మళ్లీ రాజీవ్ బన్సల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** సీనియర్ బ్యూరోక్రాట్ రాజీవ్ బన్సల్ ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా (ఏఐ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా మళ్లీ నియమితులయ్యారు. 2017లో మూడు నెలలపాటు కంపెనీ చీఫ్‌గా వ్యవహరించిన నాగలాండ్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన బన్సల్ రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు. వ్యక్తిగత మంత్రిత్వశాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుతం ఆయన పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇందుకు అపాయింట్‌మెంట్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్ అనుమతినిచ్చింది కూడా. అశ్వని లోహానీ పదవి విరమణ చేసిననాటి నుంచి ఈ పదవిలో ఎవర్నీ నియమించలేదు కేంద్ర ప్రభుత్వం. రూ.60 వేల కోట్లకు పైగా అప్పులతో సతమతమవుతున్న ఎయిర్ ఇండియాను ఈ ఆర్థిక కష్టాలు ఆయనకు స్వాగతం పలుకుతున్నాయి.



### ఆర్థిక కార్యదర్శిగా దేబాశిశ్ పాండా

సీనియర్ ఐఏఎస్ అధికారి దేబాశిశ్ పాండాను నూతన ఆర్థిక సేవల కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 1987 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన పాండాను ప్రస్తుతం కార్యదర్శిగా వ్యవహరిస్తున్న రాజీవ్ కుమార్ స్థానంలో నియమితులయ్యారు. అలాగే ఎఫ్ఎస్ఎస్ఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కుమార్ అగర్వాల్‌ను వినియోగదారుల వ్యవహారాల విభాగం కార్యదర్శికి బదిలీ చేసింది.

## అలహాబాద్ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** ప్రభుత్వరంగ సంస్థ అలహాబాద్ బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 5 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు ప్రకటించింది. ఈ నూతన రేట్లు శుక్రవారం నుంచి అమలులోకి రానున్నట్లు ఒక ప్రకటనలో బ్యాంక్ వెల్లడించింది. బ్యాంక్‌కు చెందిన అసెట్ లయబిలిటి మేనేజ్‌మెంట్ కమిటీ గురువారం సమావేశమై ఎంసీఎల్ఆర్‌ని తగ్గిస్తు నిర్ణయం తీసుకున్నది. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.30 శాతం నుంచి 8.25 శాతానికి దిగొచ్చింది.

## జీబీ@రూ.18.5

### భారత్‌లోనే తక్కువ ధర.. ప్రపంచ దేశాల్లో తొలి స్థానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీ టెలికం రంగంలోకి ప్రవేశించిన నాటి నుంచి భారత్‌లో మొబైల్ డాటా అత్యంత చౌకకే లభిస్తున్నది. ప్రపంచ దేశాల్లో జీబీ డాటా ధర సరాసరిగా డాలర్ స్థాయిలో ఉండగా..అదే దేశీయంగా రూ.18.5గా ఉన్నది. డాటా చార్జీల్లో భారత్ తొలిస్థానాన్ని అక్రమించుకున్నది. దేశీయంగా సరాసరిగా జీబీ డాటాకు అయ్యే ఖర్చు రూ.18.5 లేదా 0.26 డాలర్లుగా ఉన్నదని కేబుల్.కో.యూకే విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. పొరుగు దేశాలైన శ్రీలంకలో 0.78 డాలర్లుగాను, మంగోలియాలో 0.82 డాలర్లు, మయన్మార్‌లో 0.87 డాలర్లుగా ఉన్నది. ఈ మూడు దేశాలు టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. బ్రాడ్‌బ్యాండ్, టీవీ, ఫోన్ డీల్, టెలికం సేవలు అందిస్తున్న సంస్థల చార్జీలపై ఒక నివేదికను రూపొందించింది. దీంట్లో జింబాబ్వేలో ఒక్క జీబీ డాటాకు అయ్యే ఖర్చు 75.20 డాలర్లు. భారత్‌లో అవుతున్న దానికంటే జింబాబ్వేలో 289 రెట్లు అధికం. 230 దేశాల్లో ఉన్న 6,313 రకాల డాటా ప్లాన్ల ఆధారంగా సంస్థ ఈ నివేదికను రూపొందించింది. ఒక్కక్క దేశంలో జీబీ డాటాకు అయ్యే ఖర్చులో చాలా తేడాలున్నాయని తెలిపింది.

**182వ స్థానంలో అమెరికా**

అభివృద్ధి చెందుతున్న దేశాలైన అమెరికా, బ్రిటన్‌లో జీబీ డాటా కావాలంటే భారీగా నిధులు వెచ్చించాల్సి ఉంటుందని నివేదిక వెల్లడించింది. అమెరికాలో ఒక్క జీబీ డాటా కోసం 12.27 డాలర్లు చెల్లించాల్సి ఉండగా, అదే బ్రిటన్‌లో 6.66 డాలర్లు వెచ్చించాల్సి ఉంటుందని తెలిపింది. కేబుల్.కో విడుదల చేసిన ఈ జాబితాలో అమెరికాకు 182 స్థానం లభించగా, అదే బ్రిటన్ 136 స్థానంలో నిలిచింది. 0.27 డాలర్లతో కిర్గిస్తాన్‌కు రెండో స్థానం దక్కగా, ఆ తర్వాతి స్థానాల్లో కజకిస్తాన్(0.49 డాలర్లు), ఉక్రెయిన్(0.51 డాలర్లు) నిలిచాయి. 0.91 డాలర్లతో రష్యాకు 12వ స్థానం లభించింది. పలు దేశాలు ఎక్సలెంట్ మొబైల్, ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ మౌలిక సదుపాయాలు, టెలికం సంస్థలు డాటాకు భారీగా రాయితీలు ఇస్తుండటంతో చౌకకే లభిస్తున్నాయని కేబుల్.కో.యూకే విశ్లేషకులు డాన్ హౌడ్లా తెలిపారు. మూడేండ్లలోనే భారత్‌లో అతిపెద్ద టెలికం సంస్థగా జియో అవతరించడానికి ప్రధాన కారణం కూడా ఇదే కావడం విశేషం. ట్రాయ్ తాజా నివేదిక ప్రకారం జియోకు 36.9 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు.

**డౌన్‌లోడ్‌లో జియో..అప్‌లోడ్‌లో వొడాఫోన్**

సరాసరి 4జీ డౌన్‌లోడ్‌లో రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. సెకన్‌కు 20.9 మెగాబైట్ల డాటా డౌన్‌లోడ్‌తో జియో తన తొలిస్థానాన్ని కొనసాగిస్తున్నదని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. గత నెలలో 4జీ అప్‌లోడ్‌లో మాత్రం వొడాఫోన్ ఐడియా తొలిస్థానాన్ని చేజిక్కించుకున్నదని తెలిపింది. నవంబర్ నెలలో 27.2 ఎంబీపీఎస్ డౌన్‌లోడ్‌తో రికార్డును సృష్టించిన జియో ఆ తర్వాతి నెలల్లో క్రమంగా తగ్గుతూ వచ్చింది. భారతీ ఎయిర్‌టెల్ డౌన్‌లోడ్‌తో పోలిస్తే జియో మూడింతలు అధికంగా డౌన్‌లోడ్ అవుతున్నది. ఎయిర్‌టెల్ సరాసరి వేగం 7.9 ఎంబీపీఎస్ మాత్రమే ఉండగా, వొడాఫోన్ 7.6 ఎంబీపీఎస్, ఐడియా 6.5 ఎంబీపీఎస్‌గా ఉన్నది. అప్‌లోడ్‌లో మాత్రం 6 ఎంబీపీఎస్‌తో వొడాఫోన్ తొలిస్థానంలో నిలువగా..ఐడియా 5.6 ఎంబీపీఎస్‌తో ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. రిలయన్స్ జియో 4.6 ఎంబీపీఎస్‌తో, ఎయిర్‌టెల్ 3.8 ఎంబీపీఎస్‌గా ఉన్నది.







## ప్రపంచ మొబైల్ షో రద్దు

### జీఎస్ఎం అసోసియేషన్ ప్రకటన

**లండన్:** మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2020 రద్దైంది. ఈ మేరకు ప్రపంచ టెలికం పరిశ్రమ సంఘం జీఎస్ఎం అసోసియేషన్ గురువారం ప్రకటించింది. కోవిడ్-19 (కరోనా వైరస్) నేపథ్యంలో ఈ ప్రపంచ మొబైల్ టెక్నాలజీ షోకు ప్రముఖ సంస్థలన్నీ ఒక్కొక్కటిగా దూరం కావడంతో చివరకు ఈవెంటే నిలిచిపోయింది. 2006 నుంచి స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఏటా మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ జరుగుతున్నది. ఇందులో మంత్రులు, ప్రభుత్వ ప్రతినిధులు, విధానకర్తలు, టెలికం సంస్థల అధిపతులు, మొబైల్ ఫోన్ తయారీ సంస్థల యాజమాన్యాలు పెద్ద ఎత్తున పాల్గొంటాయి. కానీ ఈ ఏడాది ప్రాణాంతక మహమ్మారి కరోనా వైరస్ కారణంగా బ్రేకులు పడ్డాయి. చైనాలో పుట్టిన ఈ అంటువ్యాధి.. ఒక దేశం నుంచి మరో దేశానికి విస్తరించే ప్రమాదం ఉండటంతో మొబైల్ షో శ్రేయస్కరం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమైయ్యాయి. ఈ క్రమంలోనే వొడాఫోన్, సిస్కో, ఎల్‌జీ, వివో, ఎన్‌టీటీ డొకొమో, సోనీ, అమెజాన్, ఫేస్‌బుక్, మీడియాటెక్, ఇంటెల్, ఎన్విడియా తదితర సంస్థలన్నీ షోకు హాజరుకాలేమని స్పష్టం చేశాయి. ఈ నెల 24 నుంచి 27 వరకు నాలుగు రోజులపాటు ఈ టెక్నాలజీ సంబురం జరుగాల్సి ఉన్నది.

## నిట్‌లో రూ.172 కోట్లతో పరిశోధనా ప్రాజెక్ట్

### సిమన్స్ ఇండస్ట్రీ భాగస్వామ్యంతో ఏర్పాటు

**నిట్‌క్యాంపస్(వరంగల్ అర్బన్):** దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థగా ఉన్నత స్థానంలో ఉన్న నిట్ వరంగల్ మరో ప్రతిష్ఠాత్మక పరిశోధనా ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. సిమన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామిగా ఏర్పాటై రూ.172 కోట్లతో భారీ పరిశోధనా ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తున్నది. ఎంటీఏబీ టెక్నాలజీ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిట్‌లో ఇండస్ట్రీ 4.0 సాంకేతిక పరిశోధన ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై గురువారం నిట్ డైరెక్టర్ కార్యాలయంలో నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు, సిమన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ ఇండియా సేల్స్ లీడర్ మాథ్యూ థామస్, పార్ట్‌నర్ డైరెక్టర్ అనంత్ సంపత్, రీజినల్ డైరెక్టర్ గోపాల్ నాయుడు సంతకాలు చేశారు. అనంతరం నిట్ డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ.. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) సహకారంతో సిమన్స్-ఎంటీసీతో కలిసి రూ.172 కోట్లతో ప్రాజెక్ట్ చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం నిట్‌లో 25,000 చదరపు గజాల స్థలంలో ఆర్ట్ ల్యాబ్‌ను నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు ఇండస్ట్రీ 4.0 సాంకేతిక పరిజ్ఞానం అందించడంతోపాటు డిజిటల్ తయారీ రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ఏ వేణుగోపాల్, ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న నిట్ డైరెక్టర్, సిమన్స్ ప్రతినిధులు



## టీవీ దిగుమతులపై ఆంక్షలు?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** టెలివిజన్ దిగుమతులపై ఆంక్షలు విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. దేశంలోకి ప్రాధాన్యం లేని ఉత్పత్తుల దిగుమతుల్ని తగ్గించాలన్న లక్ష్యంలో భాగంగానే విదేశాల నుంచి వస్తున్న టెలివిజన్ సెట్లపై పరిమితుల్ని విధించాలని మోదీ సర్కారు భావిస్తున్నది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వాణిజ్య మంత్రిత్వ శాఖలు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనపై చర్చిస్తున్నాయని సంబంధిత వర్గాల సమాచారం. కాగా, ఆంక్షలతో కూడిన దిగుమతి వస్తువుల్లోకి టెలివిజన్లను తెస్తే.. విదేశాల నుంచి టెలివిజన్లను భారత్‌లోకి తీసుకురావడానికి వాణిజ్య మంత్రిత్వ శాఖలోని విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ (డీజీఎఫ్‌టీ) నుంచి లైసెన్సును పొందాల్సి ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) దేశంలోకి టెలివిజన్ల దిగుమతుల విలువ దాదాపు రూ.7 వేల కోట్లుగా ఉన్నది. ఇందులో చైనా వాటానే అత్యధికంగా 535 మిలియన్ డాలర్లు. ఆ తర్వాత వియత్నాం (327 మిలియన్ డాలర్లు), మలేషియా (109 మిలియన్ డాలర్లు), హాంకాంగ్ (10.52 మిలియన్ డాలర్లు), కొరియా, ఇండోనేషియా, థాయిలాండ్, జర్మనీ దేశాలున్నాయి. కాగా, విదేశాల నుంచి దిగుమతి అవుతున్న ఫర్నీచర్ ఉత్పత్తులపైనా ఆంక్షలు పెట్టాలని కేంద్రం చూస్తున్నది. తద్వారా దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనుకుంటున్నది. ఇప్పటికే రిఫైన్డ్ పామాయిల్ దిగుమతులపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

## ఆకట్టుకున్న ఎన్ఏసీఎల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 13:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను ఎన్ఏసీఎల్(గతంలో నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్) రూ.240.55 కోట్ల ఆదాయంపై రూ.3.09 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.201.59 కోట్ల ఆదాయంతో పోలిస్తే 19 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, నికర లాభంలో రెండింతల వృద్ధిని నమోదు చేసుకున్నది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలానికి రూ.744.49 కోట్ల ఆదాయంపై రూ.10.77 కోట్ల లాభాన్ని గడించింది. దేశీయంగా, ఎగుమతులు అంచనాలకుమించి వృద్ధి ని నమోదు చేసుకోవడం వల్లనే ఆదాయంలో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దేశీయ అమ్మకాల్లో 14 శాతం వృద్ధిని కనబరిచిన సంస్థ..ఎగుమతుల్లో 30 శాతం ఎగబాకాయి.

## అపోలో లాభం రూ.90 కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** వైద్య సేవలు అందిస్తున్న అగ్రగామి సంస్థల్లో ఒకటైన అపోలో హాస్పిటల్ ఆర్థిక ఫలితాల్లో భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీకి చెందిన అన్ని వర్టికల్స్ మెరుగైన ప్రదర్శణగావించడం వల్లనే లాభాల్లో 80 శాతం వృద్ధి నమోదై రూ.89.96 కోట్లు ఆర్జించింది. 2018-19 ఏడాది ఇదే త్రైమాసికానికిగాను సంస్థ రూ.49.87 కోట్లు లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కన్సాలిడెటేడ్ ఆదాయం రూ.2,495.04 కోట్ల నుంచి రూ.2,911.74 కోట్లకు చేరుకున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.3.25 మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించనున్నట్లు అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. నూతన టెక్నాలజీ ద్వారా వైద్య సేవలు అందించడం, నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్లకు డిమాండ్ నెలకొనడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందన్నారు. గత త్రైమాసికం చివరినాటికి కొత్తగా 14 ఆసుపత్రులను ఏర్పాటు చేయడంతో కొత్తగా 7,470 పడకలు అందుబాటులోకి వచ్చాయని, భవిష్యత్తులో మరిన్ని హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు.

## ఇక ప్రయాణంలోనే చార్జింగ్

### విద్యుత్ ఆధారిత వాహనాలకు ఊతం.. కొత్త టెక్నాలజీతో రోడ్ల నిర్మాణం.. దుబాయ్‌లో ట్రయల్ రన్

**దుబాయ్, ఫిబ్రవరి 13:** పర్యావరణ ప్రేమికులకు, విద్యుత్ వాహన ప్రియులకు జోష్‌నిచ్చే వార్త ఇది. చార్జింగ్ కోసం సమయాన్ని వృథా చేసుకోకుండా.. ప్రయాణంలోనే వాహన చార్జింగ్‌కు వీలైన రహదారులు వస్తున్నాయి మరి. వినడానికి కాస్త వింతగా ఉన్నా.. ఇది ముమ్మాటికీ నిజం. దుబాయ్‌లో ఇప్పటికే ఈ తరహా రహదారులను నిర్మించి పరీక్షిస్తున్నారు కూడా. పెట్రోల్, డీజిల్ తదితర ఇంధన ఆధారిత వాహనాల నుంచి కాలుష్య రహిత సౌర, విద్యుత్ ఆధారిత వాహనాల వైపు ప్రపంచం నడుస్తున్నదిప్పుడు. అయితే సోలార్ వాహనాలు కేవలం సూర్యుడి కిరణాలపై ఆధారపడి ఉండటంతో వాతావరణం అనుకూలంగా ఉంటేనే వాటి వినియోగానికి వీలున్నది. దీంతో విద్యుత్ ఆధారిత వాహనాలకే డిమాండ్ పెరుగుతున్నది. కానీ చార్జింగ్ సమస్య వేధిస్తుండటంతో కొనుగోలుదారులు నిరాశకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ కొత్త వైర్‌లెస్ టెక్నాలజీ.. వాహనం ప్రయాణిస్తున్నప్పుడే చార్జింగ్ అయ్యే వెసులుబాటును కల్పిస్తున్నది. దుబాయ్ నగరంలో ఓ 60 మీటర్ల మేర రోడ్డును రీజనన్స్ టెక్నాలజీలో మ్యాగ్నటిక్ క్షేత్రం ఆకృతిలో నిర్మించారు.



రోడ్డుపై కనిపించే పొర కింద పవర్ చార్జింగ్ గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా దీనిపై విద్యుత్ ఆధారిత కార్లు, బస్సులు తదితర వాహనాలు వెళ్తున్నప్పుడు వాటంతటవే చార్జింగ్ అవుతాయి. దీనివల్ల ప్రత్యేకంగా చార్జింగ్ కోసం వాహనదారులు ఆగాల్సిన పని లేదని యూఏఈ రహదారులు, రవాణా శాఖ (ఆర్టీఏ) వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. పర్యావరణ హిత వాహనాల వినియోగానికి వీలుగా దుబాయ్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ రోడ్ల నిర్మాణానికి సిద్ధమైనట్లు ఆర్టీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల బోర్డు చైర్మన్, డైరెక్టర్ జనరల్ మహమ్మద్ అల్ తయర్ చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం దుబాయ్ ఎలక్ట్రిసిటి, వాటర్ అథారిటీ, సిలికాన్ ఓయాసిస్‌లతో ఆర్టీఏ కలిసి పనిచేస్తున్నదని స్థానిక ఖలీజ్ టైమ్స్ తెలిపింది. కాగా, దక్షిణ కొరియా సైతం ఈ తరహా రోడ్లను ప్రజా రవాణా కోసం పరిశీలిస్తుండటం విశేషం. మొత్తానికి ఈ రోడ్ల నిర్మాణంతో చార్జింగ్ స్టేషన్ల అవసరం ఉండదని నిపుణులు అంటున్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న భారత్ వంటి దేశాలకు ఈ రోడ్లు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడుతున్నారు. దేశ ఇంధన అవసరాలు 80 శాతానికి పైగా విదేశీ దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో ఈ టెక్నాలజీ భారత్‌కు లాభదాయకమేనని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ రోడ్ల నిర్మాణ వ్యయంపై స్పష్టత వస్తేగానీ ముందుకు వెళ్లలేమని మరికొందరు అంటున్నారు.

## వొడాఫోన్ నష్టం రూ.6,439 కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** ప్రముఖ టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా నష్టాల పరంపర కొనసాగుతున్నది. గత త్రైమాసికానికిగాను సంస్థ రూ.6,438.80 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికానికిగాను రూ.5,004.60 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. ఏజీఆర్ బకాయిలను చెల్లించడానికి అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడం, ఆస్తుల విలువ అంతకంతకు పడిపోవడంతో లాభాలపై ప్రతికూల ప్రభావం చూపిందని పేర్కొంది. ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 5 శాతం తగ్గి రూ.11,380.50 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది రూ.11,982.80 కోట్లుగా ఉన్నది. గత త్రైమాసికంలో ఫైనాన్స్ చెల్లింపుల కోసం రూ.3,722.2 కోట్ల నిధులను కేటాయించగా, ఆస్తుల తరుగుదల 23 శాతం పెరిగి రూ.5,877.40 కోట్లుగా ఉన్నాయి. ఏజీఆర్ బకాయిలు చెల్లించాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికిగాను సంస్థ రూ.50,922 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో రవీందర్ టక్కర్ మాట్లాడుతూ..ఏజీఆర్ నుంచి మినహాయింపునివ్వాలని ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు.

## జీఎమ్మార్ నష్టం రూ.279 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 13:** హైదరాబాద్ కేంద్ర స్థానంగా విమానాశ్రయాలు, రోడ్లు నిర్వహిస్తున్న జీఎమ్మార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ క్రమంగా నష్టాలను తగ్గించుకుంటున్నది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.279 కోట్ల నష్టం వచ్చింది. 2018-19 ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.542 కోట్లతో పోలిస్తే భారీగా తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,958 కోట్ల నుంచి రూ.2,196 కోట్లకు పెరిగినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. వీటిలో విమానాశ్రయాలను నిర్వహించడం ద్వారా రూ.1,615.20 కోట్ల ఆదాయం సమకూరగా, విద్యుత్ విభాగం నుంచి రూ.207.20 కోట్లు లభించింది. అంతక్రితం ఏడాది రూ.1,358.3 కోట్లు, రూ.145.7 కోట్లుగా ఉన్నది. మూడో త్రైమాసికంలో ఢిల్లీ విమానాశ్రయం గుండా 1.87 కోట్ల మంది ప్రయాణించగా, అలాగే హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి 59 లక్షల మంది ప్రయాణించినట్లు తెలిపింది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నిర్వహణ ద్వారా సంస్థకు రూ.143 కోట్ల ఆదాయం సమకూరింది. అలాగే శంషాబాద్ విమానాశ్రయం నుంచి రూ.241 కోట్లు లభించాయి. 2022 నాటికి ఢిల్లీ విమానాశ్రయ సామర్థ్యాన్ని ఆరు కోట్ల నుంచి 10 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ..హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను 1.2 కోట్ల నుంచి 3.4 కోట్లకు పెంచాలనుకుంటున్నది.

నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM
# జిందగీ
శుక్రవారం 14 ఫిబ్రవరి 2020 /nt.zindagi



లెహంగా.. గాగ్రాచోళీ.. పేరు ఏదైతేనేం..
శతాబ్దాలుగా రాజ్యమేలుతున్న ట్రెండ్ ఇది..
దీన్ని ఎప్పటికప్పుడు సరికొత్తగా డిజైన్ చేస్తూ..
మరిన్ని మెరుగులద్దుతూ మగువల మనసు దోచేలా చేయాలి..
అందుకే ఇప్పుడు అంతా లేయర్ల బాట పట్టారు..
ఇప్పుడు నడుస్తున్న నయా ట్రెండ్ ఇది..
లేలేత వర్ణాల సోయగాలకు..
లేయర్లు అద్ది మరీ డిజైన్ చేసిన లెహంగాలు మీకోసం..

# లవ్లీ లేయర్స్!

స్టైలిష్‌గా ఉండాలనుకునే వారు ఈ డ్రెస్ ఎంచుకోవాల్సిందే! బీజ్ కలర్ రాసిల్క్ లెహంగాని లేయర్లుగా డిజైన్ చేశాం. పైన నెట్ మీద పూర్తి జరీ, థ్రెడ్ వర్క్‌తో హెవీగా నింపేశాం. చివర మాత్రం కట్ వర్క్ బార్డర్ ఇచ్చాం. రాసిల్క్ బ్లౌజ్‌కి 'వీ' నెక్ ఇచ్చాం. హ్యాండ్స్, బ్లౌజ్ మీద ఫెదర్ వర్క్‌తో నింపేసరికి సూపర్‌గా కనిపిస్తున్నది.

ఆకుపచ్చని అందం చూడతరమా అన్నట్లుగా ఈ లెహంగా ఉంది. రాసిల్క్ లెహంగా మీద థ్రెడ్, జరీ వర్క్‌తో హెవీగా వర్క్ చేయించాం. పార్టీల్లో జిగేల్‌మనిపించేలా ఈ లెహంగాని డిజైన్ చేశాం. రాసిల్క్ బ్లౌజ్‌ని కాస్త డిఫరెంట్‌గా ఉండాలని.. పెటర్‌పాన్ కాలర్ ఇచ్చాం. దీనిమీద వర్క్ చేయించాం. ఇక స్లీవ్స్‌ని లేయర్లుగా డిజైన్ చేయడంతో స్టైలిష్ లుక్ సొంతమైంది.

**రాజ్ సారెపల్లి**
ఫ్యాషన్ డిజైనర్
సువర్ణ మందిర్ సిల్క్స్
facebook.com/SriSuvarnaMandir
ఫోన్ : 9000305077

పీచ్ హెవీ వర్క్ నెట్ లెహంగాని లేయర్లుగా డిజైన్ చేసి హెవీగా వర్క్ చేయించాం. పెద్ద పెద్ద మోటిఫ్స్‌తో లెహంగా మొత్తం నింపేశాం. చివరన మాత్రం హెవీగా కట్‌వర్క్‌తో నింపేశాం. ఇదే నెట్ ఫ్యాబ్రిక్‌ని బ్లౌజ్‌గా ఎంచుకున్నాం. దానిమీద మాత్రం చిన్న పువ్వుల క్రీపర్ వర్క్ బ్లౌజ్ అందాన్ని రెట్టింపు చేసింది. డబుల్ షేడెడ్ నెట్ దుపట్టా మీద కూడా క్రీపర్ కట్ వర్క్ బార్డర్ రావడం దీనికి అదనపు ఆకర్షణ.

సీ బ్లూ కలర్ నెట్ లెహంగా ఇది. దీన్ని లేయర్లుగా డిజైన్ చేశాం. లెహంగా మొత్తం క్రీపర్ వర్క్‌తో నింపేశాం. కట్ వర్క్ బార్డర్ డ్రెస్ అందాన్ని రెట్టింపు చేసింది. ఇదే రంగు నెట్ బ్లౌజ్ మీద పీచ్ కలర్ థ్రెడ్, సిల్వర్ కట్‌దానాతో హెవీగా వర్క్ చేశాం. నెక్‌లైన్, స్లీవ్స్‌కి కట్ వర్క్ చేశాం. నెట్ దుపట్టా మీద కూడా ఇదే వర్క్ చేయించడంతో సూపర్‌గా మెరిసిపోతున్నది.

పౌడర్ బ్లూ కలర్ నెట్ లెహంగా ఇది. దీన్ని లేయర్లుగా డిజైన్ చేశాం. పైన లేయర్ మీద పీచ్‌కలర్‌లో కట్‌దానా వర్క్ చేశాం. అక్కడక్కడ సీక్వెన్స్ చిన్న బుటీస్ ఇచ్చాం. పౌడర్ బ్లూ సిల్క్ బ్లౌజ్ మీద పిట్టల డిజైన్ ఆకట్టుకునేలా ఉంది. హెవీగా ఈ వర్క్‌తోనే నింపేశాం. ఇదే రంగు నెట్ దుపట్టా మీద కట్‌వర్క్ బార్డర్ ఇచ్చి, అక్కడక్కడ చిన్న బుటీస్ ఇవ్వడం దీనికి పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అయింది.

## పారబోసే గంజితో ప్రకాశించే చర్మం



- ఒకప్పుడు గంజిని షాంపూగా, హెయిర్ కండీషనర్‌గా వాడేవారు. గంజిని ఉపయోగించడం వల్ల జుట్టు పట్టులా మెరుస్తుంది. గంజిలోని ఇనోసిటోల్ అనే కార్బోహైడ్రేట్ జుట్టు రాలడాన్ని అరికడుతుంది.
- కాలుష్యం, జీవనశైలి, ఒత్తిడి కారణంగా జుట్టు ఊడిపోతుంది. గంజిలోని అమైనో ఆమ్లాలు జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తాయి. లావెండర్ ఆయిల్‌ని కొద్దిగా గంజిలో కలిపి జుట్టుకు పట్టించి పదినిమిషాల తర్వాత కడిగితే హెయిర్ కండీషనర్‌గా ఉపయోగపడుతుంది.
- చర్మం పాలిపోయినట్లుగా, నల్లబడి ఉంటే గంజిని ఓ గిన్నెలో తీసుకొని కాటన్‌బాల్‌తో చర్మంపై రుద్దాలి. రోజూ ఇలా 15 నిమిషాలు చేస్తే రక్త ప్రసరణ మెరుగవుతుంది. మొటిమల తాలూకూ రంధ్రాలపై కాటన్ బాల్‌తో గంజిని రాస్తే కొన్ని రోజులకు రంధ్రాలు తొలిగిపోతాయి.
- గంజి నీళ్లలో కాస్త పసుపు వేసి బాగా కలపాలి. కాటన్ బాల్‌తో ముఖంపై తుడిస్తే ముఖంపై మచ్చలు, ముడతలు తొలగిపోయే అవకాశం ఉంది. కాకపోతే క్రమం తప్పకుండా నెల రోజులు ఇలా చేయాల్సి ఉంటుంది.

## చీరెకట్టు.. ఓ ప్రమోషన్ ట్రెండ్!



**ఇటీవల జరిగిన 'జాను' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సమంత కట్టుకున్న చీరెను గమనించారా? ఆ చీరెపై 'జాను' అని గులాబీ రంగులో రాసి ఉంది. అంతకుముందు బాలీవుడ్ మూవీ 'గుడ్ న్యూజ్' ప్రమోషన్‌లో కూడా హీరోయిన్ కరీనాకపూర్ ఖాన్ 'బేబో' అని రాసిన చీరెను ధరించి ఆకట్టుకున్నారు. మీకు తెలుసా..? ఇలాంటి చీరె కట్టుడు ఓ నయా ట్రెండ్.**

గ్రాండ్ ఈవెంట్లు, బహిరంగ ప్రదర్శనలు, సినిమా ప్రమోషన్లు.. కార్యక్రమం ఏదైనా చీరెకట్టు ఓ ప్రత్యేకమైతే.. ఆ చీరెపై ఓ సందేశం, పేరు ఉండడం ఓ సరికొత్త ట్రెండ్. బాలీవుడ్ నటి కరీనాకపూర్ ఖాన్ మొదలుపెట్టిన ఈ ట్రెండ్‌ను ఇప్పుడిప్పుడే సినీ జనాలు అలవాటు చేసుకుంటున్నారు. 'జాను' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో లేత గులాబీరంగు చీరెలో మెరిసిపోయింది సమంత. చీరెకట్టుతో ఆ వేడుకకే అందం తీసుకొచ్చింది. ఆమె కట్టుకున్న చీరెపై 'జాను' అని గులాబీ రంగులో రాసి ఉంది. అంతకుముందు ఇలాగే బాలీవుడ్ మూవీ 'గుడ్ న్యూజ్' ప్రమోషన్‌లో కూడా హీరోయిన్ కరీనాకపూర్ ఖాన్ 'బేబో' అని రాసిన లేత ఆకుపచ్చ రంగు చీరెను ధరించి ఆకట్టుకుంది. కరీనా బాటలోనే సమంత కూడా తెలుగు సినీ అభిమానులకు ఈ సరికొత్త ట్రెండ్‌ను పరిచయం చేసింది. వీరిద్దరూ ధరించినవి 'ఆర్గాంజా' చీరెలే. ఈ సిల్క్ ప్రింటెడ్ చీరెలు ఎంబ్రాయిటరీ ఫినిషింగ్‌తో ఆకట్టుకుంటున్నాయి. ఈ చీరెపై హ్యాండ్‌వర్క్‌తో నచ్చిన డిజైన్ చేయించుకోవచ్చు. మీకు నచ్చిన సందేశం ప్రింట్ చేసుకోవచ్చు. ఇద్దరు సినీతారలు ఇలాంటి చీరెలను తమ ప్రమోషన్ల కోసం వాడడంతో.. వీరి బాటలోనే మరికొంత మంది తమకు నచ్చిన పేర్లను చీరెలపై ప్రింట్ వేయిస్తున్నారు. ఈవెంట్‌కు తగ్గట్లుగా పేర్లను చీరెపై ముద్రిస్తూ.. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

# మీరే.. వరల్డ్ ఫేమస్ లవర్!

(Love Version 2.0)




**చచ్చేంత ప్రేమ.. చంపేంత ప్రేమ.. ఈ రెండింట్లో ఏది ట్రూ లవ్? ఇద్దరూ కలిసి ఉండేది ట్రూ లవ్. ఇద్దరికీ ఇష్టాలు.. కష్టాలు పంచుకోవడం ట్రూ లవ్. సుఖాల్ని.. సంతోషాల్ని సమానంగా అనుభవించడం ట్రూ లవ్. అంటే.. ప్రేమ ఎల్లప్పుడూ తోడుగా ఉండేదన్నమాట. ప్రేమకు అడ్డంకులు రావని కాదు.. సృష్టించరనీ కాదు. వాటిని అధిగమించి గెలుచుకోవడం నేర్చుకోవాలి. ప్రేమను సజీవంగా బతికించుకొని.. ప్రేమికులూ బతకాలి. ఆ ప్రేమ శాశ్వతంగా ఒక జ్ఞాపకమై వర్ధిల్లాలి.**

### ఇచ్చి.. పుచ్చుకునే ప్రేమ

'మోరీ' అనే ఒక ప్రేమికుడు అంటాడు. 'The most Important thing in life is to learn how to give out Love, and to let it come in' అని. వాస్తవమే కదా? ప్రేమను ఎలా ఇవ్వాలో.. ఎలా పొందాలో నేర్చుకోవడం జీవితంలో చాలా ముఖ్యమైన విషయం. చాలా ప్రేమలు విఫలమయ్యేది ఇక్కడే. ప్రేమిస్తున్నాం అంటారు.. కానీ దానిని అవతలి వ్యక్తికి ఎలా ఇవ్వాలో.. తిరిగి ప్రేమను ఎలా పొందాలో తెలియక తప్పటడుగులు వేస్తున్నారు. ప్రేమ పేరుతో వేధిస్తున్నారు.

### సాహసించి.. సంతోషించే ప్రేమ

ప్రేమ ఎప్పుడు పుట్టింది? మనిషి పుట్టినప్పుడు మనిషితోపాటు ప్రేమ కూడా పుట్టింది. ఏ ప్రేమ కూడా కలలో కలవరించగానే వచ్చి ఒళ్లో కూర్చోదు. సహవాస ధ్యాసే కాదు.. సాహసం కూడా ఉంటేనే ప్రేమను గెలుచుకోవచ్చు. రాతియుగం.. రాజుల కాలం నాటి ప్రేమలు ఇవే సందేశాన్నిస్తున్నాయి. ఈ రూట్లో వెళ్తేనే ప్రేమను ఆస్వాదించొచ్చు. ప్రేమ అడ్డంకులను గుర్తించదు. వాటిని దాటేసుకుంటూ వెళ్తుంది. పెద్దవాళ్లను ఒప్పించి ఒక్కటయ్యేలా ప్రేరేపిస్తుంది. 'మాయా' అనే ఒక ప్రేమికురాలు తన అనుభవాల్ని పంచుకుంటూ.. 'Love recognizes no barriers. It jumps hurdles, leaps fences, penetrates walls to arrive at its destination full of hope'.. అంటున్నారు.

### ఒప్పించి.. మెప్పించే ప్రేమ

ప్రేమకు కళ్లుండాలి.. చెవులుండాలి.. అన్నింటికీ మించి మంచి హృదయం ఉండాలి. ఏ పేరెంటూ తమ పిల్లలు ఆగమవ్వాలి అనుకోరు. లవ్ ఏదో.. అఫెక్షనేదో తెలియకుండా గుడ్డిగా ప్రేమించొద్దు అనేది వారి ఆవేదన. ప్రేమను ఒప్పుకునేందుకు గతంలో కులం.. ఆస్తి చూసేవారు. కానీ ఇప్పుడు గుణం చూస్తున్నారు. ఆ గుణవంతుల్లో గనుక మీరు ఉంటే.. ప్రేమను ఎక్కడో వెతికే పనిలో కాకుండా దానికి వ్యతిరేకంగా ఉన్న పెద్దలకు ఒప్పించే పనిలో ఉండటం మంచిది. 'రుమి' ప్రేమ గురించి ప్రస్తావిస్తూ.. 'Your task is not to seek for love, but merely to seek and find all the barriers within yourself that you have built against it' అని సూచిస్తున్నారు.

### ప్రార్థించి.. ప్రాధేయపడే ప్రేమ

ప్రేమలెప్పుడూ విజయవంతం కావాలి. కానీ విషాదం కాదు. పెద్దలు గతంలో వేరేలా ఆలోచించేవాళ్లు. ఇప్పుడు అప్‌డేట్ అయ్యి ఆలోచిస్తున్నారు. అన్నింట్లో మాదిరి ప్రేమ లోనూ స్వేచ్ఛ ఇస్తున్నారు. ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు. మీరు పొందాలనుకునే ప్రేమ దక్కదని భావిస్తే వేధించొద్దు. ప్రార్థించాలి. అంతకాదంటే ప్రాధేయపడాలి. జూలియా రాబర్ట్స్ అన్నట్టు.. 'You know it's love when all you want is that person to be happy, even if you're not part of their happiness' అనేది పాటించాలి. అంటే.. మీరు ఒక వ్యక్తి ప్రేమను పంచుకోవడంలో భాగం కాకపోయినా.. వారి సంతోషాన్ని కోరుకోవడమే నిజమైన ప్రేమ అన్నట్టు.



### ప్రేమించి.. పెండ్లి చేసుకునే ప్రేమ

ప్రేమను గెలుచుకోవడం నిజంగా ఒక వరం లాంటిదే. ప్రేమ విషయంలో అది వరమైనా.. శాపమైనా మన మీదే ఆధారపడి ఉంటుంది. ఇది ఒక పంట లాంటిది. మంచి ఎరువులేసి.. కలుపుతీసి పండిస్తే బాగా పండుతుంది. ఏదీ సక్రమంగా చేయకుండా ఉంటే నష్టం జరుగుతుంది. కాబట్టి ప్రేమను పెండ్లిదాకా తీసుకెళ్లాలంటే ఆ ప్రేమలో స్వచ్ఛత పుష్కలంగా ఉండాలి. ఆస్కార్ వైల్డ్ దీని గురించి ఏమంటారంటే.. 'Keep love in your heart. A life without it is like a sunless garden when the flowers are dead' అని. అంటే.. ప్రేమను మీ గుండెల్లో ఉంచుకోండి. అది లేని జీవితం పువ్వుల్లేని తోటకు సూర్యరశ్మి సోకడం లాంటిదన్నమాట. ఫైనల్‌గా.. ప్రేమ శాశ్వతం. దాని జ్ఞాపకాలు శాశ్వతం. ఒక తాజ్‌మహల్.. ఒక పురానాపూల్.. ఒక చార్మినార్.. ఒక హైదరాబాద్‌లా. ప్రేమలో నిజాయితీ ఉండాలి. ఒకరినొకరు అర్థం చేసుకునేదై ఉండాలి. జీవితాంతం వెన్నంటి ఉండేదై ఉండాలి. పెద్దలను గౌరవించేదై ఉండాలి. ఇవన్నీ ఉంటే మీరు world Famous Lover అయినట్టే.

**హ్యాపీ వాలెంటైన్స్ డే.**
**ప్రేమా జిందాబాద్.!!**


విజయ్ దేవరకొండ, రాశీఖన్నా

# కొత్త ఎక్స్‌పీరియన్స్..నాదీ హామీ

'ప్రతి సినిమాతో అభిమానులకు కొత్త అనుభూతిని పంచుతా. ఆ హామీ ఇస్తున్నా. నాలుగు ప్రేమకథలతో తెరకెక్కిన ఈ సినిమా వినూత్నంగా ఉంటుంది' అని అన్నారు విజయ్‌దేవరకొండ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. కె.ఎస్.రామారావు సమర్పణలో కె.ఎ.వల్లభ నిర్మిస్తున్నారు. క్రాంతిమాధవ్ దర్శకుడు. రాశీఖన్నా, ఐశ్వర్యారాజేష్, కేథరిన్, ఇజాబెల్లె కథానాయికలు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం వైజాగ్‌లో గ్రాండ్ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'నేను నటించిన తొమ్మిదో సినిమా ఇది. ఇదే నా ఆఖరు ప్రేమకథా చిత్రం. ముంబయిలో షూటింగ్‌లో ఉండి ఈ సినిమాను ఎక్కువగా ప్రమోట్ చేయలేదు. ప్రమోషన్స్ ప్రారంభించకుండానే 'హైదరాబాద్‌లో బుకింగ్స్ ఫుల్ అయ్యాయి' అని డిస్ట్రిబ్యూటర్ చెప్పారు. అభిమానుల ప్రేమ, ఆదరణ వల్లే ఇది సాధ్యమైంది. పల్లెటూరు, ప్యారిస్, హైదరాబాద్, వైజాగ్‌లలో జరిగే ప్రేమకథలతో నిజాయితీగా ఈ సినిమాను రూపొందించాం. ప్రతి ఒక్కరం కష్టపడి చేసిన సినిమా ఇది. ప్రేమికుల రోజు ప్రతి ఒక్కరూ ఈ లవ్‌స్టోరీస్‌తో సహానుభూతి చెందుతారనే నమ్మకముంది' అని తెలిపారు. 'వరల్డ్ ఫేమస్ లవర్'గా విజయ్ దేవరకొండ అందరిని అలరిస్తాడని క్రాంతిమాధవ్ అన్నారు. రాశీఖన్నా మాట్లాడుతూ 'ఈ సినిమాలో విజయ్ నటన, పాత్రచిత్రణ గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రేమలో పడే ముందు చాలా ఊహించుకుంటారు. ప్రేమలో పడిన తర్వాత ఆ ఊహలు తారుమారు అవుతాయి. ఈ అంశాన్నే సినిమాలో చూపిస్తున్నాం. గౌతమ్, యామినిల ప్రేమకథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది' అని చెప్పింది. ఈ వేడుకకు లుంగీ, తలపాగా ధరించి వేడుకకు హాజరై అభిమానుల్ని ఆకట్టుకున్నారు విజయ్ దేవరకొండ. ఈ కార్యక్రమంలో నిర్మాత వల్లభ తదితరులు పాల్గొన్నారు.

# మంచు మనోజ్ 'అహం బ్రహ్మాస్మి'


మంచు మనోజ్

మంచు మనోజ్ ఓ వినూత్న ఇతివృత్తంతో కూడిన సినిమాకు శ్రీకారం చుట్టారు. దీనికి 'అహం బ్రహ్మాస్మి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీకాంత్ ఎన్.రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర టైటిల్ లోగోను గురువారం విడుదల చేశారు. మార్చి 6న ఈ చిత్రాన్ని ప్రారంభించబోతున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కించబోతున్నారు. ఎంఎం ఆర్ట్స్ పతాకంపై మంచు మనోజ్, నిర్మలాదేవి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని విద్యా నిర్వాణ, మంచు ఆనంద్ సమర్పిస్తున్నారు. ఈ సినిమా గురించి ట్విట్టర్ ద్వారా మంచు మనోజ్ తెలియజేస్తూ 'మూడేళ్ల తర్వాత సినిమా చేస్తున్నా. ఎంతో భావోద్వేగంతో ఉన్నా. మీరు నాపై చూపించిన ప్రేమకు ధన్యవాదాలు' అని చెప్పారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

# నయన్ సినిమాలో సమంత!


సమంత

సవాళ్లతో కూడిన పాత్రలు అనగానే దక్షిణాది చిత్రసీమలో తొలుత గుర్తొచ్చే కథానాయిక నయనతార. ప్రస్తుతం ఆమె బాటలోనే సమంత అడుగులు వేస్తున్నారు. మహిళా ప్రధాన చిత్రాలు, ప్రయోగాత్మక ఇతివృత్తాలతో ఈ కథానాయికలిద్దరూ విజయాల్ని అందుకుంటున్నారు. తాజా సమాచారం ప్రకారం నయనతార, సమంత కలిసి ఓ సినిమా చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'నానుమ్ రౌడీథాన్' తర్వాత విజయ్‌సేతుపతి హీరోగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నది. ముక్కోణపు ప్రేమకథతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో నయనతార, సమంత కథానాయికలుగా నటించనున్నట్లు చెబుతున్నారు. 'కాతు వకుల రెండు కాదల్' అనే టైటిల్‌ను ఈ చిత్రానికి ఖరారు చేసినట్లు సమాచారం. త్వరలో ఈసినిమా సెట్స్‌పైకిరానున్నట్లు తెలిసింది.

# నాగశౌర్య కొత్త చిత్రం


రీతూవర్మ, నాగశౌర్య, నరసింహం, రాధాకృష్ణ, లక్ష్మిసౌజన్య తదితరులు

నాగశౌర్య కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న తాజా చిత్రం గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. రీతూవర్మ కథానాయిక. ఈ చిత్రం ద్వారా లక్ష్మిసౌజన్య దర్శకురాలిగా పరిచయమవుతున్నది. సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. 'ఈ నెల 19 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. నాగశౌర్యను కొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిది. కథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయి. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వంశీ పచ్చిపులుసు, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఎడిటర్: నవీన్‌నూలి, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, సమర్పణ: పి.డి.వి.ప్రసాద్, దర్శకత్వం: లక్ష్మిసౌజన్య.

# తెలంగాణ యాసలో మాట్లాడుతా!

'ప్రెజర్ కుక్కర్' చిత్రం ద్వారా కథానాయికగా పరిచయమవుతున్నది గుజరాతీ సుందరి ప్రీతీ అస్రాని. సాయిరోనక్ హీరోగా నటించిన ఈ చిత్రానికి సుజోయ్, సుశీల్ దర్శకత్వం వహించారు. ఈ నెల 21న అభిషేక్ పిక్చర్స్ ద్వారా విడుదలకానుంది. ఈ సందర్భంగా ప్రీతీ అస్రాని మాట్లాడుతూ 'మా స్వరాష్ట్రం గుజరాత్‌లో పాఠశాల విద్య పూర్తి చేయగానే కొన్ని లఘు చిత్రాల్లో నటించాను. రానా దగ్గుపాటి సోషల్ వెబ్ సిరీస్ చేశాను. 'మళ్లీరావా' చిత్రంలో ఓ కీలక పాత్రను పోషించాను. 'ప్రెజర్ కుక్కర్' కథానాయికగా తొలిచిత్రం. ఈ టైటిల్ విన్నప్పుడు ఆశ్చర్యంగా, గమ్మత్తుగా అనిపించింది.


ప్రీతీ అస్రాని

**అందుకే ఈ టైటిల్..**

బీటెక్ పూర్తయిన ఓ యువకుడిని అమెరికా వెళ్లి సెటిల్ కావాలని అతని తల్లిదండ్రులు, సన్నిహితులు ఒత్తిడి తెస్తుంటారు. దీంతో అతను ప్రెజర్ కుక్కర్‌లో ఉన్న భావనకు లోనవుతుంటాడు. ఆ కారణంగానే సినిమాకు ఆ టైటిల్ పెట్టాం. ఇందులో నేను అనిత అనే సామాజిక కార్యకర్తగా కనిపిస్తాను. నవతరం అమ్మాయికి ప్రతీకలా ఉంటాను. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, సెంటిమెంట్, సందేశం కలబోసిన సినిమా ఇది. ఈ సినిమాలో నేను తెలంగాణ యాసలో మాట్లాడుతాను. నేనే స్వయంగా డబ్బింగ్ చెప్పాను. ప్రస్తుతం గోపీచంద్ నటిస్తున్న 'సీటీమార్' చిత్రంలో కీలక పాత్రను పోషిస్తున్నా.

# బస్తి బాలరాజు కబురు


కార్తికేయ,అన్విత, అల్లు అరవింద్, బన్నీవాసు,అయాన్

కార్తికేయ, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రం 'చావు కబురు చల్లగా'. జీఏ2 పిక్చర్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కౌశిక్ పెగళ్లపాటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ మనవరాలు అన్విత క్లాప్‌నివ్వగా హీరో అల్లు అర్జున్ కుమారుడు అయాన్ కెమెరా స్విఛాన్ చేశారు. అల్లు అరవింద్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో కార్తికేయ బస్తి బాలరాజు పాత్రలో కనిపించనున్నారు. 'రొటీన్ భిన్నంగా సాగే కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ నెల 19 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అని చిత్ర బృందం తెలిపింది. ఆమని, శ్రీకాంత్ అయ్యంగర్, మహేష్, భద్రం ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: సునీల్‌రెడ్డి, ఎడిటింగ్: సత్య, ప్రొడక్షన్ డిజైనర్: మనీషా ఏ దత్.


మోహన్‌బాబు, సూర్య, విజయ్‌కుమార్, సుధా కొంగర, ప్రకాష్

# గగన వీధిలో..

సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా తమిళ చిత్రం 'సూరరై పోట్రు' తెలుగులో 'ఆకాశం నీ హద్దురా' పేరుతో ప్రేక్షకులముందుకురానుంది. ఎయిర్‌దక్కన్ వ్యవస్థాపకుడు జీఆర్ గోపీనాథ్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సుధా కొంగర దర్శకురాలు. ఈ సినిమాలోని 'పిల్లా పులి..' అనే పాటతో పాటు దాని తాలూకు వీడియోను గురువారం విడుదల రిలీజ్ చేశారు.ఈ గీతం విడుదల కార్యక్రమాన్ని విమాన ప్రయాణంలో వైవిధ్యంగా నిర్వహించారు. సూర్య అగరం ఫౌండేషన్ నుంచి 100మంది పేద విద్యార్థులను ఎంపిక చేసుకొని వారికి విమాన ప్రయాణ అనుభూతిని అందించారు. '2000సంవత్సరంలో ఒక శాతం ప్రజలు మాత్రమే విమాన ప్రయాణం చేసేవారు. కెప్టెన్ గోపీనాథ్ భారతీయ విమానయాన చరిత్రను మార్చివేశారు. సామాన్యుడికి విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సినిమా ఆయన అంకితభావానికి నివాళి' అని సూర్య అన్నారు. ఈ సినిమాలో మోహన్‌బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు.

# చీకటితో పోరాటం


కృతిగార్గ్

కృతిగార్గ్, అభిరామ్‌వర్మ, కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాహు'. సుబ్బు వేదుల దర్శకత్వం వహిస్తూ ఏ.వి.ఆర్ స్వామి, శ్రీ శక్తిబాబ్జీ, రాజా దేవరకొండలతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 28న విడుదలకానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కన్వర్షన్ డిజార్డర్ అనే సమస్యతో బాధపడే భాను అనే యువతి కథ ఇది. రక్తాన్ని చూస్తే ఆమెకు కళ్లు కనిపించవు. అనూహ్యంగా ఆమె ఓ ప్రమాదంలో చిక్కుకుంటుంది. తన సమస్యను అధిగమిస్తూ శత్రువులతో ఆమె ఎలాంటి పోరాటం చేసిందన్నది ఆసక్తిని పంచుతుంది. థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కించాం. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సరికొత్తగా ఉంటుంది. సిధ్ శ్రీరామ్ ఆలపించిన 'ఎన్నెన్నో వర్ణాలు వాలాయి..' గీతానికి చక్కటి స్పందన లభిస్తున్నది. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా సినిమాను విడుదలచేస్తున్నాం' అని తెలిపారు. చలాకీ చంటి, గిరిధర్, సత్యంరాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, ఛాయాగ్రహణం: సురేష్ రగతు.






నమస్తే తెలంగాణ
శాస్త్ర
[ కరీంనగర్ ]
శుక్రవారం 14 ఫిబ్రవరి 2020

భూభౌగోళిక విజ్ఞానశాస్త్రం

# భూమిపైనే జీవరహిత ప్రదేశం

**జీవ మనుగడకు అవకాశం లేని ప్రదేశాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. 'సూక్ష్మజీవజాలం లేని చోటు అసలే ఉండదని' భావిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ కొత్త పరిశోధన ఆసక్తికరంగా మారింది.**



**తూర్పు** ఆఫ్రికా ఇథియోపియా దేశంలోని డల్లాల్ (Dallol) గ్రామపరిధికి చెందిన భూఉష్ణక్షేత్ర మడుగులలో 'సూక్ష్మజీవ ఆనవాళ్లు కనిపించడం లేదని' తాజా పరిశోధనలో తేలింది. డానాకిల్ (Danakil) ఎడారి ప్రభావితమైన ఈ ప్రదేశం ఎంత నరకతుల్యమైందంటే 'అక్కడి మడుగులన్నీ భౌగోళికపరంగా అత్యుష్ణ, అత్యధిక జఠరామ్లత, లవణీయతలను కలిగి ఉన్నాయి. ఇంతటి బహుళ తీవ్రతర (multi-extreme) ఆవరణాలే జీవరాహిత్యానికి దోహద పడుతున్నట్టు శాస్త్రవేత్తలు ప్రకటించారు. సాధారణంగానే ఇక్కడ చలికాలంలోనే 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. దీనికితోడు ఓ అగ్ని పర్వత బిలం నుండి వచ్చిన తీవ్ర లవణీయ, విషవాయువుల కారణంగా సరస్సు జలాలు భీకరంగా మరిగాయి. లవణీయత, ఆమ్లీయతల కొలతలు (pH values) పూర్తి ప్రతికూలతకు చేరాయి. తత్ఫలితంగానే ఆ మడుగులలో సూక్ష్మజీవాల ఆనవాళ్లు మృగ్యమైనట్లు వారు పేర్కొన్నారు. గతేడాది (2019) అక్టోబర్‌లో 'ఫ్రెంచ్ నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ రీసర్చ్' (సీఎన్ఆర్ఎస్)కు చెందిన శాస్త్రవేత్తలు జరిపిన ఈ పరిశోధన 'నేచర్ ఎకాలొజీ అండ్ ఎవొల్యూషన్' తాజా సంచికలో ప్రచురితమైంది. దీనికంటే ముందు కిందటేడాదే వేరొక పరిశోధన ఆ తటాకాలలో జీవమున్నట్లు తేల్చినా, తాజా పరిశోధనలో భాగంగా విభిన్న విధానాలు జీవరహిత స్థితినే వెల్లడించడం గమనార్హం.

ఆరోగ్యశాస్త్రం

# కొత్త ఎర్రరక్త కణాలు

**మానవ శరీరంలోకి ఔషధాలను చేరవేయగల అసాధారణ ఎర్రరక్త కణాలకు శాస్త్రవేత్తలు రూపకల్పన చేశారు. ప్రస్తుత 'కృత్రిమ అణువుల పనితనాన్ని' మించిన సామర్థ్యాన్ని ఇవి కలిగి ఉండడం విశేషం.**



**మన దేహం** పొడుగునా ఔషధాన్ని చేరవేయగల అద్భుత ఎర్రరక్త కణాల (Super-human red blood cells) ఆధునీకృత విధానాన్ని కెనడాలోని మాక్‌మాస్టర్ యూనివర్సిటీ పరిశోధకులు అభివృద్ధి పరిచారు. క్యాన్సర్, అల్జీమర్స్‌వంటి వినాశనకర, సంక్రమణ వ్యాధుల కణితిలు (tumours), బ్యాక్టీరియా (సూక్ష్మజీవులు)కు చికిత్సకోసం పనిచేసేలా వీటిని రూపొందించారు. ఒకేసారి కొన్ని వారాలపాటు శరీరంలో వీటిని ప్రవహింపజేయవచ్చుననీ వారన్నారు. 'అడ్వాన్స్‌డ్ బయోసిస్టమ్స్' పత్రికలో ఇటీవల ప్రచురితమైన ఈ కొత్త సాంకేతికత 'ప్రస్తుత కృత్రిమ అణువులతో చేసే ఔషధ బట్వాడా విధానాలవల్ల ఎదురవుతున్న ముఖ్యసమస్యను పరిష్కరించిందని కూడా వారు తెలిపారు. ఎర్రరక్త కణాన్ని తెరిచి, బాహ్య కుడ్యాన్ని ఆధునీకరించి, ఔషధ పరమాణువును చేర్చి, తిరిగి శరీరంలోకి ఇంజెక్ట్ చేయగల రీతిలో దీని విధానాన్ని తయారు చేశారు. కృత్రిమ, జీవసంబంధ పదార్థంతో రూపొందిన ఈ ఎర్రరక్త కణం పనితనం మామూలు ఎర్రరక్త కణం వలెనే ఉండటమేకాక ఉపరితలం సంబంధిత బ్యాక్టీరియాకు అంటుకోగలదిగానూ ఉంది. వీటిద్వారా పేషెంటుకు ఇచ్చే డోసేజ్‌ను అవసరానుకూలంగా తగ్గించుకోవచ్చునని కూడా వారంటున్నారు.

శాస్త్రీయం

# పూలలో సువాసన ఎలా?

**ప్రకృతిలోని చాలా పువ్వులు పర్ఫ్యూముల వలె సువాసనలను వెదజల్లడానికి వాటిలోని వివిధ రసాయనాల సమ్మేళనాలే కారణమని శాస్త్రవేత్తలు అంటున్నారు.**



**రోజాపూలలోని** రసాయనాల సమ్మేళనాన్ని 'సిస్‌రోజ్ ఆక్సైడ్' (cis-Rose oxide) గా పిలుస్తారు. స్వచ్ఛమైన రోజాల సువాసనకు 'ఐసోమర్ ఆఫ్ రోజ్ ఆక్సైడ్' ( isomers of rose oxide) అని పేరు పెట్టారు. ఇక, పూలగుత్తిలో కార్నేషన్స్ (carnations) వాడుతారు. రోజాలకంటే కార్నేషన్స్ కొంత తక్కువ గుబాళింపుతో ఉంటాయి. వాసన అన్నది రావడానికి సహజంగానే యుజెనాల్ (Eugenol) అనే రసాయనం దోహదం చేస్తుందని శాస్త్రవేత్తలు అంటారు. దానితోపాటు బీటా-కార్యోఫైలిన్ (Beta-caryophyllene), బెంజాయిక్ యాసిడ్లు (Benzoic acid) కూడా వాసనను వెదజల్లుతాయి. వాయిలెట్స్ (violet)నూ పూలగుత్తులలో వాడతారు. రోజాలు, కార్నేషన్స్‌లోకంటే పూలగుత్తులలోనే ఎక్కువగా వాయిలెట్స్ వినియోగిస్తారు. వీటిలో అయొనోనెస్ (ionones) అనే రసాయనం ఉంటుంది. లిల్లీపూలలో వేరే రసాయన మిశ్రమం ఉంటుంది. జీనెస్ (ఇ), బీటా ఓసిమెన్స్ (genes (e)-beta ocimene), లినాలుల్ (Linalool)ల రసాయనాల కారణంగా లిల్లీపూలకు అంతటి సువాసన వస్తుందని వారంటున్నారు.

రోజాపూలలోని ఎంజైమ్ డీఎన్ఏను శుభ్రపరచడమూ అంతటి సువాసనకు మరొక కారణమని శాస్త్రవేత్తలు అంటారు. కొన్ని రకాల రోజాలలో ఈ ఎంజైమ్ ఉండకపోవచ్చు. దీనితోపాటు రోజాలలో ఆకర్షణీయమైన రంగులు, త్వరగా వాడిపోకుండా ఉండటానికి కూడా కొన్ని ఎంజైములే కారణమని వారంటున్నారు. సాధారణంగా సువాసన 'పూల సంరక్షణ కోసమే' అని అంటారు. దీనితోనే ఫలదీకరణ సంకేతాలు వ్యాపిస్తాయి. రకరకాల రసాయనాలు పూలలో లేకపోతే వాటి ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. సువాసనలతో పూలలోని పుప్పొడి రేణువులకు ఫలదీకరణ చెందే సమయం వచ్చినట్లుగా నిర్ధారణవుతుందని శాస్త్రవేత్తలు అన్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, పూలను నాశనం చేసే కొన్ని రకాల కీటకాలు దగ్గరగా వచ్చినప్పుడు అవి సువాసనకు బదులు చెడువాసనను ఇచ్చే 'స్టెరాయిడల్ గ్లైకోసైడ్స్' (Steroidal glycosides) ను విడుదల చేస్తాయని కూడా వారంటున్నారు. పూలు తమ రెక్కలలోకూడా సువాసనలు వెదజల్లే రసాయనాలను నిలువ వుంచుకొంటాయి. వేడి వాతావరణంలో ఈ రెక్కల్లోని రసాయనాలు లేదా ద్రవాలు ఆవిరైన కారణంగా సువాసనలు విడుదలవుతాయి. దీంతో కీటకాలు వాటి దరిచేరతాయి.

**డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి**
సెల్: 94404 32464

నమ్మలేని నిజం

## డీఎన్ఏ చుట్టలు విప్పితే?



**మానవ** శరీరంలోని మొత్తం డీఎన్ఏ అణువులను అలా ఒకదాని చివరన మరొక దానిని పేరుస్తూ పోతే, అవి సూర్యుని నుంచి ప్లూటో వరకు మొత్తం 17సార్లు వచ్చి వెళ్లినంత దూరాన్ని ఆక్రమిస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. మానవ జినోమ్ (మనిషి ప్రతి కణంలోని జన్యుసంకేతం)లో మొత్తం 23 డీఎన్ఏ అణువులు (క్రోమోజోమ్స్) ఉంటాయి. ఒక్కోటి 5 లక్షల నుంచి 25 లక్షల వరకు న్యూక్లియోటైడ్ జతలను కలిగి ఉంటాయి. డీఎన్ఏ అణువుల పరిమాణం 1.7 నుంచి 8.5 సెం.మీ., చక్కగా విప్పితే (Uncoiled) ఒక్కోటి సగటున 5 సెం.మీ. వరకూ పొడవును కలిగి ఉంటాయి. ఈ లెక్కన మానవ శరీరంలో మొత్తం సుమారు 37 ట్రిలియన్ (లక్ష కోట్లు) కణాలున్నాయి. ఈ అన్ని డీఎన్ఏ అణువుల చుట్టలను విప్పేసి ఒకదాని చివరన మరొక దానిని పేర్చితే, వాటి మొత్తం పొడవు, సూర్యుని నుంచి ప్లూటో వరకు మొత్తం 17 సార్లు వెళ్లి వచ్చినంత దూరం అని తేలింది. మన డీఎన్ఏ గురించిన మరొక ఆసక్తికరమైన జీవశాస్త్రాద్భుతం ఏమిటంటే, మనలో ప్రతి ఒక్కరం మానవులలోని ప్రతి ఒక్కరిలోని 99 శాతం డీఎన్ఏ వాటాను కలిగి ఉంటాం. అంటే, కేవలం 1 శాతం డీఎన్ఏ మాత్రమే వేరుగా ఉంటుందన్న మాట. ఇదీ సృష్టి గొప్పతనం!

మేధో సాంకేతికత

# మన మెట్రో.. ఘనకీర్తి

'మన మెట్రో-మన ఆత్మగౌరవం'గా ప్రజల హృదయాలలో ఆత్మీయస్థానం సంపాదించుకొన్న 'హైదరాబాద్ మెట్రో' ఇటీవలె తొలిదశను దాదాపు పూర్తి చేసుకొంది. జంటనగరాల ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చేలా, మరిన్ని కారిడార్‌లతో విస్తరింపజేయడానికి మలిదశ నిర్మాణం వైపు మన ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలోనే 'మన మెట్రో'పై ప్రత్యేక కథనం చదువండి.


హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ మెట్రో స్టేషన్

- ప్రపంచస్థాయికి ప్రజారవాణా వ్యవస్థ
- పలు జాతీయ, అంతర్జాతీయ రికార్డులు
- విశ్వనగరానికి మరపురాని మణిహారం

**రెండు రాష్ట్రాల** తెలుగువారు తమ ఇష్ట ప్రదేశమైన హైదరాబాద్‌లో మునుపెన్నడూ లేని హైటెక్/ ఇంటెలిజెన్స్ (మేధో) సాంకేతికతతో కూడిన 'మెట్రో రైలు యానాన్ని' గత కొన్నాళ్లు (2017 డిసెంబర్ 29నుంచి)గా సాగిస్తున్నారు. ఇవాళ ఇది ఎంత సౌలభ్యమందంటే, చాలామందిలో ఎవరిని అడిగినా 'దానినే' తొలి ప్రాధాన్యంగా ఎంచుకొంటున్నారు. కారణం, అందరికీ తెలిసిందే. సిగ్నళ్లు, ట్రాఫిక్, దూరభారాల బాధలు లేకుండా ఎంతో వేగవంతంగా గమ్యస్థానానికి చేరుకోగలగడమే. కాగా, ఇటీవలె (7వ తేదిన) రెండవ కారిడార్ (జేబీఎస్-ఎంజీబీఎస్) ప్రారంభంతో ఈ ప్రాజెక్టు తొలిదశ (ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు కొద్దిదూరం మినహా) దాదాపు పూర్తయినట్లే. 'నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్' (మూడు) మార్గాల్లో కలిపి మొత్తం 69 కి.మీ. దూరం అందుబాటులోకి వచ్చింది. సాంకేతిక పరిజ్ఞానంలో 'హైదరాబాద్ మెట్రో' ఢిల్లీ మెట్రో కంటే కూడా ఎంతో గొప్పదన్న ప్రశంసలూ వచ్చాయి.

ఆధునిక ప్రపంచం అభివృద్ధిలోను, మానవాళి అవసరాలను తీర్చడంలోనూ అత్యంత ముఖ్యపాత్రను పోషిస్తున్నది రవాణా రంగం. 'ఎక్కడివాళ్లు అక్కడే' ఉంటే అంతా గప్‌చుప్‌గా ఉండొచ్చు. కానీ, ప్రగతి వేగం పుంజుకోదు. అందుకే, పొద్దున లేచింది మొదలు ప్రతీ ఒక్కరికీ 'ఎక్కడికో ఒక దగ్గరకు, ఎంతో కొంత సమయం పాటు' ప్రయాణం తప్పనిసరైంది. కొన్ని దశాబ్దాల కిందటివరకు మన హైదరాబాద్ మహానగరంలోనూ ఎడ్లబండ్ల ప్రయాణాలు జరిగినట్లు చరిత్ర చెబుతున్నది. ఎద్దులు, గుర్రాలు తదితర పెంపుడు జంతువులతో నడిచే బండ్లనుండి మనిషియానం గత కొన్ని దశాబ్దాలుగా యాంత్రిక వాహనాల పైకి చేరింది. ప్రపంచంలో ఇప్పటికే ఎంతో ముందున్న న్యూయార్క్, హాంగ్‌కాంగ్, లండన్, టోక్యో, మాస్కో, సియోల్, సింగపూర్, ప్యారిస్, స్టాక్‌హోమ్, ఏథెన్స్ వంటి మహానగరాలలో వేగవంతమైన, అత్యధికులను చేరవేసే రవాణా (Rapid transit or mass rapid transit) విధానాలు (హెవీ రైల్, మెట్రో, సబ్‌వే, ట్యూబ్, యు-బాహ్న్ లేదా భూగర్భం) అందుబాటులోకి వచ్చాయి. మన జంటనగరాలలో మెట్రో ప్రాజెక్ట్‌వల్ల 'పర్యావరణానుకూలమైన, ఆధునాతన స్వయంచలన విద్యుత్ వాహనాలు'గా రైల్‌కార్లు అందుబాటులోకి వచ్చాయి.

ప్రజారవాణాగా ప్రారంభమైన 'హైదరాబాద్ మెట్రో' సుమారు 26 నెలల్లోనే కేవలం మూడు మార్గాలలోనే రోజుకు 4 లక్షలకు పైగా ప్రయాణీకులను చేరవేస్తున్నది. దీన్నిబట్టి, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకొంటూ, ఎంతోమంది విలువైన సమయాన్ని ఆదాచేసుగలుగుతున్నాం. అతిత్వరలోనే తెలంగాణ రాష్ట్ర కిరీటంలోని అద్భుత మణులలో ఒకటిగా ఒదిగిపోయిన 'హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు' ప్రస్తుత తొలిదశ నాటికే పలు ప్రతిష్ఠాత్మక ఘనతలను సొంతం చేసుకోవడం విశేషం. తెలుగువారికి అందుబాటులోకి వచ్చిన ఈ తెలివైన (ఇంటెలిజెంట్) రవాణా దేశంలోనే ('ఢిల్లీ మెట్రో' తర్వాత) రెండో అతిపెద్దది (69.2 కి.మీ.పొడవు)గా రికార్డును సృష్టించింది. అలాగే, ప్రపంచంలోనే అతిపెద్ద 'పీపీపీ' (public-private partnership) ప్రాజెక్టు'గానూ దీనికి గుర్తింపు లభించింది. దీనితోపాటు మొత్తం 2,599 మెట్రో పిల్లర్లను నిర్మించిన మొట్టమొదటి కంపెనీగానూ 'ఎల్ అండ్ టీ మెట్రో రైల్' (హైదరాబాద్) అరుదైన మరొక ప్రపంచ రికార్డునూ సొంతం చేసుకొన్నట్టు సంబంధిత అధికారులు ప్రకటించారు.

మొత్తం ప్రాజెక్టులోనే 'అత్యంత ఎత్తయిన మెట్రో స్టేషన్'గా 'జేబీఎస్-పెరేడ్ గ్రౌండ్' రికార్డు స్థాయిలో అయిదంతస్థులతో రూపొందింది. 3 లక్షల చదరపు అడుగుల మేర విస్తరించిన 'ఎంజీబీఎస్ ఇంటర్‌చేంజ్ మెట్రోస్టేషన్' వివిధ ప్రత్యేకతలతో 'దేశంలోనే అతిపెద్దది'గానూ అధికారులు తెలిపారు. ఒక రైలుమార్గం మీదుగా మరొకటి వెళ్లేలా మూడు స్థాయిలలో, మూడు కారిడార్ ల్యాండ్‌లు ఏర్పడ్డాయి. వీటి నడుమ అంతరమార్పుల కోసం (interline exchange) స్టేషన్‌హౌజ్‌లను అరుదైన పద్ధతిలో నిర్మించారు. ప్రస్తుతం రోజుకు కనీసం 4 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్న మన ఈ 'స్వయంచలిత మెట్రో వ్యవస్థ' (automated metro network) రానున్న కొద్దికాలంలోనే 10 లక్షల మందిని చేరవేయవచ్చునని అంచనా. ఢిల్లీ మెట్రోకంటే కూడా మెరుగైన, ఆధునాతనమైన ఆటోమేటిక్ వ్యవస్థలు 'హైదరాబాద్ మెట్రో' సొంతమని వారంటున్నారు. కియోలిస్ (Keolis Hyderabad Mass Rapid Transit System Pvt Ltd: KHMRTS) సాంకేతిక పనితనంతో రానున్న కాలంలో ప్రపంచస్థాయి (world-class) మెట్రోగా దీనిని తీర్చిదిద్దనున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎడ్వర్డ్ థామస్ పేర్కొన్నారు.

'క్యూఆర్' సంకేతాల ఆధారంగా పనిచేసే 'ఈ-టికెటింగ్' వ్యవస్థ (QR code-based ticketing) నుకూడా దేశంలోనే తొలిసారిగా మన మెట్రోలోనే ప్రవేశపెట్టడం విశేషం. ఈ విధానంలో ప్రయాణికులు ముందుగానే మూడు రకాల టికెట్లను బుక్ చేసుకోవచ్చు. సింగిల్ (ఒకే దఫా), రిటర్న్ (తిరుగు రవాణా)కోసం ఒకటి, లేదా రెండు మార్గాలకు, ట్రిప్ పాస్, స్టోర్ వ్యాల్యూ పాస్‌లుగానూ దీనిని వినియోగించుకోవచ్చు. దీనివల్ల టికెట్ లేని ప్రయాణాలకు పూర్తిగా చెక్ పడినట్లే. 'ఈ రకమైన టికెటింగ్ విధానానికి ప్రయాణికులనుండి అనూహ్య స్పందన లభిస్తున్నదని' మెట్రో అధికారులు తాజాగా వెల్లడించారు. ఇటీవలి సోమవారం (10వ తేదిన) ఒక్క సాధారణ రోజులోనే మూడు కారిడార్‌లలో కలిపి మొత్తం 4,47,009 మంది మెట్రోరైళ్లలో ప్రయాణించినట్లు వారు తెలిపారు.

'హైదరాబాద్ మెట్రో రైలు' ప్రయాణం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎత్తయిన వంతెనల మీదుగా మనకిష్టమైన నగరంలోని ఉపరితలంపై ఆకాశంలో విహరిస్తున్నట్టుగా కారువంటి (చిన్న) రైలు (Railcar)లో, అలా దూసుకు వెళుతుంటే అరుదైన దృశ్యాలెన్నో కనువిందు చేస్తుంటాయి. అప్పట్లో (2017) టికెట్ ధర ఎక్కువనో, నివాసప్రాంతాలకు దగ్గరగా స్టేషన్లు లేవనో, మరేదో కారణంతోనో వెనుకా ముందైన ప్రయాణికులు సైతం ఇటీవలి కాలంలో 'మెట్రో'కే పూర్తిగా తొలి ప్రాధాన్యమిస్తున్నారన్నది పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యే చెబుతున్నది. దీనికి ప్రధాన కారణం, కాలుష్యానికి అతీతంగా, రోడ్డు మార్గం కంటే వేగంగా, సురక్షితంగా వెళ్లగలుగుతుండడమే. 'ఒక రవాణా వ్యవస్థ ఉత్తమమైందిగా ఎప్పుడు అవతరిస్తుంది?' అంటే, కాలుష్యకారక ఉద్గారాల రహితంగా, వాతావరణ నియంత్రణ, అత్యధిక సాంకేతికతలతో కూడుకొని, సురక్షితం, సౌకర్యవంతం, సుఖవంతం, సమర్థవంతమైన ప్రయాణ విధానాలను కలిగి ఉన్నప్పుడే! ప్రపంచ మెట్రో రవాణా వ్యవస్థలోనే అత్యుత్తమమైన వ్యవస్థలుగా పేరెన్నికగన్న కొద్ది అంతర్జాతీయ మెట్రోల సరసన భవిష్యత్తులో మన హైదరాబాద్ మెట్రో కూడా చేరాలని అందరం మనసారా కోరుకొందాం.

**దోర్బల బాలశేఖరశర్మ**

### సమయం అంటే ఇదే మరి!

*కాలం ఎవరికైనా విలువైందే. కానీ, భారతీయ రైళ్లకు ఎలాంటి టైమ్ టేబులూ వర్తించదేమో. 'నిన్నటి రైలు ఇవాళ రావడం' మనకేం కొత్త కాదు. అనేకమంది చాలా విషయాల్లో అసలు సమయం పాటించరు. కానీ, జపాన్‌కు చెందిన టోక్యోలోని భూగర్భ (మెట్రో) వ్యవస్థను చూసి మనం వాచీల్లో సమయం సరిదిద్దుకోవాల్సిందే. ఆ రైళ్లు అంత కచ్చితత్వాన్ని పాటిస్తాయన్న మాట. సుమారు 157 సంవత్సరాల కిందట (1863లో ప్రారంభం) ఏర్పడిన ప్రపంచ అతిపురాతనమైన, (మొట్టమొదటిది కూడా) లండన్ భూగర్భ (మెట్రో) వ్యవస్థ రోజుకు 1.35 బిలియన్ (135 కోట్లు) ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తుంది. 30 ఏళ్ల కిందటి హాంగ్‌కాంగ్ ఎంటీఆర్ వ్యవస్థలో ఇంటెలిజెంట్ సెన్సర్లు, ఆటోమేటిక్ టికెటింగ్ వ్యవస్థలు ఉన్నాయి. మాస్కో మహానగరంలో 14 లైన్లలో నడిచే మెట్రో స్టేషన్లు కళాత్మక మ్యూజియాలను తలపిస్తాయి. ఇలా రాస్తూ పోతే, ప్రపంచ మహానగరాలలోని అనేక మెట్రోలలో తమవైన ప్రత్యేకతలు ఎన్నో కనిపిస్తాయి.*


లండన్‌లోని భూగర్భ మెట్రో స్టేషన్

**మన సమాచార ప్రపంచంలో రాజకీయాలు, వినోదం, క్రీడలు తప్ప సైన్సుకు సంబంధించిన విషయాలకు అంతగా చోటుండటం లేదు. ఇది చాలా దారుణమైన పరిస్థితి. మన ఉనికికి కారణమైన సైన్సు గురించి తెలుసుకోకుండానే బతుకులు కొనసాగుతున్నాయి. కూడు, గుడ్డ, గూడు గురించి తెలుసుకుంటే సైన్స్‌లో మొదటి పాఠాలు తెలుసుకున్నట్టు లెక్క. ఈ మూడింటినికూడా అర్థం చేసుకోకుండానే మనమంతా బతుకుతున్నాం. కనుకనే మనిషికి, సైన్సుకు మధ్యన వార్ వస్తున్నది. అది వారధిగా మారాలి. అప్పుడే బతుకులు మరింత అర్థవంతంగా కొనసాగుతాయి.**

# అందరికీ పరిశోధనల ఫలాలు!

వి'జ్ఞానం'



**పశ్చిమ ఆఫ్రికాలో** ఎబోలా వైరస్ కారణంగా పెద్ద ఎత్తున వ్యాధి ప్రబలింది. 2014లో ఈ మహమ్మారి ఆఫ్రికాలో పెద్ద కలవరానికి కారణమైంది. అక్కడ వ్యాధికి గురైన ఒక ఆడమనిషి అమెరికాకు వెళ్ళింది. ఆమె శరీరంలోనుంచి ఈ వ్యాధికి కారణమైన ఎబోలా వైరస్ నమూనాలను అక్కడి పరిశోధకులు బయటకు తీసుకున్నారు. వాటి ఆధారంగా పరిశోధనలు జరిపారు. 'రీజనరాన్' (Regeneron) మందుల కంపెనీవారు వ్యాధికి టీకా మందును తయారుచేశారు. అయితే వారు క్రిములకోసం ఆఫ్రికాను సాయం అడగలేదు. అసలు ఎవరి సాయమూ అడగలేదు. కనుక తయారుచేసిన మందును ఆఫ్రికా దేశానికి అందజేయవలసిన నైతిక బాధ్యత ఆ కంపెనీ వారిమీద లేదు. 'అందరికీ పంచివ్వాలి' అంటే ఆ కంపెనీ వారు బహుశా ఆ పరిశోధన మీద అంత మనసు పెట్టి ఉండేవారు కాదేమో. ఇది కేవలం మనసుకు సంబంధించిన విషయం కాదు. వ్యాపారానికి సంబంధించిన విషయం. పరిశోధనకు వారు పెద్ద ఎత్తున డబ్బుకూడా ఖర్చు పెట్టారు. కనుక ఆ డబ్బును తాము సంపాదించుకోవాలని అనుకోవడంలో మనలాంటి వాళ్లకు తప్పు కనిపించదు. కాంగో దేశంలో వ్యాధి మరొకసారి పెద్ద ఎత్తున వచ్చింది. అక్కడ కొత్త మందును వాడినట్టు కనబడుతున్నది. ఆ పని జరగకపోతే ఎన్నో ప్రాణాలు పోయే ఉండేవి. ఇక్కడ జరిగిన వ్యాపారం వివరాలు మాత్రం అంత సులభంగా అందుబాటులోకి రావడం లేదు.

ఈ పరిస్థితులలో అనుసరించవలసిన కొన్ని పద్ధతులు లేకపోలేదు. వాటిగురించి అందరికీ తెలిసే పద్ధతిలో విస్తృతంగా పరిశోధనలు జరగాలి. వచ్చిన ఫలితాలను ప్రపంచంలోని అందరితోనూ పంచుకోవడం ఒక నైతిక బాధ్యతగా పరిశోధకులు గుర్తించాలి. కంప్యూటర్‌లో దాగి ఉన్న జీవసంబంధ సమాచారం వాడుకునే వారందరూ కొన్ని కట్టుబాట్లకు లొంగి ఉంటామని స్వచ్ఛందంగా ఒప్పుకోవాలి. ఇక్కడ 'స్వచ్ఛందంగా' అన్న మాటకు ప్రాముఖ్యం ఉంది. 'సమాచారం ఎవరి సొత్తు' అన్న ప్రశ్న గురించి తీవ్రమైన అనుమానాలు తలెత్తుతాయి. ఆ పక్కకు పోకుండా పరిశోధకులు వచ్చిన ఫలితాలను అందరికీ ఉపకరించే విధంగా అవసరమైన వారు అందరితోనూ పంచుకుంటామన్న పెద్ద మనసును ప్రదర్శించాలి. అటువంటి సందర్భంలో పరిశోధనకు కావలసిన ఖర్చులనుకూడా కంపెనీల వారు మాత్రమేకాక వివిధ దేశాల ప్రభుత్వాలు సైతం భరించే వీలు ఉంటుంది. పరిశోధనా ఫలితాలు, వ్యాపార సరళికి చేరిన తరువాత పరిస్థితి మారుతుంది.

అప్పటి వరకు పరిశోధన కేవలం మానవాళికి ఉపయోగపడుతుందన్న దృష్టితో మాత్రమే జరగాలి. ప్రైవేటు కంపెనీలు కూడా ఈ దృష్టితోనే పరిశోధనకు పూనుకోవాలి. అన్ని పరిశోధనలు ప్రభుత్వరంగ సంస్థలలో జరగాలంటే అందుకు తగిన వెసులుబాటు ఉండకపోవచ్చు. ఇటువంటి విషయాలను గురించి చర్చించవలసిన సమయం వచ్చింది. సైన్స్ అంటే ఏవో ఆసక్తికరమైన విషయాలు మాత్రమే అనుకునే వారికి పైన చెప్పిన సంగతులు లాగా కనిపించకపోవచ్చు. సైన్సు ఒక ఎత్తు అయితే, దాని విధానం మరొక ఎత్తుగా మానవాళి ముందు నిలుస్తున్నది. 'సైన్సుకు విలువలు లేవు' అని ఒకప్పుడు అనేవారు. అంటే, 'అది మంచి చెడ్డలను గురించి ఆలోచించదు' అని అర్థం. పరిశోధకులు విషరసాయనాల గురించి కూడా కృషి చేస్తారు. వాటిని తగిన పద్ధతిలో ఉపయోగించుకునే వీలు ఉంటుంది. కానీ, ఈ ప్రపంచంలోనే మనుషులందరూ ఒకే రకంగా ఆలోచించరు. కనుక ఆ విషయాన్ని మనుషులకు అపాయం కలిగించే పద్ధతిలో కూడా వాడుకోవచ్చు.

వెనకట 'ఏజెంట్ ఆరెంజ్' అనే రసాయనం గురించి ఒక చర్చ జరిగింది. మొక్కలమీద చీడపీడలను నివారించడానికి ఈ మందును వాడుతారు. అయితే, ఈ మందును వియత్నాం యుద్ధంలో విమానాలనుంచి అక్కడి అడవులమీద చల్లారు. కింద ఉన్న చెట్ల ఆకులు రాలిపోయాయి. ఆ తర్వాత జరిగిన ఫలితాలను ఎవరైనా ఊహించవచ్చు. 'సైన్సుకు విలువలు లేవు' అన్న పరిస్థితిలోనుంచి, విలువలను ఆపాదించిన వలసిన పరిస్థితిలోకి మనిషి చేరుకున్నాడు. సైన్స్‌కూడా చేరుకున్నది. సైన్స్‌వల్ల మంచి మాత్రమే జరగాలి. కత్తితో మంచి పనులు చేయవచ్చు. మరొకరిని పొడిచి చంపవచ్చు కూడా. అప్పుడు తప్పు కత్తిది కాదు. దాన్ని వాడుతున్న మనిషిది. సైన్స్ విషయంలోకూడా ఇదే పరిస్థితి ఉండాలి. ఉండి తీరాలి. సైన్స్‌లో రహస్యాలు ఉన్నంత కాలం ఇటువంటి పరిస్థితి అంత సులభంగా రావడానికి వెసులుబాటు కలుగదు. తమ మీద తమకు ధ్యాస ఉన్న వారంతా సైన్స్‌గురించి కూడా వీలైనంత తెలుసుకోవాలి. అప్పుడే ప్రపంచంలో జరుగుతున్న మార్పులు చేర్పులను సరైన దృష్టితో అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

**డా॥ కె.బి.గోపాలం,** సెల్: 9849062055

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

ఐఏఎస్, ఐపీఎస్ తదితర సివిల్ సర్వీస్ పోస్టుల భర్తీ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) విడుదల చేసింది.

## ఓపెల్‌లో

ఓఎన్‌జీసీ పెట్రో అడిషన్స్ లిమిటెడ్ (ఓపెల్) టెక్నికల్ స్టాఫ్ భర్తీకి ప్రకటన విడుదలైంది.




- **మొత్తం ఖాళీలు:** 22
- **పోస్టులవారీగా ఖాళీలు:** క్రాకర్ ఆపరేషన్స్ (ఎగ్జిక్యూటివ్-2, సూపర్‌వైజర్ (గ్రేడ్-5), పాలిమర్ ఆపరేషన్స్ (ఎగ్జిక్యూటివ్-5, సూపర్‌వైజర్ (గ్రేడ్-6), ఫైర్ అసిస్టెంట్-1, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్-2, మార్కెటింగ్-1, హ్యూమన్ రిసోర్సెస్ ఎగ్జిక్యూటివ్-1 పోస్టు ఉన్నాయి.
- **అర్హతలు:** వేర్వేరు పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** www.opalindia.in

## సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2020




- **పరీక్ష పేరు:** సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2020
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 796
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** 21-32 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష (ప్రిలిమినరీ, మెయిన్స్), ఇంటర్వ్యూ/ పర్సనాలిటీ టెస్ట్ ద్వారా.
- **ప్రిలిమ్స్ పరీక్షతేదీ:** మే 31
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** రూ.100/-
- **చివరితేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** https://www.upsc.gov.in

### ఐఎఫ్ఎస్-2020

- ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్ (ఐఎఫ్ఎస్)-2020
- **మొత్తం ఖాళీలు:** 90
- **అర్హతలు:** ఆయా విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణత. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** 21 - 32 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష (ప్రిలిమినరీ, మెయిన్స్), ఇంటర్వ్యూ/ పర్సనాలిటీ టెస్ట్ ద్వారా

## సౌత్ ఇండియా బ్యాంక్‌లో

సౌత్ ఇండియా బ్యాంక్‌లో ప్రొబేషనరీ మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** ప్రొబేషనరీ మేనేజర్ (సీఏ)
- **మొత్తం ఖాళీలు:** 15
- **అర్హతలు:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాలో సభ్యుడై ఉండాలి.
- **వయస్సు:** 28 ఏండ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు మినహాయింపు ఇస్తారు.
- **పేస్కేల్:** రూ.31,705-45,950/-
- **ఎంపిక విధానం:** గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 23
- **వెబ్‌సైట్:** www.southindianbank.com

## బామర్ లారీస్‌లో

బామర్ లారీస్ కంపెనీ లిమిటెడ్‌లో స్పెషల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదలైంది.




- **మొత్తం ఖాళీలు:** 40
- ఈ పోస్టులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీలేయర్ కేటగిరీల్లో ఉన్నాయి.
- **పోస్టుల వారీగా ఖాళీలు:** అసిస్టెంట్ మేనేజర్-19, డిప్యూటీ మేనేజర్-6, మేనేజర్-3, సీనియర్ మేనేజర్-6, చీఫ్ మేనేజర్-5, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్-1 ఉన్నాయి.
- **అర్హతలు:** బీఈ/బీటెక్, ఎంబీఏ,ఎంఎస్‌డబ్ల్యూ, సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎస్
- **జీతం:** రూ. 40,000-90,000/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 9
- **వెబ్‌సైట్:** https://www.balmerlawrie.com

# ఫజల్ అజేయ సెంచరీ

విదర్భ 242/4
హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** కెప్టెన్ ఫైజ్ ఫజల్ (126 బ్యాటింగ్; 15 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ శతకంతో చెలరేగడంతో హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో విదర్భ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతున్నది. కెప్టెన్‌తో పాటు గణేష్ సతీశ్ (65) రాణించడంతో గురువారం ఆటముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో రవికిరణ్ 2, సిరాజ్, అనికేత్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. చేతిలో ఆరు వికెట్లు ఉన్న విదర్భ.. ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 30 పరుగులు వెనుకబడి ఉంది. ప్రస్తుతం ఫజల్‌తో పాటు అక్షయ్ వాడ్కర్ (9) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 239/7తో రెండో రోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ చివరకు 272 పరుగులకు ఆలౌటైంది. ప్రతీక్ రెడ్డి (83) క్రితం రోజు స్కోరుకు 7 పరుగులు జతచేయగా.. మెహదీ హసన్ (30), మహమ్మద్ సిరాజ్ (22) విలువైన పరుగులు జోడించారు.

# ఎంగ్డీ మ్యాజిక్

ఇంగ్లండ్‌పై దక్షిణాఫ్రికా ఉత్కంఠ విజయం




**ఈస్ట్ లండన్ (దక్షిణాఫ్రికా):** పేస్ బౌలర్ లుంగి ఎంగ్డీ చివరి రెండు ఓవర్లలో మ్యాజిక్ చేయడంతో ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20లో దక్షిణాఫ్రికా ఉత్కంఠ విజయం సాధించింది. ఓ మోస్తరు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ విజయానికి చివరి ఓవర్‌లో 7 పరుగులు అవసరం కాగా.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఎంగ్డీ (3/30) ఐదు రన్స్ మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టి సఫారీ జట్టుకు విజయాన్నందించాడు. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లకు 177 పరుగులు చేసింది. బవుమా (43), డికాక్ (31), డసెన్ (31) తలా కొన్ని పరుగులు చేశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 176 పరుగులు చేసింది. జేసన్ రాయ్ (38 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), కెప్టెన్ మోర్గన్ (52; 7 ఫోర్లు, ఒక సిక్స్) విజృంభించడంతో ఇంగ్లండ్ విజయం నల్లేరుపై నడకే అని భావిస్తే.. చివర్లో ఒత్తిడికి గురైన ఇంగ్లిష్ జట్టు పరుగు తేడాతో ఓటమి పాలైంది. చాన్నాళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో రీఎంట్రీ ఇచ్చిన దక్షిణాఫ్రికా పేస్ గన్ స్టెయిన్ (1/33) ఫర్వాలేదనిపించాడు.



# అమిత్ పంగల్ నంబర్‌వన్

**న్యూఢిల్లీ:** భారత స్టార్ బాక్సర్ అమిత్ పంగల్ 52 కేజీల విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌కు దూసుకెళ్లాడు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) బాక్సింగ్ టాస్క్‌ఫోర్స్ గురువారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అమిత్ 420 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. దశాబ్ద కాలంలో ఓ భారత బాక్సర్ వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ సాధించడం ఇదే తొలిసారి. అంతకు ముందు విజేందర్ సింగ్ (2009లో) ఈ ఘనత సాధించాడు. గత మూడేండ్లుగా నిలకడైన ప్రదర్శన కొనసాగిస్తున్న అమిత్.. 2018లో ఆసియా గేమ్స్, కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణాలు నెగ్గడంతో పాటు గతేడాది ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచాడు. టోక్యో ఒలింపిక్స్ అర్హత టోర్నీకి ముందు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ దక్కడం చాలా ఆనందంగా ఉందని అమిత్ పేర్కొన్నాడు. 'క్వాలిఫయర్స్‌కు ముందు ఈ ఘనత దక్కడం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రపంచ నంబర్‌వన్‌గా రింగ్‌లో అడుగు పెట్టనుండటం ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. ఇదే ఊపులో తొలి క్వాలిఫయర్ టోర్నీలోనే ఒలింపిక్ బెర్త్ దక్కించుకోవాలనుకుంటున్నా'అని పంగల్ అన్నాడు. ఇతర విభాగాల్లో మనీశ్ కౌశిక్ (63 కేజీలు) 12వ ర్యాంక్‌లో, శివ థాపా (69 కేజీలు) 36వ స్థానంలో నిలిచారు. మహిళల ర్యాంకింగ్స్‌లో ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీకోమ్.. 51 కేజీల విభాగంలో ఐదో స్థానం దక్కించుకోగా.. ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధించేందుకు మేరీతో బౌట్ నిర్వహించాలని పట్టుబట్టి పోటీలో ఓటమి పాలైన తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ 22వ స్థానంలో నిలిచింది. భారత్ నుంచి లవ్లీనా బోర్గోహైన్ (69 కేజీలు) అత్యుత్తమంగా మూడో స్థానం దక్కించుకుంది.

**వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ చేతిలో క్లీన్‌స్వీప్‌నకు గురయ్యాక సంప్రదాయ ఫార్మాట్‌లో సత్తాచాటాలని టీమ్‌ఇండియా కసిమీద ఉన్నది. వన్డేల్లో కాంబినేషన్లు సఫలం కాకపోవడంతో టెస్టు సిరీస్‌లో తుదిజట్టు కూర్పు విషయంలో మరింత జాగ్రత్త వహించాలని మేనేజ్‌మెంట్ యోచిస్తున్నది. ఓపెనింగ్ జోడీ సహా.. స్పిన్నర్‌గా అశ్విన్, జడేజాల్లో ఎవరిని ఆడించాలనే విషయంలోనూ సందిగ్ధం ఉంది. ఈ తరుణంలో అసలు టెస్టు పోరాటానికి ముందు న్యూజిలాండ్ ఎలెవెన్‌తో నేటి నుంచి టీమ్‌ఇండియా మూడు రోజుల సన్నాహక మ్యాచ్ ఆడనుంది. ఈ వామప్ పోటీలో ప్రదర్శనను బట్టి తుది జట్టుపై స్పష్టత తెచ్చుకోవాలని టీమ్‌ఇండియా భావిస్తున్నది.**

# సన్నాహక పోరు



నేటి నుంచి భారత్ - న్యూజిలాండ్ ఎలెవెన్ వామప్ మ్యాచ్
సత్తాచాటాలని టీమ్‌ఇండియా యువ ఆటగాళ్ల తహతహ

**హామిల్టన్:** న్యూజిలాండ్ గడ్డపై పరిమిత ఓవర్ల పోరు తర్వాత సంప్రదాయ టెస్టు సిరీస్ కోసం టీమ్‌ఇండియా కసరత్తులు చేస్తున్నది. కివీస్‌పై టీ20ల్లో ఘనమైన ఫలితం వచ్చినా.. వన్డేల్లో క్లీన్‌స్వీప్ ఎదురవడంతో మరింత జాగ్రత్తగా ముందుకెళ్లాలని ఆలోచిస్తున్నది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి ఇక్కడి సెడాన్ పార్క్ మైదానంలో జరిగే మూడు రోజుల సన్నాహక మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఎలెవెన్‌తో టీమ్‌ఇండియా తలపడనున్నది. ఈ మ్యాచ్‌ను సద్వినియోగం చేసుకొని టెస్టు సిరీస్‌లో పక్కా ప్రణాళికతో అడుగుపెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. వామప్ గేమ్‌లో సత్తాచాటి టెస్టు సిరీస్ తుదిజట్టులో చోటు దక్కించుకోవాలని భారత యువ ఆటగాళ్లు సైతం పట్టుదలగా ఉన్నారు. ప్లేయర్ల ప్రదర్శనను బట్టే టెస్టు సిరీస్ తుదిజట్టు గురించి ఆలోచించాలని టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ సైతం భావిస్తున్నది. న్యూజిలాండ్ ఎలెవెన్ జట్టు సోధీ, నీషమ్, స్టిఫర్ట్ లాంటి సీనియర్ ఆటగాళ్లతో కళకళలాడుతుండడంతో ఈ వామప్ మ్యాచ్ భారత ఆటగాళ్లకు మంచి సన్నాహకంగా ఉండనుంది. టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగమైన భారత్ – న్యూజిలాండ్ మధ్య రెండు టెస్టుల సిరీస్ ఈనెల 21న ప్రారంభం కానుంది.

### గిల్ – షాకు కీలకం

గాయం కారణంగా భారత జట్టుకు స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ దూరమైనా.. కివీస్‌తో టెస్టు సిరీస్‌లో ఓపెనింగ్ స్థానానికి పోటీ తగ్గలేదు. సంప్రదాయ క్రికెట్‌లో అదరగొడుతున్న మయాంక్ అగర్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం దాదాపు ఖాయం కాగా.. మరో స్థానం కోసం పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్ మధ్య పోటీ ఉంది. షా, గిల్ ఇద్దరూ దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేస్తున్నారు. భారత్–ఏ తరపున కివీస్–ఏపై అనధికార టెస్టుల్లో ఇటీవలే గిల్ ద్విశతకం సహ ఓ సెంచరీతో చెలరేగాడు. దీంతో టెస్టుల్లో అరంగేట్రం చాన్స్ వస్తుందని అతడు ఆశిస్తున్నాడు. మరోవైపు పృథ్వీ షా వన్డే సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయినా.. దేశవాళీ ప్రదర్శనతో చోటు ఖాయమనే అనుకుంటున్నాడు. అయితే ఈ వామప్ మ్యాచ్‌లో కనబరిచే ప్రదర్శనను బట్టే అసలు సిరీస్‌కు ఓపెనింగ్ జోడీ ఖాయమయ్యే అవకాశాలున్నాయి. ఈ తరుణంలో ఓపెనింగ్ కోసం పోటీలో ఉన్న ముగ్గురు యువ బ్యాట్స్‌మన్ సన్నాహక మ్యాచ్‌లో సత్తాచాటాలని పట్టుదలగా ఉన్నారు.

### తిప్పేదెవరో..

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో టీమ్‌ఇండియా తుదిజట్టులో ఇద్దరు స్పిన్నర్లకు చోటు దక్కడం కష్టమే. దీంతో స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా మధ్య పోటీ తప్పేలా లేదు. సెడాన్ పార్క్ పిచ్ ఫ్లాట్‌గా ఉండడంతో వామప్ మ్యాచ్‌లో తన విభిన్న స్పిన్ మాయాజాలాన్ని చూపాలని అశ్విన్ భావిస్తున్నాడు. జడేజా సైతం పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో రాణిస్తున్నా... టెస్టు సిరీస్‌లో మాత్రం అశ్విన్‌కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ మ్యాచ్‌లో మరింత కట్టుదిట్టంగా బంతులేసి తుది జట్టు పోటీలోకి రావాలని జడ్డూ పట్టుదలగా ఉన్నాడు. మరోవైపు వన్డే సిరీస్‌లో వికెట్ తీయలేకపోయిన స్టార్ పేసర్ బుమ్రా సైతం సన్నాహక మ్యాచ్‌తో గాడిలో పడాలని అనుకుంటున్నాడు. విదేశీ సిరీస్‌ల్లో భారత్‌కు కీలక బౌలర్‌గా ఉన్న ఇషాంత్ ఈ సిరీస్‌కు దూరమవడంతో ఆ స్థానంలో వచ్చిన సైనీ తన మార్క్ చూపించాలని తహతహలాడుతున్నాడు.

## పృథ్వీతో పోటీ లేదు.. గిల్

కివీస్‌తో తొలి టెస్టులో చోటు దక్కితే అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో వృథా చేసుకోనని భారత యువ కెరటం శుభ్‌మన్ గిల్ అన్నాడు. అయితే, తుదిజట్టులో చోటు కోసం పృథ్వీ షాతో తాను పోటీ పడడం లేదన్నాడు. 'మా స్థానాల్లో ఇద్దరం బాగా ఆడుతున్నాం. తుది జట్టు ఎంపిక అనేది జట్టు మేనేజ్‌మెంట్ చేతిలో ఉంటుంది. ఎవరు ఆడాలో వారే నిర్ణయిస్తారు. నాకు ఓపెనింగ్ చేయడం కొత్తేం కాదు' అని గిల్ చెప్పాడు.

## జట్లు

**భారత్ :**
విరాట్ కోహ్లీ(కెప్టెన్), మయాంక్ అగర్వాల్, పృథ్వీ షా, అజింక్య రహనే(వైస్ కెప్టెన్), వృద్ధిమాన్ సాహా(వికెట్ కీపర్), హనుమ విహారి, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీ, ఉమేశ్ యాదవ్, అశ్విన్, రిషభ్ పంత్, నవ్‌దీప్ సైనీ, శుభ్‌మన్ గిల్

**న్యూజిలాండ్ ఎలెవెన్ :**
డేరిల్ మిచెల్(కెప్టెన్), టామ్ బ్రూస్, డేన్ క్లెవర్, హెన్రీ కూపర్, స్కాట్ కుగ్లీన్, జేమ్స్ నీషమ్, రచిన్ రవీంద్ర, టిమ్ స్టిఫర్ట్, ఇష్ సోధీ, టిక్నర్, విల్ యంగ్, 13వ ఆటగాడు జేక్ గిబ్సన్(శుక్రవారం), స్కాట్ జాన్‌స్టన్(శని, ఆదివారాలు)



## బుమ్రా దూకుడు పెంచాలి

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కాస్త రిస్క్ తీసుకొని.. మరింత దూకుడుగా బౌలింగ్ చేయాలని మాజీ బౌలర్ జహీర్ ఖాన్ అభిప్రాయపడ్డాడు. బుమ్రా.. వికెట్ టేకర్‌గా ఎంతో పేరు తెచ్చుకున్నాడని, దాన్ని నిలుపుకునేందుకు పోరాడాలని అన్నాడు. 'తన బౌలింగ్‌లో బ్యాట్స్‌మెన్ డిఫెన్స్ ఆడేందుకే ప్రాధాన్యమిస్తారని బుమ్రాకు తెలుసు. అందుకే బ్యాట్స్‌మెన్ తప్పిదం చేయాలని ఆశించకుండా వికెట్ తీసేందుకు అతడు కొత్త మార్గాలు వెతకాలి. కొన్ని పరుగులు ఇచ్చినా పర్వాలేదనుకొని... ఆడితీరాల్సిన బంతులను బ్యాట్స్‌మెన్‌కు వేయాలి. వికెటే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలి' అని జాక్ చెప్పాడు.



# మన్‌ప్రీత్‌సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'

ఈ అవార్డు పొందిన తొలి భారత ఆటగాడిగా రికార్డు

**లుసానే:** భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్‌కు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కింది. ఎఫ్ఐహెచ్ ఈ అవార్డులివ్వడం ప్రారంభించినప్పటి (1999) నుంచి ఓ భారత ఆటగాడు ఈ పురస్కారం దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఇటీవలి కాలంలో అద్భుత ప్రదర్శనతో జట్టును ముందుండి నడిపిస్తున్న 27 ఏండ్ల మన్‌ప్రీత్ అవార్డు వేటలో ఆర్థర్ వాన్ డారెన్ (బెల్జియం), లూకాస్ విల్లా (అర్జెంటీనా)ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచాడు. ఇప్పటి వరకు 260 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన మన్‌ప్రీత్.. 2012 లండన్, 2016 రియో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఎఫ్ఐహెచ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో దుమ్మురేపిన మన్‌ప్రీత్.. మన జట్టు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. 'కొంత కాలంగా మా జట్టు బాగా ఆడుతున్నది. టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం గొప్ప విజయంగా భావిస్తున్నా. ఎఫ్ఐహెచ్ అవార్డు దక్కడం సంతోషంగా ఉంది. ఈ పురస్కారాన్ని మా జట్టు సభ్యులకు అంకితమిస్తున్నా' అని మన్‌ప్రీత్ అన్నాడు.

# మెరిసిన జీవితేశ్



**హైదరాబాద్:** తెలంగాణ యువ చెస్ ఆటగాడు సాయిఅగ్ని జీవితేశ్ ఆకట్టుకున్నాడు. అహ్మదాబాద్ వేదికగా జరిగిన 40వ జాతీయ టీమ్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) తరఫున బరిలోకి దిగిన జీవితేశ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకంతో మెరిశాడు. మొత్తం ఆరు గేముల్లో ఐదింటిలో గెలువడం ద్వారా ఏఏఐకి రజతం దక్కడంలో కీలకమయ్యాడు. టీమ్ విభాగంలో పీఎస్‌పీబీకి స్వర్ణం, ఆర్ఎస్‌పీబీకి కాంస్యం లభించాయి. తెలంగాణ తరఫున ఆడిన ఇరిగేసి అర్జున్, భరత్‌కోటి, వినయ్ కుమార్, రాహుల్ శ్రీవాత్సవ్, గిరినాథ్ ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచారు.






# భారత్ X థాయ్‌లాండ్

ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్



**మనీలా (ఫిలిప్పీన్స్):** ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్ తొలి మ్యాచ్‌లో గెలిచి ఘనంగా బోణీ కొట్టిన భారత పురుషుల జట్టు రెండో మ్యాచ్‌లో అదే జోరు కొనసాగించలేకపోయింది. గ్రూప్–బిలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1–4తో మలేషియా చేతిలో ఓడింది. సింగిల్స్‌లో శ్రీకాంత్ మినహా.. మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ భారత ఆటగాళ్లు పరాజయం పాలయ్యారు. అయితే 'కరోనా వైరస్'భయంతో చైనా వంటి దేశాలు ఈ టోర్నీకి దూరంగా ఉండటంతో.. గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. మొదటి టైలో కజకిస్థాన్‌పై నెగ్గి గ్రూప్–బిలో రెండో స్థానం దక్కించుకున్న భారత్.. శుక్రవారం క్వార్టర్స్‌లో థాయ్‌లాండ్‌తో తలపడనుంది.



అలా సేదతీరుతూ..
**న్యూజిలాండ్‌లో సిరీస్.. సిరీస్‌కు మధ్య దొరికిన విరామ సమయాన్ని ఆస్వాదిస్తున్న కెప్టెన్ కోహ్లీ, అతని భార్య అనుష్క శర్మ, సైనీ, షమీ**

# గెలుపు చేజారింది

**హైదరాబాద్:** ఐఎస్ఎల్ ఆరో సీజన్‌లో సొంతగడ్డపై ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ గెలుపును చేజార్చుకుంది. ఇంజూరీ టైమ్‌లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీకి గోల్ సమర్పించి బుధవారం ఇక్కడి గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌ను హైదరాబాద్ 1–1తో డ్రాగా ముగించింది. 39వ నిమిషంలో నెస్టోర్ గోర్డిలో గోల్ చేయడం, చివరి వరకు ఆధిక్యం కొనసాగడంతో సొంత గడ్డపై హైదరాబాద్‌కు రెండో విజయం ఖాయమని అంతా అనుకున్నారు. అయితే, చివర్లో చేతులెత్తేసే అలవాటున్న హైదరాబాద్ మళ్లీ అదే తప్పిదం చేసింది. ఇంజూరీ సమయం మూడో నిమిషంలో జంషెడ్‌పూర్ ఆటగాడు సుమీత్ పస్సీ గోల్ బాది స్కోర్లను సమం చేశాడు.


